సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 349

శుక్రవారం 1-9-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'



ఎక్స్‌లో ఆడియో, వీడియోకాల్స్

ఫోన్ నంబర్‌తో పని లేకుండా యూజర్లతో కాల్స్‌ను కనెక్ట్ చేసుకోవచ్చు - 6లో



'వయాకామ్ 18' చేతికి..

రూ. 5,963 కోట్లకు భారత క్రికెట్ మ్యాచ్‌ల మీడియా హక్కులు సొంతం - 13లో



దక్షిణాఫ్రికాలో ఘోర విషాదం

దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 73 మంది చని పోయారు. మరో 52 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



'ఇండియా' భేటీ ప్రారంభం

'ఇండియా' కూటమి సమావేశం ముంబైలో ప్రారంభమైంది. ఎన్డీయే ఓటమే ధ్యేయంగా శుక్రవారం రోడ్‌మ్యాప్ ఖరారు చేయనున్నారు.

వివరాలు 6లో ▸



కశ్మీర్‌లో ఎన్నికలకు సిద్ధం

జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించేం దుకు సిద్ధంగా ఉన్నామని.. ఓటర్ల జాబితా పూర్తి కావచ్చిందని కేంద్రం తెలిపింది.

వివరాలు 6లో ▸



రైల్వే బోర్డు చీఫ్‌గా జయ వర్మ సిన్హా

రైల్వేబోర్డు తొలి మహిళా సీఈవో, చైర్‌పర్సన్‌గా జయవర్మ సిన్హా నియమితులయ్యారు. వచ్చే ఆగస్ట్ 31 వరకు విధుల్లో కొనసాగుతారు.

వివరాలు 6లో ▸

'అది' చంద్రబాబు, రామోజీ దుష్ట పన్నాగం

- వైఎస్ జగన్‌ను భూమ్మీద లేకుండా చేయడానికే ఆయనపై హత్యాయత్నం
- నేర చరిత్ర ఉన్న వ్యక్తి విమానాశ్రయం క్యాంటీన్‌లో ఎలా చేరాడు?
- కేసులో వాస్తవాలను మరుగు పరిచి, పూర్తిగా వక్రభాష్యం చెబుతూ ఈనాడు కథనం
- కోర్టు విచారణలో ఉన్నా పక్కదారి పట్టించే ప్రయత్నాలు
- ఎన్‌ఐఏను, ప్రజలను తప్పుదారి పట్టించడానికి వక్ర మార్గాలు.. కేసును నీరు గార్చడానికి ప్రయత్నాలు
- రామోజీ ఎన్ని జాకీలెత్తినా ప్రజాకోర్టులో బాబుకి, టీడీపీకి మళ్లీ ఓటమి తప్పదు
- విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ధ్వజం

3లో

పార్లమెంట్ 'ప్రత్యేక' భేటీ

ఈ నెల 18 నుంచి 5 రోజులపాటు నిర్వహణ

ఎజెండాను బయటపెట్టని కేంద్ర ప్రభుత్వం | ఒకే దేశం–ఒకే ఎన్నిక, మహిళా రిజర్వేషన్, యూసీసీ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం..

- ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో ప్రభుత్వం ఉందంటూ ప్రచారం
- అర్థవంతమైన, ఫలప్రదమైన చర్చల కోసం ఎదురు చూస్తున్నాం
- పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. దేశ ప్రజల్లో ఒక్కసారిగా ఆసక్తిని పెంచేసింది. ఐదు రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ గురువారం వెల్లడించారు. సెప్టెంబర్ 18 నుంచి 22 దాకా ఈ సమావేశాలు (17వ లోక్‌సభకు 13వ సెషన్, రాజ్యసభకు 261వ సెషన్) జరుగుతాయని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుత అమృతకాలంలో పార్లమెంట్‌లో అర్థవంతమైన, ఫలప్రదమైన చర్చల కోసం తాము ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. అయితే, పార్లమెంట్ ప్రత్యేక భేటీల ఎజెండా ఏమిటన్నది ప్రభుత్వం బయటపెట్టలేదు. దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్ 9, 10న జీ20 శిఖరాగ్ర సదస్సు జరుగనుంది. కూటమి దేశాల అధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జీ20 సదస్సు తర్వాత

మిగతా 6వ పేజీలో ▶

ఆ బిల్లుల ఆమోదానికేనా?

వన్ నేషన్–వన్ ఎలక్షన్, మహిళా రిజర్వేషన్, ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లులను మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుందని ఢిల్లీలో చర్చ జరుగుతోంది. ఇందులో వన్ నేషన్–వన్ ఎలక్షన్ బిల్లు అత్యంత ముఖ్యమైనది. దీన్ని ప్రవేశపెట్టడం వెనుక అసలు ఉద్దేశం వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలను ముందుకు జరపడమేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లో తెలంగాణ సహా 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. వీటితోపాటు సార్వత్రిక ఎన్నికలను నిర్వహించాలన్న ప్రతిపాదనపై బలమైన చర్చ జరుగుతోంది. కేంద్రం ముందస్తుకు వెళ్లే యత్నాల్లో ఉందని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు చెబుతున్నాయి. మరోవైపు దేశంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు 'వన్ నేషన్–వన్ ఎలక్షన్' విధానమే మార్గమని బీజేపీ నాయకులు అంటున్నారు. దేశమంతటా లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సూచిస్తున్నారు. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్' అమలుకు కనీసం 5 కీలక రాజ్యాంగ సవరణలు చేయాలి. అందుకు అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కావాలి. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అంశం జాతీయ లా కమిషన్ పరిశీలనలో ఉందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ గతంలోనే చెప్పారు.

'రికార్డు' సంస్కరణలు ప్రజలకు చెబుదాం

భూ సంస్కరణల ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి

రెవెన్యూ విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం: సీఎం జగన్

- సమగ్ర భూ సర్వేతో భూముల రికార్డుల ప్రక్షాళన.. రిజిస్ట్రేషన్ వ్యవస్థను నేరుగా గ్రామ సచివాలయాలకు తెస్తున్నాం
- ఇతర రాష్ట్రాల్లో మండలానికో సర్వేయర్.. మనకు ప్రతి గ్రామానికో సర్వేయర్ ఉన్నారు
- రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఇంట్లో నుంచే ఆ పని చేసుకునే టెక్నాలజీ తెస్తున్నాం.. భూ యజమానుల హక్కుల పరిరక్షణ, రికార్డుల్లో కచ్చితత్వానికి ఇవన్నీ దోహదం
- ఇన్ని సౌలభ్యాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తుంటే ఎల్లో మీడియాలో వక్రీకరణలు, దుష్ప్రచారం.. ప్రజల్లో ఆందోళన రేకెత్తించేలా తప్పుడు రాతలు

2లో



- వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.. మనం చేస్తున్న మంచి అంతా ప్రజల్లోకి వెళ్లాలి.. క్షుణ్ణంగా వివరించాలి
- జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షపై సమీక్షలో సీఎం జగన్

వైద్య విద్య పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ రద్దు

మళ్లీ మొదటి నుంచి నిర్వహణ

వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉత్తర్వులు

కొన్ని కళాశాలల్లో సీట్ల మధ్య వ్యత్యాసమే కారణం

శాంతిరామ్ వైద్య కళాశాల పేరిట ఫేక్ అనుమతులు

2లో



నారాసురుడే ఇసుకాసురుడు

మంత్రి పెద్దిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

అన్ని అనుమతులున్న రీచ్‌ల వద్ద టీడీపీ ధర్నాలా?

నాడు ఉచితం పేరుతో వంశధారను మింగేశారు.. నాగావళిని దోచేశారు.. గోదావరిని పిండేశారు.. కృష్ణా గర్భాన్ని కొల్లగొట్టారు

ఆ దోపిడీలో ప్రతి నెలా రూ.500 కోట్లు లోకేశ్‌కి వెళ్లేవి

10లో



అమెరికా చదువులకు ఐదుగురు గురుకుల విద్యార్థులు

2లో

- సీఎం జగన్ అభినందనలు
- రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం
- శాంసంగ్ ట్యాబ్‌లు అందజేత
- అమెరికా నుంచి వచ్చాక వారి ఉన్నత చదువుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు ఆదేశం

క్లుప్తంగా...


స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరుకు మూడో ర్యాంకు



నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.క్యాప్) జాతీయ స్థాయిలో చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో గుంటూరు నగరానికి మూడో ర్యాంక్ దక్కింది. దక్షిణ భారతదేశం నుంచి గుంటూరు నగరానికి మాత్రమే ర్యాంకు దక్కిందని మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, కమిషనర్ కీర్తి చేకూరి గురువారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 131 నగరాలు పోటీ పడగా, అందులో 10 లక్షల లోపు జనాభా కేటగిరిలో గుంటూరు నగరానికి 3వ ర్యాంక్ దక్కిందన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి 131 నగరాల్లో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లోని అంశాలను పరిశీలించి 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఉత్తమ నగరాలను సిఫార్సు చేసిందన్నారు. ఈ అవార్డును సెప్టెంబర్ 7న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి చేతుల మీదుగా అందుకోనున్నట్లు చెప్పారు.

విశాఖ 'ఉక్కు'కు టాటా ఇంటర్నేషనల్ బాసట

తీరనున్న ముడి పదార్థాల కొరత



ఉక్కునగరం (గాజువాక): ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు టాటా ఇంటర్నేషనల్ సంస్థ సాయం అందించడానికి ముందుకు వచ్చినట్లు తెలిసింది. ఈ సాయం స్టీల్‌ప్లాంట్‌కు కొంతమేర ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నట్లు స్టీల్‌ప్లాంట్ వర్గాలు తెలిపాయి. స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు అవసరమైన ముడి పదార్థాల కొరత వల్ల ఏడాదిన్నరగా బ్లాస్ట్‌ఫర్నేస్–3ను నిలిపివేసిన విషయం తెలిసిందే. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం రుణాల కోసం పలు రకాలుగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ముడిపదార్థాల సరఫరా, వర్కింగ్ క్యాపిటల్ కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)ను ప్రకటించింది. ఈ చర్చల్లో భాగంగా టాటా ఇంటర్నేషనల్ రూ.800 కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా ఇవ్వడానికి ముందుకు వచ్చినట్టు సమాచారం. దీంతో ప్లాంట్‌కు అవసరమైన ముడిపదార్థాల కొనుగోలు చేయనున్నారు. వర్కింగ్ క్యాపిటల్ సమస్య తీరితే మూడో బ్లాస్ట్‌ఫర్నేస్‌లో ఉత్పత్తి ప్రారంభానికి మార్గం సుగమమైనట్లే.

విశాఖ వేదికగా సదరన్ రీజియన్ భూ సదస్సు

సాక్షి, విశాఖపట్నం: మరో కీలక సదస్సుకు విశాఖ వేదిక కానుంది. భూములకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు దక్షిణాది రాష్ట్రాల రెవెన్యూ సదస్సు విశాఖలో నిర్వహించనున్నారు. 14న ప్రారంభమై 3 రోజుల పాటు సదరన్ రీజియన్ ల్యాండ్ కాన్ఫరెన్స్ జరగనుందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించిన నూతన చట్టాలు, నిబంధనలపై అవగాహన, ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు వినియోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై ఆయా రాష్ట్రాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు చర్చించనున్నారు.

20,215 మందికి సీట్ల కేటాయింపు

సాక్షి, అమరావతి: ఏపీ ఈసెట్–2023 తుది దశ ప్రవేశాల ప్రక్రియ ముగిసినట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 31,949 మంది ఈసెట్‌లో అర్హత సాధించారన్నారు. ఇందులో 21,941 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 21,577 మంది క్వాలిఫై అయ్యారన్నారు. వీరిలో 20,215 మందికి సీట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు.

ఇదండీ వరస



పొత్తు లేకుండా గెలవలేమని తేలిగ్గా చూస్తున్నార్సార్! ఈ సారి సింగిల్‌గా పోటీచేసి మన సత్తా చూపిద్దాం!

'గ్రీన్' ప్రాజెక్టులకు రెడ్ కార్పెట్



గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా రాష్ట్రం

- పెట్టుబడులకు అపార అవకాశాలు
- 10 నుంచి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- రాష్ట్రానికి ఏటా 400 కిలో టన్నుల డొమెస్టిక్ హైడ్రోజన్ డిమాండ్
- ఏపీలో 9 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం
- గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ 2023ని రూపొందించిన రాష్ట్రం
- 2030కి కనీసం 500 కిలో టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యం

సాక్షి, అమరావతి: వాతావరణ కాలుష్య రహిత, నాణ్యమైన విద్యుత్తు అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న చర్యలతో రాష్ట్రం గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రం (హబ్)గా అవతరిస్తోంది. తరిగిపోతున్న శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా, పెరుగుతున్న వాతావరణ కాలుష్యానికి విరుగుడుగా స్వచ్ఛ ఇంధనాన్ని వినియోగంలోకి తేవడానికి జరుగుతున్న ప్రయత్నాల్లో ఏపీ భాగం అవుతోంది. ఈ ప్రాజెక్టు కోసం గతేడాది కేంద్రం ఎంపిక చేసిన ఐదు రాష్ట్రాల్లో మన రాష్ట్రం కూడా ఉంది. దీనికి అనుగుణంగా గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ 2023ని రాష్ట్రం రూపొందించింది. తాజాగా గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలపై న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) తయారు చేసిన నివేదిక శ్వేతపత్రాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. అందులోని వివరాలను 'ఎన్ఆర్ఈడీసీఏపీ' వీసీ, ఎండీ ఎస్.రమణారెడ్డి 'సాక్షి' ప్రతినిధికి వెల్లడించారు.

సమగ్రంగా శ్వేతపత్రం

రాష్ట్ర ప్రభుత్వం సౌర, పవన విద్యుత్ వంటి స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహిస్తోంది. హైబ్రిడ్ వ్యవస్థగా చెబుతున్న పంప్డ్ హైడ్రో స్టోరేజి ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపడుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి 9 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి స్థాపిత సామర్థ్యం ఉంది. అనేక ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో సౌర, పవన, పంప్డ్ హైడ్రో సిస్టం ప్రాజెక్టులు 24 గంటలూ విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. కొత్త టెక్నాలజీల ఆవిర్భావం, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి వినూత్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చుకుంటోంది. తద్వారా రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ రంగంలో 10 బిలియన్ డాలర్ల నుంచి 15 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులకు అవకాశాలున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరాకు మౌలిక సదుపాయాలు ఉన్నాయి. రాష్ట్ర అవసరాలతోపాటు ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేయడానికి అవసరమైన గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు రాష్ట్రం



అనుకూలంగా ఉంది. రాష్ట్రంలో ఏటా 400 కిలో టన్నుల దేశీయ హైడ్రోజన్ డిమాండ్ ఉంది. దేశ పారిశ్రామిక హైడ్రోజన్ డిమాండ్‌లో ఇది దాదాపు 8 శాతం. ప్రతి ఏటా పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ 2023 ప్రకారం 2030 నాటికి కనీసం 500 కిలో టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీని సాయంతో శిలాజ ఇంధన వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని(డీకార్బనైజ్) భావిస్తోంది. ఇందుకోసం యాక్సిలరేటింగ్ స్మార్ట్ పవర్ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్ ఇండియా (ఆస్పైర్) ప్రోగ్రామ్ కింద ఫారిన్, కామన్వెల్త్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీస్ సాయంతో ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఇన్వెస్ట్‌మెంట్ అవకాశాల నివేదిక సిద్ధం చేసింది. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం వ్యాపారాలకు, పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం, పర్యావరణ వ్యవస్థలపై 'వైట్‌పేపర్'లో వివరించారు. ఇది పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ అభివృద్ధి కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర సంసిద్ధంగా ఉందని శ్వేతపత్రంలో పొందుపరిచారు.

కేంద్రం ఎంచుకున్న ఐదు రాష్ట్రాల్లో ఏపీ

ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళలో ఐదు జాతీయ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు చేయాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించింది. వీటిని 25 గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ క్లస్టర్లుగా విభజించి, వివిధ రంగాలకు ఉపయోగించుకునేలా ప్రణాళికలు రూపొందించింది. మొదటి తరం జాతీయ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులుగా పిలుస్తున్న వీటిలో పన్నెండు రసాయనాలు, రిఫైనరీ, ఉక్కు పరిశ్రమలలోని పారిశ్రామిక డీ–కార్బనైజేషన్ ప్రాజెక్టులు కాగా మూడు భారీ రవాణా ప్రాజెక్టులు, మరో మూడు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) ప్రాజెక్టుల్లో హైడ్రోజన్–బ్లెండింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. మిగిలిన ఏడు ప్రాజెక్టులు మునిసిపాలిటీల్లో వ్యర్థాల నుండి హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేవి. రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో వీటి ద్వారా 2025 నాటికి 150 మెగావాట్ల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యానికి గ్రీన్ హైడ్రోజన్ పాలసీతో ఏపీ జీవం పోసింది.



సీఎం వైఎస్ జగన్‌కు రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు





సాక్షి, అమరావతి: రక్షాబంధన్(రాఖీ పౌర్ణమి) సందర్భంగా గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మకుమారీస్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు జయ, పద్మజ, రాధ రాఖీలు కట్టారు. బ్రహ్మకుమారీస్ ప్రధాన కార్యాలయం మౌంట్ అబూలో సెప్టెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సీఎం జగన్‌ను వారు ఆహ్వానించారు.

సీఎం జగన్‌కు రాఖీలు కట్టిన హౌస్ కీపింగ్ సిబ్బంది

రాఖీ పండుగ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయంలో హౌస్ కీపింగ్ విధులు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బంది గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా సీఎం జగన్ వారిని ఆప్యాయంగా పలకరించారు. సీఎం జగన్ చేతికి రాఖీలు కట్టి మహిళా సిబ్బంది తమ అభిమానాన్ని చాటుకున్నారు.

వైద్య విద్య పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ రద్దు

మళ్లీ మొదటి నుంచి నిర్వహణ

- వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉత్తర్వులు
- కొన్ని కళాశాలల్లో సీట్ల మధ్య వ్యత్యాసమే కారణం
- శాంతిరామ్ వైద్య కళాశాల పేరిట ఫేక్ అనుమతులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైద్య విద్య పీజీ కోర్సుల్లో ఇప్పటికే నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ప్రవేశాల ప్రక్రియను మళ్లీ మొదటి నుంచి నిర్వహించాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే కన్వీనర్, యాజమాన్య కోటా సీట్లకు తొలి దశలో నిర్వహించిన కౌన్సెలింగ్‌ను రద్దు చేసినట్టు గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ఉత్తర్వులిచ్చారు. కర్నూలు జిల్లా శాంతిరామ్ వైద్య కళాశాలలోని పలు కోర్సుల్లో పీజీ సీట్ల పెంపుదలకు సంబంధించి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) పేరిట ఫేక్/ఫోర్జరీ అనుమతులు వెలువడ్డాయి. ఈ అంశంపై ఎన్ఎంసీ ప్రకటన నేపథ్యంలో ఇప్పటివరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌ను హెల్త్ యూనివర్సిటీ అధికారులు రద్దు చేశారు. ఫోర్జరీ అనుమతుల ఘటన వెలుగు చూడటంతో అప్రమత్తమైన అధికారులు మిగిలిన వైద్య కళాశాలల్లో పీజీ సీట్ల అనుమతులు సరిగా ఉన్నాయో, లేదో పరిశీలిస్తున్నారు. ఆయా కళాశాలలకు మంజూరైన సీట్లను, ఎన్ఎంసీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సీట్లతో సబ్జెక్టుల వారీగా తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీఎస్ఎల్, శాంతిరామ్, మహారాజా కళాశాలల్లో అనుమతించిన పీజీ సీట్లకు, ఎన్ఎంసీ వెబ్‌సైట్‌లో చూపిస్తున్న సీట్ల సంఖ్య మధ్య వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఈ అంశంపై వివరణ కోరుతూ అధికారులు ఎన్ఎంసీకి లేఖ రాశారు. ఎన్ఎంసీ నుంచి పూర్తి స్థాయిలో స్పష్టత వచ్చాక కొత్తగా సీట్ మ్యాట్రిక్స్‌ను రూపొందించనున్నారు. ఆ తర్వాత వెబ్ ఆప్షన్ల నమోదుకు నోటిఫికేషన్ ఇస్తామని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

'రికార్డు' సంస్కరణలు ప్రజలకు చెబుదాం

- భూ సంస్కరణల ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి: సీఎం జగన్
- రెవిన్యూ విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం
- సమగ్ర భూ సర్వేతో భూముల రికార్డుల ప్రక్షాళన



క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చేపట్టిన భూ సంస్కరణల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అధికార యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రెవిన్యూ శాఖలో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణలు, సమగ్ర భూసర్వేతో భూ రికార్డుల ప్రక్షాళన, భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి వల్ల చేకూరుతున్న ప్రయోజనాలను క్షుణ్నంగా వివరిస్తూ ప్రజల్లోకి విస్తృత సమాచారాన్ని పంపాలన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం అమలు తీరుపై గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ సమీక్షించారు. ప్రజలకు మేలు జరుగుతున్న నిర్ణయాలపై కూడా ఎల్లో మీడియా వక్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ప్రజల్లో ఆందోళన రేకెత్తించేలా తప్పుడు రాతలు రాస్తోందని, వీటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మంచిని మంచిగా చూపించడం ఇష్టం లేకనే వక్రీకరణలకు పాల్పడుతున్నారని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో ఆయా మండలాలు, తాలూకాల్లో ఒకరిద్దరు మాత్రమే సర్వేయర్లు ఉండగా మన రాష్ట్రంలో ప్రతి గ్రామ సచివాలయానికీ ఒక సర్వేయరు ఉన్నారని సీఎం జగన్ గుర్తు చేశారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణ, రికార్డుల్లో స్వచ్ఛత, కచ్చితత్వానికి ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతోందన్నారు. కీలక సంస్కరణలు చేపట్టి రిజిస్ట్రేషన్ల వ్యవస్థను నేరుగా గ్రామ సచివాలయాల వద్దకే తెస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని గ్రామ సచివాలయాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకునేవారు ఇంటి నుంచే ఆ పనిని చేయించుకునేలా సాంకేతికతను తెస్తున్నామన్నారు. ఇన్ని సౌలభ్యాలను ప్రజలకు అందుబాటులోకి తెస్తుంటే కొందరు తప్పుడు రాతలు, వక్రీకరణలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని తిప్పికొడుతూ మన ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, వాటి వల్ల చేకూరిన ప్రయోజనాలను ప్రజలకు సమగ్రంగా వివరించాలని దిశానిర్దేశం చేశారు. మనం చేస్తున్న మంచి అంతా ప్రజల్లోకి వెళ్లాలని స్పష్టం చేశారు.

ఫేజ్ 2 సర్వే పూర్తైన చోట రిజిస్ట్రేషన్ సేవలకు సిద్ధం కావాలి

మొదటి దశ సర్వే పూర్తైన 2 వేల గ్రామాల్లో అమల్లోకి తెచ్చిన రిజిస్ట్రేషన్ సేవలపై పూర్తి స్థాయిలో సమీక్ష చేయడంతోపాటు ఫేజ్ 2 సమగ్ర సర్వే పూర్తైన గ్రామాల్లో కూడా రిజిస్ట్రేషన్ సేవలను అందించేందుకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని సీఎం జగన్ ఆదేశించారు. ఆయా గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు వేరేచోటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ వ్యవస్థను గ్రామాల్లోకే తెచ్చామన్నారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. భూ వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి మండల స్థాయిలో మొబైల్ కోర్టులు సేవలందించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

95 శాతం డ్రోన్ ఫ్లయింగ్ పూర్తి

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద జరుగుతున్న సమగ్ర సర్వే ప్రగతిని సమీక్షలో అధికారులు వివరించారు. 13,460 గ్రామాలకు గానూ 12,836 గ్రామాల్లో అంటే 95 శాతం గ్రామాల్లో డ్రోన్ల ఫ్లయింగ్ పూర్తయిందని తెలిపారు. మిగతా పనిని అక్టోబరు 15లోగా పూర్తి చేస్తామన్నారు. 81 శాతం గ్రామాలకు సంబంధించి సర్వే ఇమేజీల ప్రక్రియ పూర్తైనట్లు చెప్పారు. 60 శాతం గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐలను (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) జిల్లాలకు పంపే పని పూర్తి చేయాల్సి ఉందన్నారు. సర్వేలో 3,240 రోవర్లను వినియోగించామని, గతం కంటే 1,620 అదనంగా పెరిగినట్లు చెప్పారు. తొలి విడతగా చేపట్టిన 2 వేల గ్రామాల్లో అన్ని రకాలుగా సర్వే పూర్తయిందని వివరించారు. మ్యుటేషన్లు, కొత్త సర్వే సబ్ డివిజన్లు, 19 వేల సరిహద్దుల సమస్యల పరిష్కారం, సర్వే రాళ్లు పాతడం సహా 7.8 లక్షల మందికి భూహక్కు పత్రాల పంపిణీ పూర్తైనట్లు వెల్లడించారు. ఫేజ్ 2లో మరో 2 వేల గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీకి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. రెండో దఫా సర్వే గ్రామాల్లో అక్టోబరు 15 నాటికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మున్సిపాలిటీల్లో..

మున్సిపల్ శాఖ పరిధిలో సర్వే ప్రగతిని కూడా అధికారులు నివేదించారు. ఇప్పటికే 91.93 శాతం ఆస్తుల వెరిఫికేషన్ పూర్తైందని, 66 మున్సిపాలిటీల్లో ఓఆర్ఐ ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ప్రత్యేక బృందాల ఏర్పాటు ద్వారా సర్వే ప్రక్రియను ముమ్మరం చేయాలని సీఎం సూచించారు.

అమెరికా చదువులకు ఐదుగురు గురుకుల విద్యార్థులు

- సీఎం వైఎస్ జగన్ అభినందనలు
- రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం
- శాంసంగ్ ట్యాబ్‌లు కూడా అందజేత



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విద్యార్థులు. చిత్రంలో మంత్రి మేరుగ నాగార్జున తదితరులు

సాక్షి, అమరావతి: అమెరికా చదువులకు ఎంపికైన విద్యార్థులకు అవసరమైన సాయం అందించడమే కాకుండా వాళ్లు తిరిగి వచ్చాక కూడా ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 'కెన్నడీ లుగర్–యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ (కేఎల్–వైఈఎస్)' కార్యక్రమం ద్వారా ఈ ఏడాది దేశంలో 30 మంది విద్యార్థులకు అమెరికాలో చదువుకునే అవకాశం దక్కింది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు ఉండటం విశేషం. ఈ నేపథ్యంలో అమెరికా వెళ్లనున్న విద్యార్థులు.. డి.నవీన, ఎస్.జ్ఞానేశ్వరరావు, రోడా ఇవాంజిలి, బి.హాసిని, సీహెచ్.ఆకాంక్షలు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంను కలిశారు. వారితోపాటు గతేడాది అమెరికా వెళ్లి కోర్సు పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థులు.. కె.అక్ష, సి.తేజ కూడా ఉన్నారు. విద్యార్థులను సీఎం జగన్ అభినందించి కుటుంబ నేపథ్యం, విద్యా సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష ప్రకటించడంతోపాటు, వారికి శాంసంగ్ ట్యాబ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి, ఎస్సీ గురుకులాల సంస్థ కార్యదర్శి పావనమూర్తి తదితరులున్నారు.

కేఎల్–వైఈఎస్

'కెన్నడీ లుగర్–యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రామ్‌ను అమెరికాకు చెందిన సాంస్కృతిక వ్యవహారాల శాఖ సాంస్కృతిక మార్పిడి కోసం నిర్వహిస్తోంది. దీనికి ఎంపికై న విద్యార్థులు పది నెలలపాటు అమెరికాలో ఉంటారు. వారిని అక్కడ ఎంపిక చేసిన పాఠశాలలో నమోదు చేస్తారు. ఎంపికైన విద్యార్థులు పరీక్షలు, క్రీడలతోపాటు మొత్తం పాఠశాల ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. విద్యార్థులకు అమెరికాలో ఎంపిక చేసిన కుటుంబాలు ఆతిథ్యం ఇస్తాయి. ఒక్కో విద్యార్థికి దాదాపు 200 డాలర్లు (సుమారు రూ.16,500) నెలవారీ స్టైఫండ్‌ను అందిస్తారు. ఈ ఏడాది ఎంపికైన ఐదుగురు విద్యార్థులు సెప్టెంబర్ మొదటివారంలో అమెరికాకు బయలుదేరి వెళ్తారు. వీరికి అవసరమైన నిత్యావసరాలు, దుస్తులు, బ్యాగులు, మొబైల్ ఫోన్ల కొనుగోలుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆర్థిక సాయం అందిస్తోంది. కాగా, ఈ ఏడాది దేశం మొత్తం మీద 30 మంది ఎంపికైతే మన ఒక్క రాష్ట్రం నుంచే ఐదుగురు గురుకుల విద్యార్థులు ఎంపిక కావడం విశేషమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు.

పేద కుటుంబం నుంచి అమెరికా



మాది విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం పెదగంట్యాడ. అమ్మానాన్న.. సుకాంతి, ప్రవీణ్‌రాజ్. నాన్న చిన్నపాటి కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నారు. అమ్మ గృహిణి. పేద కుటుంబానికి చెందిన నేను అమెరికా చదువులకు ఎంపికయ్యానంటే అది ప్రభుత్వ ప్రోత్సాహమే.
– రోడా ఇవాంజిలి, ఇంటర్ సెకండ్ ఇయర్ మధురవాడ అంబేద్కర్ గురుకులం, విశాఖ

కలలో కూడా ఊహించలేదు..



మాది అనకాపల్లి జిల్లా జి.కొత్తూరు. నాన్న కృష్ణ మృతి చెందడంతో అమ్మ రాము కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. నేను అమెరికా చదువుకు ఎంపికవుతానని కలలో కూడా ఊహించలేదు. ప్రభుత్వం, ఉపాధ్యాయుల సహకారం వల్లే ఈ స్థాయికి వచ్చాను.
– ఎస్.జ్ఞానేశ్వరరావు, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి, శ్రీకృష్ణాపురం గురుకులం, విశాఖ జిల్లా

సీఎం సార్ ప్రోత్సాహమే..



మాది సత్యసాయి జిల్లా మల్లెనిపల్లి. నాన్న నరసింహులు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్. తల్లి నాగమణి గృహిణి. నేను అమెరికా చదువులకు ఎంపికయ్యానంటే దానికి సీఎం సార్ ప్రోత్సాహమే కారణం.
– బలిగా హాసిని, ఇంటర్ సెకండ్ ఇయర్ ఈడ్పుగల్లు ఐఐటీ–నీట్ అకాడమీ, ఎస్సీ గురుకులం, కృష్ణా జిల్లా

విద్యాలయాలను తీర్చిదిద్దారు..



మాది ప్రకాశం జిల్లా పుచ్చకాయలపల్లి. నాన్న కేశయ్య రైతు. అమ్మ ఆదిలక్ష్మి గృహిణి. మా వంటి పేద వర్గాల పిల్లలు చదివే విద్యాలయాలను సీఎం వైఎస్ జగన్ ఎంతో బాగా తీర్చిదిద్దారు. నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు.
– డి.నవీన, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని, మార్కాపురం గురుకులం, ప్రకాశం జిల్లా

ఎప్పటికీ మర్చిపోలేను..



మాది విజయవాడ. నాన్న సురేశ్.. అటెండర్. అమ్మ వనజ గృహిణి. ప్రభుత్వ గురుకులంలో చదివిన నేను అమెరికా చదువులకు ఎంపిక కావడం పట్ల ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మర్చిపోలేను.
– ఆకాంక్ష, ఇంటర్ సెకండ్ ఇయర్, ఈడ్పుగల్లు ఐఐటీ–ఎన్ఐటీ అకాడమీ, కృష్ణా జిల్లా

క్లుప్తంగా...

ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేయాలి

ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు




అధికారులతో మాట్లాడుతున్న ద్వారకా తిరుమలరావు

మల్కాపురం (విశాఖ పశ్చిమ): ఆర్టీసీ ఆదాయం పెంపునకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పని చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆయన గురువారం గాజువాక ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపోలో ఓ కార్మికుడు స్క్రాప్‌తో తయారు చేసిన ఫౌంటెయిన్‌ను చూసి అభినందించి, రూ.500 నగదు బహుమతి అందించారు. అనంతరం డిపో మేనేజర్ ప్రవీణ, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారారని, ఈ తరుణంలో ప్రభుత్వం నుంచి అన్ని బెనిఫిట్స్ అందుతాయన్నారు. ఆర్టీసీ విజయనగరం ఈడీ రవికుమార్, టీపీటీఓ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పూర్తిగా వినియోగించండి

మంత్రి మేరుగు నాగార్జున ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన సబ్‌ప్లాన్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి.. ఎస్సీల అభ్యున్నతికి కృషి చేయాలని అధికారులకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం 31వ ఎస్సీ కాంపోనెంట్ నోడల్ ఏజెన్సీ సమావేశం జరిగింది. మంత్రి నాగార్జున మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం గతేడాది కంటే ఈ ఏడాది రూ.1,486.93 కోట్లు అధికంగా ఎస్సీ సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ ఏడాది ఎస్సీల సంక్షేమానికి రూ.20,005.22 కోట్లు కేటాయించగా, జూలై నాటికి రూ.9,201.93 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసేందుకు ప్రతి శాఖ ప్రణాళికలు రూపొందించాలని మంత్రి కోరారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు ప్రవీణ్ ప్రకాశ్, ఆర్.జయలక్ష్మి, కె.హర్షవర్ధన్, ఎస్.చిన్నరాముడు, ఆర్.పావనమూర్తి పాల్గొన్నారు.

ఏయూ దూర విద్య పీజీ ప్రవేశాల గడువు పెంపు

ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఆంధ్ర యూనివర్సిటీ (ఏయూ) దూర విద్య కేంద్రం నిర్వహిస్తున్న పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పొడిగించినట్లు దూర విద్య కేంద్రం సంచాలకులు ఆచార్య విశ్వేశ్వర రావు గురువారం తెలిపారు. సెప్టెంబర్ 20 వరకు అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపవచ్చన్నారు. పీజీ కోర్సుల్లో ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ, పొలిటికల్ సైన్స్, హెచ్ఆర్ఎం, ఎంజేఎంసీ, ఎంఏ ఎకనమిక్స్, ఇంగ్లిష్, యూజీ కోర్సుల్లో బీఏ (హెచ్ఈపీ), బీకాం, బీకాం (ఎకౌంటెన్స్) కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సులను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 0891 2844162, 2844164, 2754966 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యే చిట్టిబాబుకు అస్వస్థత



మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే అస్వస్థతకు గురికావడంతో వెంటనే రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ ఎంఆర్ఐ స్కాన్ చేసిన వైద్యులు చిట్టిబాబు మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించారు. వెంటనే అంబులెన్సులో హైదరాబాద్ కిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పినట్లు ఎమ్మెల్యే తనయుడు వికాస్ తెలిపారు.

మన పిల్లలు నాయకులుగా ఎదగాలి: సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: ప్రపంచంలోని చక్కని అవకాశాలను మన విద్యార్థులు అందిపుచ్చుకునేలా తర్ఫీదునివ్వాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ సూచించారు. గురువారం విజయవాడలోని ఎస్సీఈఆర్టీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థుల కోసం ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈఎండీపీ) వర్క్‌షాప్ నిర్వహించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల మనసును తెలుసుకుని బోధన చేయాలని, పాఠశాల, తరగతుల్లో నాయకత్వ పాత్ర పోషించేలా కమ్యూనికేషన్ స్కిల్స్, సృజనాత్మకత వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను వారిలో పెంపొందించాలని సూచించారు. భవిష్యత్‌లో వారు అత్యున్నత శిఖరాలకు చేరుకునేలా విద్యార్థులకు శిక్షణనివ్వాలని సూచించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. అన్ని జిల్లాల సైన్స్ అధికారులు పాల్గొన్నారు.

జీపీఎస్‌తోనే మంచి ప్రయోజనాలు

ఓపీఎస్‌తో ఉన్న లాభాలే దీనిలోనూ ఉన్నాయి

- జీవిత భాగస్వామికి పెన్షన్ హర్షించదగినది
- వాట్సాప్ గ్రూపుల్లో జీపీఎస్ మీద ఉద్యోగుల్లో సానుకూల చర్చ
- సామాజిక మాధ్యమాల్లోనూ ఒకరికొకరు సందేశాలు
- ఓపీఎస్‌లోని కీలకాంశాలను జీపీఎస్‌లోకి తీసుకురావడంతో సానుకూలత
- మరో రెండింటిపైనా ప్రభుత్వ నిర్ణయం చెబితే బాగుంటుందనే అభిప్రాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) స్థానంలో ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా ప్రభుత్వం ప్రతిపాదించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)పై ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)తో ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో జీపీఎస్‌లోనూ అలాంటివే ఉన్నాయని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఓపీఎస్‌లో ఉన్న మెజారిటీ అంశాలను జీపీఎస్‌లో కొనసాగించడంపై వారిలో సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. ఈ మేరకు వాట్సాప్ గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగుల మధ్య ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఓపీఎస్, జీపీఎస్, సీపీఎస్ మధ్య లాభనష్టాలను పోలుస్తూ ఒక పట్టికను వారు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్‌లో కేవలం రెండు అంశాల్లో మినహా.. యథాతథంగా ఓపీఎస్ వల్ల కలిగే లాభాలు ఉన్నాయనే అభిప్రాయాన్ని ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగి పెన్షన్ విషయంలో 13 కీలకాంశాల్లో ఏకంగా తొమ్మిదింటిని ప్రభుత్వం జీపీఎస్‌లో చేర్చడం పట్ల వారిలో సానుకూలత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఓపీఎస్‌లో మాదిరిగానే పెన్షన్‌కు భద్రత కల్పించడం, జీవిత భాగస్వామికి సైతం పెన్షన్ వర్తిస్తుండటంపై జీపీఎస్ మంచిదని అభిప్రాయపడుతున్నారు.



మళ్లీ రద్దు చేస్తే ఎలా..

ఓపీఎస్ రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై పెను ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతోనే ప్రభుత్వం జీపీఎస్‌ను తీసుకొచ్చింది. ఓపీఎస్ ఇవ్వాల్సి వస్తే ప్రభుత్వం చెబుతున్నట్టు అప్పటికి ఇవ్వాల్సిన పెన్షన్ల మొత్తం.. ఉద్యోగుల జీతాలను కూడా దాటేసి మోయలేని స్థాయికి చేరుకుంటుంది. 2041 నాటికి రాష్ట్ర బడ్జెట్లో ఏకంగా రూ.65,234 కోట్లు పెన్షన్ల కోసమే చెల్లించాల్సి వస్తుంది. రుణాలపై చెల్లింపులతో కలుపుకుని రాష్ట్ర సొంత ఆదాయంలో 220 శాతానికి చేరుకుంటుంది. 2070 నాటికి ఈ చెల్లింపులు సుమారు రూ.3,73,000 కోట్లు అవుతాయి. ఏదోక దశలో ఈ మోయలేని భారాన్ని తట్టుకోలేక 2003 మాదిరిగానే మళ్లీ ఓపీఎస్‌ను రద్దు చేయాల్సిన పరిస్థితి వస్తే మళ్లీ కథ మొదటికి వస్తుందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓపీఎస్‌కు దగ్గరగా మెరుగైన పెన్షన్ భరోసా జీపీఎస్‌తో లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

మూడు పెన్షన్ స్కీముల లాభనష్టాల పట్టిక ఇలా..

ప్రయోజనాలు	ఓపీఎస్	జీపీఎస్	సీపీఎస్
పెన్షన్ బాధ్యత	ప్రభుత్వం	ప్రభుత్వం	ప్రభుత్వానికి సంబంధం లేదు
పెన్షన్ గ్యారెంటీ	ఉంది	ఉంది	లేదు
పెన్షన్ శాతం	50 శాతం చివరి మూలవేతనం	50 శాతం చివరి మూలవేతనం	లేదు
డీఏ/డీఆర్	ఉంది	ఉంది	లేదు
పీఆర్సీ వర్తింపు	ఉంది	లేదు	లేదు
కనీస పెన్షన్	రూ.10 వేలు	రూ.10 వేలు	లేదు
కుటుంబ పెన్షన్	ఉంది	ఉంది	లేదు
కనీస సర్వీసు	10 ఏళ్లు, వీఆర్ఎస్‌కు 20 ఏళ్లు, పూర్తి పెన్షన్‌కు 33 ఏళ్లు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌కు పదేళ్లు	10 ఏళ్లు వీఆర్ఎస్‌కు 20 ఏళ్లు, పూర్తి పెన్షన్‌కు 33 ఏళ్లు, మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌కు పదేళ్లు	లేదు
పెన్షన్ లెక్కింపునకు సర్వీసు వెయిటేజీ	5 ఏళ్లు	5 ఏళ్లు	లేదు
పెన్షన్ కమ్యుటేషన్	ఉంది(40శాతం వరకు)	ఉంది (60శాతం వరకు)	--
ఈహెచ్ఎస్	ఉంది	పరిశీలనలో	లేదు
అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్	ఉంది	పరిశీలనలో	లేదు
పెన్షన్ వాటా			
ఉద్యోగికి 10 శాతం	లేదు	చెల్లించాలి	చెల్లించాలి
ప్రభుత్వం 10 శాతం	లేదు	చెల్లించాలి	చెల్లించాలి

సీపీఎస్‌లో అనిశ్చితి కంటే ఇదే మేలు..

సీపీఎస్‌లో ఉద్యోగ విరమణ తర్వాత కార్పస్‌లో 60 శాతాన్ని ఉద్యోగి తీసుకుని.. 40 శాతం సొమ్ము యాన్యుటీ పెన్షన్ స్కీమ్‌లో పెట్టుబడిగా పెట్టాల్సి ఉంది. ఇదంతా మార్కెట్ ఒడిదుడుకులకు లోబడి ఉంటుంది. పూర్తి అనిశ్చితి ఏర్పతే.. రావాల్సిన పెన్షన్‌కూ గ్యారెంటీ ఉండదు. బేసిక్ శాలరీలో 20.3 శాతమే పెన్షన్‌గా వచ్చే అవకాశం ఉండగా.. ఇది కూడా వడ్డీరేట్లపై ఆధారపడే వస్తుండటంతో భద్రత కూడా కష్టమే. జీపీఎస్‌లోనూ సీపీఎస్‌లో చెల్లించినట్టే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా ఇస్తే.. ప్రభుత్వం కూడా అంతే కడుతుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరి జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఏడాదికి డీఏ/డీఆర్‌లు ఇస్తుంది. ఒక రిటైర్ అయిన వ్యక్తి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే.. అందులో ఏకంగా రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. డీఆర్‌లతో కలుపుకుని ఇది ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే వ్యక్తి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే.. అంటే 82 ఏళ్లకు జీపీఎస్ ద్వారా నెలకు రూ.1,10,000 పెన్షన్ తీసుకుంటారు. వాట్సాప్ గ్రూపుల్లో ఈ లెక్కలన్నీ వేసుకుంటూ జీపీఎస్‌పై ఉద్యోగులు సుదీర్ఘ చర్చలు సాగిస్తున్నారు. 2070 నాటికి జీపీఎస్ వల్ల రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బు క్రమంగా పెరుగుతూ అప్పటికి రూ.1,33,506 కోట్లకు చేరుకుంటుంది. ఇందులో రూ.1,19,520 కోట్లు ప్రభుత్వం బడ్జెట్ నుంచి భరించాల్సి వస్తుంది. ఒకవేళ ఉద్యోగులకు జీపీఎస్ నచ్చకుంటే సీపీఎస్‌లో కొనసాగే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

ఆ రెండింటిపై కూడా అనుకూలంగా ఉంటే..



ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం జీపీఎస్ ద్వారా పూర్తి గ్యారెంటీ ఇస్తుండటంపై ఉద్యోగుల్లో హర్షం వ్యక్తమవుతోంది. జీపీఎస్‌లో ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పీఆర్సీ వర్తింపు ఉండదు. పెన్షన్ కాంట్రిబ్యూషన్ చెల్లించాలి. ఈ రెండు మినహా ఓపీఎస్‌లోని అంశాలన్నీ జీపీఎస్‌లోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాట్సాప్ గ్రూపుల్లో చర్చల ద్వారా ఉద్యోగులు ఒకరికొకరు తమ సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ విషయంలో కూడా సందిగ్ధతను తొలగించి వాటిని కూడా ఇచ్చేస్తే మొత్తం 11 అంశాలతో జీపీఎస్ మరింత సంపూర్ణంగా ఉంటుందని ఉద్యోగులు భావిస్తున్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని వారిలో ఆసక్తికర చర్చ సాగుతోంది.

అది చంద్రబాబు, రామోజీ దుష్ట పన్నాగం

- ఎన్ఐఏను, ప్రజలను తప్పుదారి పట్టించడానికి వక్రమార్గాలు
- విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భూమి మీద లేకుండా చేయాలనే కుట్రతోనే ఆయనపై హత్యాయత్నం చేశారు. ఈ దుష్ట పన్నాగంలో చంద్రబాబు, రామోజీరావుల పాత్ర ఉందనడంలో సందేహం లేదు' అని విజయనగరం జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ కేసులో ఉన్న నిందితుడికి అంతకు ముందు నేర చరిత్ర ఉన్నా సీఐఎస్ఎఫ్ భద్రత ఉన్న విశాఖ విమానాశ్రయంలోని ఫ్యూజన్ ఫుడ్స్ క్యాంటీన్‌లో ఎలా చేరాడని ప్రశ్నించారు. శ్రీనివాసరావు గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌పై ఆనాడు విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం కేసులో వాస్తవాలను మరుగునపర్చి, పూర్తిగా వక్రభాష్యం చెబుతూ ఈనాడు పత్రిక ప్రచురించిన వార్తను ఖండించారు. 'ఈ కేసులో నిందితుడు శ్రీనివాసరావు గతంలో బెయిల్‌పై వచ్చిన అనంతరం మీడియాకు ఏం చెప్పారో తెలియదా? ఇప్పుడు ఈనాడు పత్రిక ఉటంకించిన న్యాయవాది ఆ రోజు ఆ నిందితుడి పక్కనే ఉన్నారు కదా? అయినా చంద్రబాబు దగ్గర ఫీజు తీసుకున్న అడ్వొకేట్ ఏదో చెబితే అదేదో కోర్టు చెప్పినట్లుగా ఈనాడు పత్రిక రాసేయడమేనా? ఇదేనా జర్నలిజం? ఇదేనా విశ్వసనీయత?' అని మండిపడ్డారు. కేంద్ర భద్రతా బలగాల పహారాలో ఉండే విశాఖ విమానాశ్రయంలో ఒక టీడీపీ నాయకుడికి చెందిన క్యాంటీన్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఆనాటి ప్రతిపక్ష నాయకుడిపై హత్యాయత్నం చేశాడంటే.. అదేమైనా చిన్న విషయమా? అని ప్రశ్నించారు. ఈ కేసులో ఉన్న పెద్ద తలకాయలన్నీ కోర్టు విచారణలో బయటకు వస్తాయని చెప్పారు. కోర్టు విచారణలో ఉన్నా, ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏతో పాటు ప్రజలను కూడా తప్పుదోవ పట్టించడానికి చంద్రబాబు, రామోజీరావు ఇలాంటి వక్రమార్గాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఒక ప్రతిపక్ష నాయకుడిపై హత్యాయత్నం జరిగిన తీవ్రమైన కేసును తొలి నుంచీ కోడి కత్తి కేసు అంటూ నీరుగార్చేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రజాదరణ కోల్పోయిన టీడీపీని, చంద్రబాబుని రామోజీరావు ఎన్ని జాకీలతో ఎత్తినా రానున్న ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేరని వారికి అర్థమైపోయిందని చెప్పారు. అందుకే ఎంతకైనా దిగజారిపోతున్నారని, తప్పుడు రాతలతో పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. ఎన్ని కుట్రలు పన్నినా, కుతంత్ర రాజకీయాలు చేసినా వాస్తవాలేమిటో కోర్టు విచారణలో నిగ్గుతేలతాయని చెప్పారు. ప్రజాకోర్టులాంటి రానున్న ఎన్నికల్లోనూ టీడీపీకి ఓటమి తప్పదన్నారు. గత నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ సంక్షేమం, అభివృద్ధితో ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లోనూ టీడీపీని మట్టి కరిపించి, వైఎస్ జగన్ మరోసారి ఘన విజయం సాధిస్తారని, ఆ విషయం చంద్రబాబు, రామోజీరావులకు తెలిసిపోయిందని అన్నారు. అందువల్లే టీడీపీని బతికించుకోవడానికి రామోజీరావు, చంద్రబాబు ఆపసోపాలు పడుతున్నారని ఎద్దేవా చేశారు.

దేశంలో న్యాయవ్యవస్థ విఫలమైంది

17 ఏళ్లుగా మార్గదర్శి కేసు కొనసాగుతోంది

చదువుకున్న వారు ప్రశ్నిస్తేనే వ్యవస్థలో మార్పు

మాజీ ఎంపీ ఉండవల్లి



సీతంపేట (విశాఖపట్న): దేశంలో న్యాయ వ్యవస్థ విఫలమైందని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. అక్రమంగా నిధులు వసూలు చేసిందని 17 ఏళ్ల కిందట మార్గదర్శిపై తాను వేసిన కేసు ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని చెప్పారు. ఏళ్ల తరబడి కేసులు కొలిక్కి రావడంలేదన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లడానికి, ఎఫ్ఐఆర్ కాపీ అడిగి తీసుకోవడానికి జనం భయపడే పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని తెలిపారు. ఇటువంటి వాటిని ప్రశ్నించడానికి వచ్చిన ఆర్‌టీఐ చట్టం కూడా బ్లాక్‌మెయిలర్స్ చేతిలోకి పోయిందని అన్నారు. విశాఖ పౌర గ్రంథాలయ సొసైటీ, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అరుణ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన 'గుడ్ గవర్నెన్స్' అంశంపై ప్రసంగించారు. యువత రాజకీయాల గురించి చర్చించాలని, నాకెందుకులే అని చదువుకున్న వారు అనుకుంటే మార్పు సాధ్యం కాదని చెప్పారు. గడిచిన 70 ఏళ్లలో రాజకీయాలు దిగజారిపోయాయని, స్వార్థ రాజకీయాలు నడుస్తున్నాయని తెలిపారు. చదువుకున్న వారు ప్రశ్నిస్తేనే వ్యవస్థలో మార్పు వస్తుందన్నారు. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న రాజకీయ నాయకుల్లో నిస్వార్థం, త్యాగం కనిపించేవన్నారు. ఇప్పుడు అటువంటి రాజకీయ నాయకులు లేరని చెప్పారు. ఓటుతో ప్రజాస్వామ్యాన్ని మరింత బలపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరక్టర్ ఎ.ప్రసన్నకుమార్, బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు ఆగడాలు మర్చిపోతే ఎలా రామోజీ?

- అంగన్‌వాడీలపై ఉక్కుపాదం మోపింది ఎవరో గుర్తులేదా?
- చంద్రబాబుదే ఆ తీరు.. జగన్‌ది ఆపన్నహస్తం
- అధికారం చేపట్టిన వెంటనే వారికి వేతనాలు పెంచిన సీఎం జగన్
- వర్కర్లు, ఆయాలకు 56,984 స్మార్ట్‌ఫోన్లు, వన్ జీబీ అదనపు డేటా..
- గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా పదోన్నతి.. వయోపరిమితి సడలింపు..
- ఇలా అంగన్‌వాడీల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నాడు వేతనాలు అడిగితే గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు
- ఎన్నికల ముందు అరకొరగా జీతాలు పెంచి బకాయి పెట్టిన టీడీపీ సర్కార్
- మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో అంగన్‌వాడీలను రెచ్చగొట్టి 'పచ్చ'ముఠా లబ్ధిపొందే ఎత్తుగడలు



సాక్షి, అమరావతి: అధికారం తమవారి చేతుల్లో లేకపోతే కడుపుమంట ఎంతలా ఉంటుందో రామోజీని చూస్తే తెలుస్తుంది. అబద్ధాలను అతికినట్లు చెప్పడంలోగానీ.. నిజాలను పాతర వెయ్యడంలోగానీ ఆయన ఎంతో నేర్పరి. వాస్తవాలు బయటకొస్తాయనే భయం కూడా ఆయనకు కొరవడింది.. నిత్యం రాష్ట్ర ప్రభుత్వంపై విషం కక్కుతుంటే పాఠకులు ఎలా స్పందిస్తారో అన్న కనీస స్పృహ కూడా కరువైంది. ఎందుకంటే.. అంగన్‌వాడీలను ఉక్కుపాదంతో అణచివేసిన చంద్రబాబును వదిలేసి అధికారంలోకి వచ్చీరాగానే వారికి ఎన్నో వరాలిచ్చిన సీఎం వైఎస్ జగన్‌పై 'అంగన్‌వాడీలపై ఉక్కుపాదం' అంటూ తాజాగా చేతికొచ్చినట్లు రాసిపారేశారు. ఈ కాకమ్మ 'కథల్ని' జనం నమ్మే రోజులు పోయాయని ఇంకెప్పుడు తెలుసుకుంటారో రామోజీ..? ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అన్ని వర్గాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిపొందే 'పచ్చ'బ్యాచ్ కుట్రలు శృతిమించుతున్నాయి. నిజానికి.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే వర్కర్లు, హెల్పర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక వరాలిచ్చారు. చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి వేతనాలు పెంచారు.. పదోన్నతులు కల్పించారు.. పదోన్నతుల్లో వయో పరిమితి పెంచుతూ అనేకమందికి అవకాశం కల్పించారు.. అంతేకాక, పాత స్మార్ట్‌ఫోన్ల స్థానంలో కొత్త స్మార్ట్‌ఫోన్లు అందించారు.. మునుపెన్నడూ లేని విధంగా సెలవులు కూడా మంజూరు చేశారు. బీమా కల్పించారు.. ఇలా చెప్పుకుంటూపోతే ఎంతో మేలుచేసి మనసున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అంగన్‌వాడీల మన్ననలు అందుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వర్కర్లు, హెల్పర్ల వేతనాల పెంపు వంటి అనేక విషయాల్లో దేశంలోనే ఏపీ ఆదర్శ రాష్ట్రంగా నిలుస్తోంది. అయినా అంగన్‌వాడీలను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు ఎల్లో మీడియా కిందామీదా పడుతోంది. పొరుగునున్న తెలంగాణాతో పోల్చి బాబు హయాంలోనే బాగా చేశారని గొప్పలు చాటేలా ఈనాడు ఆ కథనంలో తెగ తాపత్రయపడింది. నిజానికి.. అంగన్‌వాడీల విషయంలో చంద్రబాబుదే ఉక్కుపాదం.. జగన్ ఆపన్న హస్తం అందించారని చెప్పేందుకు అనేకానేక ఉదాహరణలున్నాయి. వారిపట్ల గత ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహించింది? ప్రస్తుత ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తోంది? అనే వాస్తవాలు ఒకసారి పరిశీలించండి.

గుర్రాలతో తొక్కించినది మరిచారా

గత ఎన్నికలకు ఆరునెలల ముందు అంగన్‌వాడీలకు హడావుడిగా జీతాలు పెంచి వాటిని అమలుచేయకుండా బకాయిలు పెట్టిన చంద్రబాబు సంగతిని వారు మర్చిపోలేదు. అలాగే, గతంలో వేతనాలు పెంచాలని ఆందోళన చేపట్టిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను గుర్రాలతో తొక్కించి, లాఠీలతో కొట్టించిన చంద్రబాబు నిరంకుశ పాలననూ ఎలా మర్చిపోగలరు? ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 'పచ్చముఠా' మొసలికన్నీరు కారుస్తోంది.

ఇవిగో వాస్తవాలు..

- 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకూ అంగన్‌వాడీ వర్కర్ల జీతం నెలకు రూ.7 వేలు, హెల్పర్లకు రూ. 4,500 మాత్రమే. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన మొదటి మూడు వారాల్లోనే వారికి జీతాలు పెంచారు. అంగన్‌వాడీలకు రూ.11,500కు, హెల్పర్లకు రూ.7 వేలకు పెంచుతూ 2019 జూన్ 26న ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.
- విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 చొప్పున ప్రభుత్వం అదనంగా అందిస్తోంది. ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.27.8 కోట్లు చెల్లిస్తోంది.
- 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు లేవు. గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్–2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీచేసింది. ఈ పోస్టుల వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50కు పెంచారు.
- అంగన్‌వాడీ వర్కర్లకు స్మార్ట్‌ఫోన్లు కూడా ఇచ్చింది. 56,984 స్మార్ట్ ఫోన్ల కొనుగోలుకు రూ.85.47 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది. అదనంగా 1 జీబీ డేటా కూడా ఇస్తోంది.
- రూ.16కోట్ల ఖర్చుతో ఒక్కో అంగన్‌వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు 6 చొప్పున యూనిఫాం శారీలు అందిస్తున్నారు.
- అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ఒకే గొడుగు కిందకు తెచ్చి పర్యవేక్షించడంతో పాటు వర్కర్లు, హెల్పర్లకు వార్షిక సెలవులు, ప్రసూతి సెలవులు, బీమా సౌకర్యం కల్పించి భరోసా ఇస్తున్నారు. పదవీ విరమణ సమయంలో ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోంది.
- నాడు–నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వం.. అంగన్‌వాడీలకూ కొత్తరూపు తీసుకొస్తోంది.
- 10,932 అంగన్‌వాడీ కేంద్రాల్లో (సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లోకి రీలొకేట్ అయినవి) మౌలిక సదుపాయాలు, తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మరో రూ.500 కోట్లతో మిగిలిన 45,000 అంగన్‌వాడీ భవనాలకు రిపేర్లు, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ ఉపకరణాలు, రంగులు, రక్షిత తాగునీరు, గోడలపై బొమ్మలు తదితర పనులు చేపడుతున్నారు.
- స్మార్ట్ టీవీల ఏర్పాటుతో పాటు నేర్చుకునే విధానాలను మెరుగుపరచడానికి 8.5లక్షల మంది పిల్లలకు ప్రత్యేక కిట్లు అందిస్తున్నారు. దీంతోపాటు స్పోకెన్ ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలనూ అందిస్తోంది.
- పిల్లల ఎదుగుదలను పరిశీలించేందుకు రూ.16.04 కోట్లతో 19,236 గ్రోత్ మానిటరింగ్ పరికరాలను అందిస్తోంది.
- ఇక గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోం రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ ద్వారా పౌష్టికాహారం అందించడంతో పాటు వారికి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలు కూడా అందుబాటులోకి తెచ్చింది.

వీఆర్ఏలకు శుభవార్త

డీఏ రూ.500కు పెంచుతూ సీఎం జగన్ నిర్ణయం

రూ.300 డీఏను రద్దుచేసిన గత టీడీపీ ప్రభుత్వం

డీఏ పెంపుతో 20వేల మందికి లబ్ధి



సాక్షి, అమరావతి: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (వీఆర్ఏ)లకు డీఏ పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. గతంలో వీఆర్ఏలకు రూ.300 ఉన్న డీఏను చంద్రబాబు ప్రభుత్వం రద్దుచేయడంతో దీన్ని తిరిగి పునరుద్ధరించాలంటూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) సీఎంను కలిసి కోరగా తక్షణం సానుకూలంగా స్పందించినట్లు ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఫైల్ సర్క్యులేట్ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించడమే కాక అందులో డీఏను రూ.300 నుంచి రూ.500కు పెంచుతూ సీఎం సంతకం చేసినట్లు తెలిపారు. డీఏను పునరుద్ధరించడంతోపాటు దానిని పెంచుతూ ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకోవడంపట్ల వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంవల్ల సుమారు 20,000 మందికి ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఇక వీరికి డీఏ మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర రెవెన్యూ శాఖాధికారులకు ఏపీజీఈఎఫ్ తరఫున వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

వీఆర్ఏలకు గతంలో కేవలం రూ.300గా ఉన్న డీఏను నేడు రూ.500కు పెంచే ఫైలును ఆమోదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్, ఏపీ జేఏసీ అమరావతి పక్షాన బొప్పరాజు, పలిశెట్టి దామోదర్‌రావు, చేబ్రోలు కృష్ణమూర్తిలు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఈ సమస్యపై ముఖ్యమంత్రికి సిఫార్సు చేసిన మంత్రివర్గ ఉపసంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. గత ప్రభుత్వం వీఆర్ఏల డీఏను రద్దుచేస్తే ఈ ప్రభుత్వం పునరుద్ధరించడమే కాక.. రూ.300 నుంచి రూ.500కు పెంచడంపై ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా దివాకర్, ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలనాయుడులు కూడా ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి
శుక్రవారం, 1 సెప్టెంబర్ 2023

మ్యాపులతో మడతపేచీ

నోటితో మాట్లాడుతూ, నొసటితో వెక్కిరించడమంటే ఇదే. భారత్‌తో స్నేహసంబంధాలకు కట్టుబడి ఉన్నట్టు తీయటి కబుర్లు చెప్పే చైనా తన వక్రబుద్ధిని మరోసారి వెల్లడించుకుంది. సోమ వారం నాడు సరికొత్త అధికారిక 'ప్రామాణిక పటం'– 2023 విడుదల చేస్తూ, అందులో భారత్‌లోని పలు ప్రాంతాల్ని తమ దేశంలో భాగమన్నట్టు చూపింది. భారత ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను తన భూభాగాలంటోంది. మొత్తం తైవాన్, వివాదాస్పద దక్షిణ చైనా సముద్ర ప్రాంతాన్ని కూడా ఈ కొత్త జాతీయ పటంలో తమ అంతర్భాగమనేందుకు చైనా తెగించింది. దాదాపు పొరుగు దేశాలన్నిటికీ కోపం తెప్పించడమే కాక, మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. పైపెచ్చు, అంతా సవ్యంగానే ఉన్నదన్నట్టు ''జాతీయ సరిహద్దులను గీయడంలో చైనాతో పాటు వివిధ దేశాలు ఉపయోగించే పద్ధతి ఆధారంగా''నే ఈ పటాన్ని రూపొందించినట్టు డ్రాగన్ ప్రకటించుకోవడం విచిత్రం. ఈ వ్యవహారాన్ని ఢిల్లీ ఖండిస్తుంటే, బీజింగ్ మాత్రం మ్యాప్‌ల విడుదల నిత్యకృత్యమేననీ, దీనిపై అతి చేయద్దనీ విషయతీవ్రతను తక్కువ చేసి చెబుతుండడం మరీ విడ్డూరం.

చెప్పేదొకటి చేసేదొకటి జిత్తులమారి చైనా నిత్యకృత్యం. అందుకే, ఈ వ్యవహారాన్ని భారత్ తీవ్రంగా తీసుకోక తప్పదు. వారం క్రితం జోహాన్నెస్‌బర్గ్‌లో 'బ్రిక్స్' సదస్సు జరిగినప్పుడు భారత ప్రధాని, చైనా అధ్యక్షుడు సమావేశమై సంభాషించుకున్నారు. సరిహద్దుల వద్ద పరిస్థితిని చక్కదిద్ది, సత్సంబంధాలకు కృషి చేయాలని చర్చించుకున్నారు. మరోపక్క ఈ 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరిగే 'జీ–20' శిఖరాగ్ర సదస్సుకూ చైనా అధినేత హాజరు కావాల్సి ఉంది. సరిగ్గా ఈ సమయంలో ఉరుము లేని పిడుగులా డ్రాగన్ దేశ సరిహద్దులు ఈ 'వక్రీకరించిన' పటంతో బాంబు పేల్చింది. గమనిస్తే మన ప్రాంతాలకు చైనీస్ పేర్లు పెడుతూ, మునుపటి పటంలోనూ చైనా ఇదే తెంపరితనం చూపింది. ఆ దేశ పశ్చిమ హద్దుల్లో ఉన్న ప్రాంతాలను తనవిగా చెప్పుకొంది. అక్సాయ్‌చిన్ 1950–60ల నుంచి మన కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో భాగం. 1962 యుద్ధంలో చైనా దాన్ని ఆక్రమించుకుంది. అరుణాచల్‌నేమో దశాబ్దాలుగా తమ దక్షిణ టిబెట్‌లోది అంటోంది. ఆ రెండూ భారత అంతర్భాగాలని మన ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నా, తన మూర్ఖవాదన కొనసాగిస్తోంది.

పటంలోని అంశాలు అంతర్జాతీయ అంగీకృత సరిహద్దులను పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను 'జంగ్నాన్' (దక్షిణ టిబెట్) అని పిలుస్తూ, అది తమదేననడం బీజింగ్ సిగ్గుమాలినతనం. చరిత్ర చూస్తే టిబెట్‌కూ, బ్రిటీషు ఇండియాకు మధ్య 1914లో సిమ్లా సమావేశం జరిగింది. అప్పుడే సరిహద్దుగా మెక్‌మోహన్ రేఖను అంగీకరించాయి. చైనా చేస్తున్న ప్రకటనలు, చూపుతున్న పటం ఆ అంగీకరించిన సరిహద్దు రేఖ చట్టబద్ధతను ఉల్లంఘించడమే! అలాగే, ద్వీప దేశమైన తైవాన్ ఏడాదిపైగా తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా, పట్టువదలని బీజింగ్ 'వన్ చైనా విధానం' అంటూ దాన్ని తమ పటంలో చూపడం దురహంకారం. ఇక, పసిఫిక్, హిందూ మహాసముద్రాలకు ప్రధాన నౌకాయాన అనుసంధానమైన దక్షిణ చైనా సముద్ర ప్రాంతం సైనిక, వాణిజ్యపరంగా అతి కీలకం. వివాదాస్పద ద్వీపాలతో సహా ఈ ప్రాంతమంతా చైనా తమ పటంలో కలిపేసుకుంటోంది. ఈ ప్రాంతంలో డ్రాగన్ సామ్రాజ్యవాద విస్తరణ వైఖరిని ఫిలిప్పీన్స్, వియత్నామ్, మలేసియా, జపాన్ తదితర దేశాలు పదే పదే ఎత్తిచూపుతున్నాయి. అయినా అది తన తీరు మార్చుకోలేదు.

భౌతికంగా తన అధీనంలో లేకున్నా ఈ ప్రాంతాలు తనవేననడం చిరకాలంగా చైనా చూపుతున్న మొండి వైఖరే. తాజా పటం జారీ వల్ల దానికి కొత్తగా కలిసొచ్చేదేమీ లేదు. పైగా, మిగతా ప్రపంచపు సహాయం, సానుభూతి కూడా దక్కవు. అయినా సరే, డ్రాగన్ తన దురహంకారాన్ని చాటుకోవడం గమనార్హం. ఒక్కమాటలో చైనా అధినేత షీ జిన్‌పింగ్ సామ్రాజ్యవాద విస్తరణ వైఖరికి ఈ కొత్త మ్యాప్ ప్రతీక. అధికారిక జాతీయ పటాల జారీ చైనాలో దాదాపు ఏటా జరిగే తంతు అయినా... భారత్ వరకు తీసుకుంటే చంద్రయాన్–3 విజయం, రానున్న జీ–20 సదస్సు నేపథ్యంలో ఇప్పుడీ పటాన్ని ఎందుకు విడుదల చేసినట్టు? ఇరుదేశాల మధ్య ఇలాంటి సరిహద్దు వివాదాలే గతంలోనూ సైనిక ప్రతిష్టంభనకు దారితీశాయి. 2017లో తలెత్తిన డోక్లామ్ సంక్షోభం, 2020లో గల్వాన్ లోయలో సైనిక ఘర్షణలే తాజా ఉదాహరణలు. దీంతో దౌత్య సంబంధాలూ దెబ్బతింటున్నాయి. బలగాల్ని వెనక్కి పిలిచి, ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించుకోవాల్సిన వేళ ఇలాంటి తప్పుడు పటం సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు ఏ రకంగానూ దోహదపడదు.

ఇప్పటికే లద్దాఖ్‌లోని కొంత భాగాన్ని చైనా ఆక్రమించేసుకుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. వివిధ విదేశీ సర్వేలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు సైతం భారత సరిహద్దులో చైనా వివాదాస్పద నిర్మాణాల్ని ధ్రువీకరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అనుమానాలు పోగొట్టేలా మన పాలకులు వాస్తవాలను వెల్లడించాలి. నమ్మడానికి వీల్లేని పొరుగుదేశంతో నిక్కచ్చిగానే వ్యవహరించాలి. సార్వభౌమాధికారం, సమగ్రతల్లో రాజీ లేదని మాటల్లో కన్నా చేతల్లో చూపాలి. జీ–20 అధ్యక్షతతో విశ్వగురువులయ్యామని సంబరపడే కన్నా, అంతర్గత ఘర్షణలున్న అన్ని పక్షాలనూ అర్థ వంతమైన సమగ్ర చర్చలతో ఒక తాటిపైకి తేవడమే అసలు విజయమని గ్రహించాలి. చైనాతో సంభాషణకు అన్ని మార్గాల్నీ అన్వేషిస్తూనే, మనకున్న ఆందోళనల్ని కుండబద్దలు కొట్టాలి. అవకాశాన్ని బట్టి అందుకు రానున్న జీ–20ను సైతం వేదికగా చేసుకోవాలి. దౌత్య, వాణిజ్య సంబంధాల మెరుగుదలకు సరిహద్దుల్లో సామరస్య వాతావరణం కీలకమని మరోసారి అందరికీ తలకెక్కేలా చూడాలి.

గణాంక శాస్త్రంలో మన దిగ్గజం

సందర్భం



ఎస్.ఆర్. శ్రీనివాస వరదన్


గణాంకవేత్తగా, గణిత శాస్త్రజ్ఞుడిగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రొఫెసర్ సి.ఆర్.రావు 102 ఏళ్ల వయసులో మొన్న ఆగస్ట్ 22న మరణించారు. గణాంక శాస్త్రంలో ఆయన చేసిన మౌలిక కృషి ఆ ఒక్క రంగాన్నే కాకుండా, ఆర్థిక శాస్త్రం, జన్యుశాస్త్రం, మానవ పరిణామ శాస్త్రం లాంటి వాటిని కూడా ప్రభావితం చేసింది. 1920లో తెలుగు కుటుంబంలో జన్మించిన ఆయన పూర్తిపేరు కల్యంపూడి రాధాకృష్ణారావు. నోబెల్ బహుమానానికి సమానమైనదిగా పిలిచే 'ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్'ను 2023 సంవత్సరానికి ఆయన అందుకున్నారు. అమెరికన్ స్టాటిస్టికల్ అసోసియేషన్ ఆయనను 'లివింగ్ లెజెండ్' అని అభివర్ణించింది. భారత ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించుకుంది.

గణాంక శాస్త్రం (స్టాటిస్టిక్స్)లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, నేనేం చదువుతానో నాకు ఆలోచన లేదు. ఎందుకంటే ఇది కొత్త సబ్జెక్ట్. పైగా దాని గురించి నేను విని ఉండలేదు. తొలి ఏడాది చాలావరకు సంభావ్యత గురించి ఉండేది. నేను ఆ సబ్జెక్టును ఇష్టపడ్డాను. విలియం ఫెల్లర్ రాసిన పుస్తకం అప్పుడే ప్రచురించారు. దాన్ని చదవడాన్ని ఎంతో ఆస్వాదించాను. మేము స్టాటిస్టిక్స్ చదవడం మొదలెట్టినప్పుడు, దానికి సంబంధించిన అసలు పాఠ్య పుస్తకాలు లేవు. కానీ డాక్టర్ సీఆర్ రావు రాసిన 'బయోమెట్రిక్స్ పరిశోధనలో అధునాతన గణాంక పద్ధతులు' (అడ్వాన్స్‌డ్ స్టాటిస్టికల్ మెథడ్స్ ఇన్ బయోమెట్రిక్ రీసెర్చ్) అనే పుస్తకాన్ని చదివాము. ఈ పుస్తకంలో ఎంతో విషయ సంపద ఉంది.

మేము 'క్రామెర్–రావు అసమానతా సిద్ధాంతం' (ఒక అంచనా ఎంత కచ్చితమైనదో మదింపు వేయడంలో ఇది గణాంక నిపుణుడికి ఉపయోగపడుతుంది) గురించీ, దాంతోపాటు 'రావు–బ్లాక్‌వెల్ సిద్ధాంతం' (ఒక అంచనాను మెరుగ్గానూ, మరింత అభిలషణీయంగానూ చేయడానికి ఇది ఒక పద్ధతిని అందిస్తుంది) గురించీ తెలుసుకున్నాము. ఈ రెండు సిద్ధాంతాలూ సరళమైనవి, అదే సమయంలో లోతైనవి. అప్పుడే నేను డాక్టర్ సి.ఆర్. రావు గురించి మొదటిసారి విన్నాను.

నా అండర్ గ్రాడ్యుయేట్ చదువును 1959లో ముగించిన తర్వాత, వృత్తి నిపుణులైన గణాంక శాస్త్రజ్ఞులకు శిక్షణనిస్తూ, పరిశోధన చేయాలనుకునే వారిని ప్రోత్సహించే 'ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్'(ఐఎస్ఐ) గురించి తెలిసింది. పోటీ పరీక్ష రాసి, రీసెర్చ్ స్కాలర్‌గా ఎంపికయ్యాను. తర్వాత కోల్‌కతాకు 1959 ఆగస్టులో రైలులో వెళ్ళాను. అక్కడ నేను ఏం ఆశించాలో లేదా నానుంచి వాళ్లు ఏం ఆశిస్తున్నారో నాకు ఎలాంటి ఆలోచనా లేదు.

కోల్‌కతాకు వచ్చిన మరుసటి రోజే నేను సి.ఆర్. రావును కలిశాను. భారతీయ గణాంక శాస్త్ర సంస్థ చాలా పెద్దది. ఉదాహరణకు, ప్రభుత్వం కోసం డేటాను సేకరించడం, విశ్లేషించడం వంటి బాధ్యత వహించే 'నేషనల్ శాంపిల్ సర్వే' వంటి అనేక విభాగాలు ఇందులో ఉన్నాయి. చాలామంది వివిధ రంగాలలో పనిచేసేవారు. మా కార్యకలాపాలకు 'రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ స్కూల్' ముఖ్య కేంద్రంగా ఉండేది. దీన్ని సంక్షిప్తంగా ఆర్‌టీఎస్ అని పిలిచేవారు. దీని అధిపతి డాక్టర్ సి.ఆర్.రావు. ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) సర్వాధిపతి పీసీ మహలనోబిస్. ఈయనను ఎల్లప్పుడూ ప్రొఫెసర్ అని పిలిచేవారు. ఆర్‌టీఎస్‌లో, మేము టీ రూమ్‌లో ఉదయం 11.30, మధ్యాహ్నం 3.30 గంటలకు రోజుకు రెండుసార్లు టీ తాగేవాళ్లం. రీసెర్చ్ స్కాలర్లకు అధ్యాపకులు ఇక్కడ స్వేచ్ఛగా కనిపిస్తారు. పరస్పర చర్చల్లో మునిగి ఉండేవారం. ఈ సంస్థలో జేబీఎస్ హాల్డేన్ లాంటి విఖ్యాత శాస్త్రవేత్త



ప్రొఫెసర్ సి.ఆర్. రావు

కూడా ఒక సాధారణ మనిషి. లావుపాటి సిగార్ వెలిగించి తాగేవారు. డాక్టర్ రావు ఎక్కువ సమయం అక్కడే ఉండేవారు. సీనియర్ ఫ్యాకల్టీతో పాటు తోటి రీసెర్చ్ స్కాలర్‌లను కలవడానికి ఇది సరైన ప్రదేశంగా ఉండేది.

నాకు దేనిపై ఆసక్తి ఉందని డాక్టర్ రావు నన్ను ఒకసారి అడిగారు. నేను స్టాటిటిక్స్‌కి సంబంధించిన పారిశ్రామిక అనువర్తనాలపై పని చేయాలనుకుంటున్నానని చెప్పాను. ఆయన ఏమీ మాట్లాడలేదు కానీ, మరొక అధ్యాపకుడిని కలవమని సూచించారు. ఆయన సలహా పాటించి ఆ అధ్యాపకుడిని కలిశాను. కొన్ని విషయాలను చదవడానికి కూడా ప్రయత్నించాను. అయితే అవేం పెద్ద ఆసక్తికరంగా అనిపించలేదు. దాంతో నిరుత్సాహానికి గురయ్యాను.

పరిశోధనలో చక్కటి ప్రోత్సాహం

అప్పట్లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. స్టాటిస్టిక్స్ విభాగానికి డాక్టర్ రావు అధ్యక్షత వహించారు. ఆయన ఒక పరిశోధనా సంస్థగా మా ఇన్‌స్టిట్యూట్ శక్తిని చూపించాలనుకున్నారు. రీసెర్చ్ స్కాలర్లు అందరినీ వారి పనిని ప్రదర్శించమని ప్రోత్సహించారు. నేను నా పరిశోధనా జీవితంలో కొన్ని నెలలు మాత్రమే ఉన్నాను కాబట్టి ప్రత్యేకంగా చూపించడానికి ఏమీ లేదు.

అలాంటి తరుణంలో మరో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రఘురాజ్ బహదూర్ నన్ను ఆదుకున్నారు. సైద్ధాంతిక గణాంకాలలో చదవవలసిన కొన్ని విషయాలను సూచించారు. ఇప్పుడు రాబిన్స్–మన్రో ప్రాసీజర్ అని పిలుస్తున్న రంగం చాలా ఆసక్తికరంగా అనిపించింది. నేను సమావేశానికి నావంతు తోడ్పడగలనని డాక్టర్ రావు సంతోషించారు. అదే సమయంలో, కేఆర్ పార్థసారథి, వీఎస్ వరదరాజన్, ఆర్. రంగారావులను కలిశాను. పారిశ్రామిక గణాంకాల కంటే సంభావ్యతా సిద్ధాంతంలో పనిచేయమని వారు నన్ను ఒప్పించారు. వరదరాజన్ అమెరికా వెళ్లిపోయినప్పటికీ, తర్వాత ఏడాదిన్నర పాటు మిగతా ఇద్దరితో కలిసి పనిచేశాను. నాకు ఆసక్తి కలిగిన అంశాన్ని నేను ఎంచుకోవడం డాక్టర్ రావు గమనించారు. దానికి ఆయన అసంతృప్తి చెందలేదు. మా బృందం ఏం పని చేస్తోందో అప్పుడప్పుడూ మమ్మల్ని అడిగేవారు. మమ్మల్ని ఎంతో ప్రోత్సహించేవారు.

స్కాలర్లకు అందుబాటులో...

మా ఇన్‌స్టిట్యూట్‌కి సందర్శకులు ఎల్లప్పుడూ ప్రవాహంలా కదిలి వచ్చేవారు. వారితో సంభాషించడానికి మాకు తగినంత అవకాశాలు ఉండేలా డాక్టర్ రావు చూసుకున్నారు. సుప్రసిద్ధ సోవియట్ గణిత శాస్త్రజ్ఞుడు ఆంద్రీ కొల్మోగొరోవ్ అప్పట్లో మా ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. భారతదేశంలోని కొన్ని నగరాల పర్యటన కోసం ఆయనతో పాటు విద్యార్థుల బృందం కూడా వచ్చింది. నా థీసిస్‌కి ఎగ్జామినర్‌గా కొల్మోగొరోవ్‌ను డాక్టర్ రావు ఏర్పాటు చేశారు.

పరిశోధక విద్యార్థులకు డాక్టర్ రావు ఎంతో అందుబాటులో ఉండేవారు. తన కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకకు ఆయన మమ్మల్ని ఆహ్వానించారు. ఆ కార్యక్రమంలో ఆయన కుమార్తె తేజ నృత్య ప్రదర్శన కూడా జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖుల పరిచయాలు ఆయనకు ఉండేవి. అమెరికా, బ్రిటన్, పూర్వపు యూఎస్ఎస్ఆర్‌లో పోస్ట్ డాక్టోరల్ విజిటింగ్ పొజిషన్‌లను పొందడంలో తన విద్యార్థులకు ఆయన ఎంతో సహాయం చేసేవారు.

డాక్టర్ రావు ఒక అద్భుతమైన ఔత్సాహిక ఫొటోగ్రాఫర్. ఆయన అమెరికాకు వెళ్ళిన తర్వాత పిట్స్‌బర్గ్‌లోనూ, కాలేజ్ పార్క్‌లోనూ నేను ఆయన్ని కొన్నిసార్లు సందర్శించాను. తన కుమార్తె దగ్గర ఉండేందుకు ఆయన బఫెలోకు తరలి వెళ్లారు. బఫెలోలోనే ఆయన్ని చివరిసారి కలిశాను. అక్కడ ఆయనతో, తేజతో కొన్ని గంటలు గడిపాను. ఆ సమయంలో ఆయన దాదాపు 100 సంవత్సరాల వయసులో ఉన్నారు. అయినప్పటికీ చాలా చురుగ్గా ఉండేవారు.

విద్యావేత్తలు ఈ ప్రపంచాన్ని విడిచిపెడుతున్నప్పుడు, వారు తమ ప్రచురణలను, విద్యార్థుల వారసత్వాన్ని వదిలివెళతారు. ఈ విషయంలో, డాక్టర్ సి.ఆర్. రావు డాక్టోరల్, మాస్టర్స్ స్థాయిలో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. దాదాపు 50కి పైగా డాక్టోరల్ విద్యార్థులకు ఆయన నిర్దేశం చేశారు. ఆయన బోధనలు పొందినవారు, ఆ పొందినవారి విద్యార్థులతో సహా మొత్తం ఆయనకు 750 మందికి పైగా 'వారసులు' ఉన్నారు. ఆయన వెలువరించిన ప్రచురణలు సైద్ధాంతికపరమైనవి; అదే సమయంలో భిన్న విషయాలకు సంబంధించిన అనువర్తనాలను(అప్లికేషన్స్) అవి కలిగి ఉన్నాయి. స్టాటిస్టిక్స్ రంగంలో ఆయన దిగ్గజం. తన వెనుక గొప్ప వారసత్వాన్ని వదిలివెళ్లారు. ఆయనను గురువుగా, రోల్ మోడల్‌గా పొందడం నా అదృష్టం.

వ్యాసకర్త 'పద్మవిభూషణ్' గ్రహీత, న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వందనం



ఎవరి నుంచైతే 'ఓం'తో ఆరంభమై, విశ్వశక్తి ఉదయిస్తుందో ఆ వేద మాత, వాక్ శక్తి రూపమైన సరస్వతీ దేవిని ప్రపంచ సంస్కృత దినోత్సవం (ఆగస్ట్ 31) సందర్భంగా ప్రార్థిద్దాం. ఆమె మనకు వివేకం, కళ, భక్తి ప్రసాదించు గాక!

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యులు

గురు ప్రేరణ



పునరుజ్జీవన పథగామి నారాయణ గురు ఘన వారసత్వాన్ని (ఆయన జయంతి సందర్భంగా) స్మరించుకుంటున్నాను. కుల వివక్ష లాంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన జరిపిన ప్రజా మధ్యవర్తిత్వాలు ఆధునిక కేరళ నిర్మాణంలో ఎంతగానో ప్రభావం చూపాయి. గురు బోధలు ఇప్పటికీ ప్రేరణ కలిగిస్తూనే ఉన్నాయి.

– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

అందుకేనా?



భారత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను (17వ లోక్‌సభ 13వ సమావేశాలు, రాజ్యసభ 261వ సమావేశాలు) సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. 2023 డిసెంబర్‌లోనే ముందస్తు సాధారణ ఎన్నికలు జరగనున్నాయా?

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

బతకనీయరా?



'ఎక్స్(ట్విట్టర్)'లోకి వీడియో, ఆడియో కాల్స్ వస్తున్నాయని వార్త. ఎలాన్ మస్క్, నీకేమైనా మతిపోయిందా? ఇప్పటికే రోజంతా అక్కర్లేని మార్కెటింగ్ కాల్స్‌తో సతమతం అవుతుంటే, ఇప్పుడు ట్రోల్స్, ఆన్‌లైన్ దుర్వినియోగదారుల ఫోన్ కాల్స్ కూడా స్వీకరించాలా?

– స్మితా శర్మ, జర్నలిస్ట్

రైతు బాగుండాలి!




ఆగస్టు నెలలో 40 శాతం తక్కువ వర్షాలు కురవడం ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్రలోని నాయకులందరూ ఈ సమస్యను అధిగమించడంలో ఒక్కటవ్వాలని ఆశ. వ్యవసాయ సంక్షోభం మనం ఎన్నటికీ కోరుకోకూడనిది!

– విక్రమ్ సాఠయే, కార్పొరేట్ స్పీకర్

ఆయన మాటలు నమ్మేదెలా?

సందర్భం



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడుకు జర్నలిస్టుగా నాది ఒక సవాల్... 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో చేస్తున్న వాగ్దానాల అమలుకు ఎంత వ్యయం అవుతుందో లెక్కగట్టి, ఆ నిధులు ఎక్కడ నుంచి తెస్తారో గణాంకాలతో సంతృప్తికరంగా చెప్పగలిగితే నేను ఆయనపై ఆర్టికల్స్ రాయడం మానేస్తాను. అలా కాని పక్షంలో మరోసారి ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు నాయుడు, టీడీపీ నేతలు సిద్ధం అవుతున్నారని భావించవలసి వస్తుంది. ఎందుకంటే జగన్ అమలు చేస్తున్న వివిధ పథకాలతో రాష్ట్రం నాశనం అయిపోయిందని ప్రచారం చేసిన చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు తాము కూడా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామనీ, జగన్ ఇస్తున్న దానికన్నా మూడు, నాలుగు రెట్లు అధికంగా ఇస్తామని చెబుతున్నారు.

'అమ్మ ఒడి' స్కీముకు జగన్ ఇంటికి ఒకరికి పదిహేను వేలు ఇస్తుంటే, తాను ఎందరు పిల్లలు ఉన్నా... ఒక్కొక్కరికి పదిహేనువేల చొప్పున ఇస్తానంటున్నారు. ప్రతి కుటుంబంలోని మహిళలకు 1500 చొప్పున డబ్బు ఇస్తారట. ఈ స్కీము ఒక్కదానికే 37 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ఒక అంచనా. రైతులకు 20 వేల చొప్పున ఇస్తారట. ఇంటింటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ అట. నిరుద్యోగులకు భృతిగా మూడు వేల చొప్పున ఇస్తారట. ఇవి కాకుండా వృద్ధాప్య పెన్షన్‌లు ఉండనే ఉన్నాయి. ఎన్నికల నాటికి మరికొన్ని ప్రకటిస్తారట. వీటన్నిటినీ అమలు చేస్తారంటే విజ్ఞులైనవారు ఎవరైనా నమ్ముతారా? అసలు అవి నమ్మశక్యం ఎలా అన్నది మాత్రం చంద్రబాబు ఎందుకు వివరించడం లేదు?

పవన్ కల్యాణ్ అంటే ఆయనకు పెద్దగా చదువు లేదు, పాలన అనుభవం లేదు కనుక ఏదో ఒకటి చెబుతున్నారులే అని సరిపెట్టుకోవచ్చు. కాని పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, పదిహేనేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్న మనిషి వచ్చే సాధారణ ఎన్నికల కోసం చేస్తున్న గాలి వాగ్దానాలు చేస్తుంటే, వాటికి 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ' అని పేరు పెట్టడం గమనిస్తుంటే ఈయన అనుభవం అంతా ప్రజలను మోసం చేయడానికేనా అన్న అనుమానం వస్తుంది. ఆయనకు 'ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5' వంటి మీడియా సంస్థలు మద్దతు ఇస్తూ ఊదర గొట్టవచ్చు. అంత మాత్రాన ప్రజలంతా ఆ హామీలను నమ్ము తారనుకుంటే పొరపాటు.

ఎందుకంటే 2014 ఎన్నికలలో రైతుల రుణాలన్నిటినీ, రైతుల భార్యల మెడలలోని బంగారం తాకట్టు పెట్టి తెచ్చిన రుణాలతో సహా అన్నిటినీ మాఫీ చేస్తానని చెప్పినప్పుడు నాబోటి వాళ్లం అదెలా సాధ్యమని అడిగేవారం. దానికి చంద్రబాబు ఆర్థిక సలహాదారు కుటుంబరావు వంటివారు... 'అబ్బో మా చంద్రబాబుకు చాలా అనుభవం ఉంది, ఆయన చేసి చూపిస్తారు' అని బొల్లేవారు. తీరా ప్రభుత్వం వచ్చాక మొత్తం రకరకాల కమిటీలు వేసి రైతుల రుణాలు మొత్తం కాకుండా లక్షన్నరకు పరిమితం అన్నారు. దానినైనా ఇవ్వగలిగారా అంటే అదీ చేయలేకపోయారు. ఏవో బాండ్లు అన్నారు. వాయిదాలు



అన్నారు. కేంద్రం సహకరించడం లేదనీ, రిజర్వు బ్యాంక్ అంగీకరించడం లేదనీ ఏవేవో చెప్పి జనాన్ని మోసం చేశారన్న విమర్శకు గురయ్యారు.

రైతుల రుణాలతో పాటు డ్వాక్రా మహిళల రుణాల విషయంలోనూ అంతే చేశారు. ఇవే కాదు. టీడీపీ మానిఫెస్టోలో సుమారు 400 హామీలు ఇచ్చి వాటిని అమలు చేసే పరిస్థితి లేక, చివరికి పార్టీ వెబ్ సైట్ నుంచి దానిని తీసేశారు. అంతకుముందు 1995 నుంచి చేసిన తొమ్మిదేళ్ల పాలనలో కూడా అలాగే చేశారు. మద్య నిషేధం అమలు చేస్తాననీ, కిలో బియ్యం రెండు రూపాయలకే ఇస్తాననీ ఇలా పలు హామీలు ఇచ్చిన ఆయన ఆ తర్వాత వాటన్నిటికీ మంగళం పాడారు.

మళ్లీ 2024 ఎన్నికలలో అలాగే ప్రజలను మభ్య పెట్టడానికి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో టీడీపీ గెలిస్తే ప్రజలకు ఎవరెవరికి ఎంత మొత్తం వస్తుందో చెబుతూ బాండ్లు కూడా ఇస్తారట. ప్రభుత్వపరంగా ఇచ్చిన బాండ్లకే దిక్కు లేకపోతే, పార్టీ పరంగా ఇంటింటికి తిరిగి ఇచ్చే బాండ్లకు ఏమి గ్యారంటీ ఉంటుంది? ఎందుకంటే చంద్రబాబు చేస్తున్న తాజా వాగ్దానాలకు ఏడాదికి సుమారు లక్షన్నర కోట్లు అవసరం కావచ్చు. జగన్ ఇస్తున్న దానికన్నా మూడురెట్లు అధికంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అంటున్నారు. దీనిని బట్టి ఆ హామీల ఖర్చును అంచనా వేయవచ్చు. జగన్ అమలు చేస్తున్న అన్ని హామీల విలువ సుమారు 45 వేల కోట్లు ఉంటుందని ఒక లెక్క. దీనికే రాష్ట్రం అప్పుల పాలైపోయిందనీ, నాశనం అయిపోయిందనీ చంద్రబాబు ప్రచారం చేశారు. మరి కొత్తగా బాబు ఇస్తున్న హామీలను నెరవేర్చడానికి ఏటా లక్షన్నర కోట్ల నిధులు కేవలం సంక్షేమ కార్యక్రమాలకు సమకూర్చుకోవాలి కదా! అవి ఎక్కడ నుంచి వస్తాయో చెప్పాలి కదా! అప్పుడు అప్పులు ఏ మేరకు చేయవలసి ఉంటుందో ప్రజలకు వివరించాలి కదా! వాటిని ఎలా తీర్చవచ్చో తెలపాలి కదా! అవేవీ చేయకుండా బాండ్లు రాసిస్తామంటే జనం ఎలా నమ్మాలి. సంక్షేమ పథకాలకు పోను మిగిలిన ఖర్చులకు ఎక్కడ నుంచి డబ్బు వస్తుంది? అప్పుడు రాష్ట్రం నాశనం కాకుండా ఉంటుందని ఎలా హామీ ఇవ్వగలరు?

ఇవన్నీ ప్రజలను మోసం చేయడానికే. విజ్ఞులైన ప్రజలు వీటి గురించి ఆలోచించకపోతే పెద్ద ప్రమాదం కాదు.. కాదు.. పెను సంక్షోభంలో పడతారని చెప్పడమే ఒక జర్నలిస్టుగా నా లక్ష్యం. సంక్షేమ పథకాల విషయంలో జగన్‌ను కాపీ కొట్టినట్లుగానే, ఇప్పుడు ఇంటింటికి తిరిగి ప్రజలకు వారి హామీలు వివరిస్తూ ఒక్కొక్కరికి ఎంత లబ్ధి చేకూరుతుందో చెప్పడం కూడా కాపీనే. జగన్ గడప గడపకు అధికారిక కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందీ వారికి పత్రాలు ఇప్పించారు. టీడీపీ నేతలు అదే రీతిలో భవిష్యత్తుకు గ్యారంటీ అని పత్రాలు ఇస్తారట.

ప్రజలను మభ్యపెట్టాలన్నది వారి తాపత్రయం. తెలుగుదేశంలో పిచ్చి ఎంతవరకు వెళ్లిందంటే చంద్రయాన్ 3 సఫలం అయిందనీ, అలాగే ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వస్తారనీ చెప్పేంతవరకు! ఇలాంటివారిని ఎన్నుకుంటే ప్రజలకు దక్కేది చందమామ కథలే. నా ఛాలెంజ్‌ను చంద్రబాబు గానీ, ఆయన తరఫున ఎవరైనా గానీ స్వీకరిస్తారా?

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్

పసివాళ్లపైనా విద్వేష రాజకీయాలా?

మత విద్వేషాలు ఇప్పుడు పాఠశాలలో చదివే పసివాళ్లనూ, వారికి విద్యాబుద్ధులు చెప్పే టీచర్లనూ కబళించివేస్తున్నాయి. ఫలితంగా పాఠశాలలు అమానవీయతకు చిరునామాలుగా మారుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఓ బాలుణ్ణి చెంపదెబ్బలు కొట్టించి అవమానించిన ఘటన కానీ, జమ్మూలో మరో బాలుణ్ణి చితక్కొట్టిన వైనం కానీ దేశం ఏం కాబోతోందన్న ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఒక సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని తోటి విద్యార్థులతో చెంపదెబ్బలు కొట్టిస్తూ కుర్చీలో కూర్చుని ఓ మహిళా టీచర్ సంతోషపడుతూ ముస్లిం పిల్లలకు ఇలాంటి ట్రీట్మెంట్ మాత్రమే వారిని ఈ దేశం నుంచి వెళ్లగొట్టగలదు అంటున్నది. చెంప దెబ్బలు, ఎందుకు? ఏమిటీ? అనేది తెలియదు కాని, బాధిత విద్యార్థిని తోటి విద్యార్థులతో చెంప మీద కొట్టిస్తూ, ఒక సామాజిక వర్గం కోసం మాట్లాడడం ఆందోళనకరం. బాధిత విద్యార్థి ఏడుస్తూనే ఉన్నాడు. మరొక టీచర్ నిలబడి వీడియో తీస్తున్న, నవ్వుతున్న వీడియో వెలుగులోకి వచ్చింది. అమానవీయమైన ఈ దృశ్యం దేశం లోని టీవీలు, సోషల్ మీడియాలో స్కూల్‌కు వెళ్లే కోట్లాది మంది పిల్లల తల్లితండ్రులు చూసి ఉంటారు. బాధిత



విద్యార్థి కుటుంబం మీద ఇతరుల మీద ఈ వీడియో ప్రభావం ఎంత పడి ఉంటుంది? ఇంత జరిగినా ప్రతి చిన్న విషయానికి స్పందించే భారతదేశ బాల వికాస్ మంత్రి స్మృతి ఇరాని ఇంకా మౌనంగానే ఉన్నారు. ఇస్రోలో ప్రధానమంత్రి ఆనంద భాష్పాలు ఆమెకు కనిపించాయి, (మంత్రి దీని మీద ట్వీట్ చేశారు) కాని ఆమెకు పసివాడి కన్నీరు కనిపించలేదు.

అటు జమ్మూలోని కథువా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి ఒకరు బ్లాక్ బోర్డు మీద 'జై శ్రీరామ్' అని రాశాడని అతడిని టీచర్, ప్రిన్సిపాల్ చితకబాదారు. మరోసారి అలా రాస్తే చంపేస్తామని బెదిరించారు. విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో టీచర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రిన్సిపాల్ పరారీలో ఉన్నాడు. ఈ సంఘటనకు నిరసనగా పేరెంట్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ఇద్దరి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్–75 కింద, ఐపీసీ 323, 342, 504, 506 సెక్షన్స్ కింద కేసులు నమోదు చేశారు.

ఈ సంఘటనలను గమనిస్తే విద్వేషాలు ఇప్పుడు బజార్ నుంచి బడుల్లోకి చేరుకున్నాయనిపిస్తోంది. పీఎమ్ మోదీ జీ! దేశంలో ఏం జరుగుతోంది? నడుస్తున్న ట్రైన్‌లో ఒక జవాన్ మీ పేరు ఉచ్చరిస్తూ ప్రయాణీకులలో ఒక సామాజిక వర్గం వారిని టార్గెట్ చేసి ముగ్గురిని కాల్చి చంపాడు. 'ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్లిపోండి' అంటూ మీ క్యాబినెట్ లోని గిరిదాస్ కిశోర్ అనే మంత్రి పేర్కొన్నాడు. ఒక మంత్రి 'గోలి మారో సాలోంకు' అన్నాడు.

మొన్నటికి మొన్న హరియాణాలో బుల్డోజర్‌లతో ఒకే సామాజిక వర్గం ఇండ్లను, వ్యాపార సముదాయాలను కూల్చి వేశారు. నిజానికి మీ పాలన గురించి చరిత్ర రాస్తే ఒక కలంకిత రాజు (పీఎం) పాలన కనిపిస్తుంది. మీరు చెబుతున్న 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అంటే ఇదేనా! ఏ విధంగా చూసినా పై చర్య క్షమించరానిది! మోదీజీ స్పందించండి! 'తూ హిందూ బనేగా నా, ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కీ ఔలాద్ హై ఇన్సాన్ బనేగా' అనే మొహమ్మద్ రఫీ పాడిన పాట సందేశాన్ని ఇవ్వండి మోదీజీ!

'హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి, భాయి, భాయి' అనే భారత్‌ను విద్వేషం అనే విషపు కోరల్లోకి వెళ్లకుండా చూద్దాం! 'అవాజ్ దో హమ్ ఏక్ హై!' దేశ భవిష్యత్తు అయిన స్కూలు పిల్లల మీద కూడా విద్వేష భావాలు నాటుకునే విధంగా తయారవుతున్న టీచర్ల రూపంలోని విషపు నాగులను తుంగలోనే తొక్కేద్దాం! విద్వేషానికి మన దేశంలో ఏమాత్రం చోటు లేదు. ప్రేమ, సద్భావన, శాంతి, అహింస, మానవత్వాలకు ఈ దేశం ప్రతీక. ఇక్కడ మహాత్మాగాంధీ ఆత్మ సందేశం మాత్రమే మార్గదర్శనం అనేది గుర్తుంచుకోవాలి.

– ఎమ్‌డి. మునీర్,
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు । 99518 65223

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.విదియ రా.3.22 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పూర్వాభాద్ర సా.6.47 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.3.48 నుండి 5.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.20 నుండి 12.47 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

రేపు సికింద్రాబాద్‌-కాకినాడ టౌన్‌ మధ్య ప్రత్యేక రైలు



రైల్వేస్టేషన్‌(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సెప్టెంబర్‌ రెండో తేదీన సికింద్రాబాద్‌-కాకినాడ టౌన్‌ మధ్య ప్రత్యేక రైలు (07071) నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు రెండో తేదీ రాత్రి 8.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు కాకినాడ టౌన్‌ చేరుతుంది. కాజీపేట, వరంగల్‌, మహబూబాబాద్‌, ఖమ్మం, రాయనపాడు, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్‌, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07072) మూడో తేదీ రాత్రి 9 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్‌ చేరుకుంటుంది. సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, డోర్నకల్‌, మహబూబాబాద్‌, వరంగల్‌, ఖాజీపేట, మౌలాలీ స్టేషన్లలో ఆగుతుంది.

మేకపాటిని కలిసిన హరియాణ గవర్నర్‌



గవర్నర్‌ దత్తాత్రేయతో మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో హరియాణ గవర్నర్‌ బండారు దత్తాత్రేయ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. మేకపాటి ఇంట తేనీటి విందులో పాల్గొన్న దత్తాత్రేయ గత స్మృతులను నెమరువేసుకున్నారు. గతంలో లోక్‌సభలో నెల్లూరు ఎంపీగా మేకపాటి, సికింద్రాబాద్‌ ఎంపీగా దత్తాత్రేయ ప్రాతినిధ్యం వహించిన విషయం తెలిసిందే. నెల్లూరు జిల్లా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కూడా వారితోపాటు ఉన్నారు.



మణిపూర్‌లో కొబ్బరి కాయతో ఆడే రగ్బీ తరహా క్రీడా యూబీలక్పీ




కేరళలోని కొబ్బరి కల్లు బార్లు

కొబ్బరి.. ఎందరికో ఊపిరి

- దేశంలో కొబ్బరిది సుదీర్ఘ చరిత్ర
- ఆరోగ్యపరంగా అరుదైన ఘనత
- రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాల్లో సాగు
- సెప్టెంబర్‌ 2 అంతర్జాతీయ కొబ్బరి దినోత్సవం

సాక్షి, అమలాపురం: కొబ్బరి.. ఎక్కడ పుట్టిందో తెలియదు.. ఎప్పుడు పుట్టిందో కూడా తెలియదు. కానీ.. రైతులు, కూలీలు, కార్మికులు, వ్యాపారులు, విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే చిరు పరిశ్రమల యజమానుల నుంచి భారీ పరిశ్రమలు స్థాపించిన వ్యాపారవేత్తల వరకు లక్షల మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి కల్పిస్తోంది. కొబ్బరి ఉద్యాన పంటల్లో దీర్ఘకాలిక పంట. ఏడాది పాటు నిల్వ ఉండే ఫలం. కొబ్బరికాయ, చెట్ల నుంచి వందకు పైగా విలువ ఆధారిత ఉత్పత్తులు తయారవుతాయి. ఇటువంటి అరుదైన కొబ్బరి మన రాష్ట్రంలో మూడు లక్షల ఎకరాల్లో సాగవుతోంది. కొబ్బరి పుట్టుక దగ్గర నుంచి దాని వినియోగం వరకు చరిత్ర అమోఘం.. అద్వితీయం. తెలుసుకోవాలే గానీ.. కొబ్బరి సంగతులు ఎన్నో.. మరెన్నో. సెప్టెంబర్‌ 2వ తేదీ అంతర్జాతీయ కొబ్బరి దినోత్సవం సందర్భంగా కొబ్బరి విశేషాలివీ.



కోకస్‌ న్యూసిఫెరా

ప్రాంతం ఏదైనా అగ్రస్థానం కొబ్బరిదే

కొబ్బరి శాస్త్రీయ నామం కోకస్‌ న్యూసిఫెరా. కోకో అంటే స్పానిష్‌ భాషలో కోతి ముఖాన్ని పోలి ఉండేదని అర్థం. న్యూసిఫెరా అంటే విత్తనం. కోకస్‌ న్యూసిఫెరా అంటే కోతి ముఖాన్ని పోలి ఉండే విత్తనం అనే అర్థం ఉంది. ఆధ్యాత్మికంగా కొబ్బరికి చాలా విశిష్ట స్థానముంది. పూజలో అగ్రస్థానం దీనిదే. ఉత్తర, దక్షిణ భారత దేశంలో పూజలు, శుభ కార్యక్రమాలు, ఆలయాలు వద్ద వీటి వినియోగం అధికం. అందుకే దేశంలో కొబ్బరి ధరలు పూజలు, శుభ కార్యక్రమాలు జరిగే సీజన్‌లో పెరుగుతుంటాయి.

జన్మస్థలంపై శాస్త్రీయ ఆధారాలు లేవు



కొబ్బరికాయ పుట్టిన స్థలంపై ఇప్పటికీ శాస్త్రీయ ఆధారాలు లేవు. కోనసీమ రావడానికి మాత్రం లక్షద్వీప్‌ నుంచి నావికులు యానాం తీసుకువచ్చారని ఒక వాదన. కాగా, 19వ శతాబ్దంలో యానాంను పాలించిన పోర్చుగీసు వాసులు ఇతర దేశాల నుంచి వీటిని తెచ్చారనేది మరొక వాదన. డెల్టా నేలలు కావడంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో కొబ్బరి సాగు వేగంగా విస్తరించింది.

– ఎన్‌బీవీ చలపతిరావు, వైఎస్సార్‌ ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతి, అంబాజీపేట

సెలైన్‌గా కొబ్బరి బొండాం

- కొబ్బరి బొండాం సెలైన్‌తో సమానమంటారు. 1939 నుంచి 45 మధ్య రెండో ప్రపంచ యుద్ధ సమయంలో గాయపడ్డ సైనికులకు త్వరగా శక్తి వచ్చేందుకు తగినన్ని గ్లూకోజ్‌ బాటిళ్లు అందుబాటులో ఉండేవి కాదు. అప్పుడు కొబ్బరి నీళ్లను శరీరంలోకి నేరుగా ఎక్కించారని చరిత్ర చెబుతోంది.
- కొబ్బరి ఎక్కడ పుట్టిందనే దానిపై శాస్త్రీయ ఆధారం లేదు. కానీ.. ఆస్ట్రేలియా సమీపంలోని కోకోస్‌ ద్వీపాలు వీటి జన్మస్థలమని చెబుతారు. అక్కడ నుంచి కొబ్బరి కాయలు సముద్రంలో కొట్టుకు రావడంతో ఇతర దేశాలకు కొబ్బరి విస్తరించింది.
- కొబ్బరి నూనెలో కొలెస్ట్రాల్‌ శాతం తక్కువగా ఉండడం వల్ల దీంతో వంటకాలు చేయడం మంచిదనే అభిప్రాయం ఉంది. కేరళ వాసులు వంటలకు ఇదే నూనెను ఉపయోగిస్తారు.
- కొబ్బరి కాయ, కొబ్బరి బొండాంతో మణిపూర్‌ వాసులు యూబీలక్పీ అనే ఆట ఆడతారు. మణిపూర్‌లో యూబీ అంటే కొబ్బరికాయ అని, లక్పీ అంటే లాక్కుని వెళ్లడం అని అర్థం. ఇంచుమించు రగ్బీలా మాదిరిగా ఈ ఆట సాగుతుంది.
- అంతర్జాతీయంగా కొబ్బరి, కొబ్బరి ఉత్పత్తుల ధరలన్నీ కొబ్బరి నూనె మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయి. కొబ్బరి నూనె ధరను బట్టి పచ్చి కొబ్బరి, ఎండుకొబ్బరి, కురిడీ కొబ్బరి ధరలలో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటాయి.
- తాటి, ఈత కల్లు మాదిరిగా కేరళలో కొబ్బరి కల్లు (నీరా) ఉత్పత్తి చేస్తున్నారు. మద్యం దుకాణాల మాదిరిగా దుకాణాలు ఏర్పాటు చేసి కొబ్బరి కల్లు విక్రయిస్తున్నారు. ఇందులో తక్కువ గ్లైసెమిక్‌ ఇండెక్స్‌ (25 శాతంలోపు) ఉండటం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా ధైర్యంగా తాగవచ్చు. దీని నుంచి బెల్లం, తేనె, పంచదార తయారు చేస్తున్నారు.
- కొబ్బరి నుంచి తీసే ఆవు, గేదె పాలకన్నా శ్రేష్టమైనవని చెబుతారు. కొబ్బరి పాలను ఇప్పుడు వెల్‌కమ్‌ డ్రింక్‌గా అందిస్తున్నారు.

చిక్కిన మదపుటేనుగు..

- తమిళనాడులో మరో మహిళను తొక్కి చంపిన వైనం
- 'కుమ్కి' ఏనుగులతో చాకచక్యంగా పట్టుకున్న అటవీశాఖ
- ఊపిరి పీల్చుకున్న ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రజలు



కుమ్కీ ఏనుగుల ద్వారా ఒంటరి ఏనుగును బంధించి తీసుకెళుతున్న అటవీశాఖ సిబ్బంది

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు జిల్లా గుడిపాలలో భయోత్పాతం సృష్టించిన ఒంటరి మదపుటేనుగు ఎట్టకేలకు అధికారులకు చిక్కింది. తమిళనాడు అటవీ ప్రాంతం నుంచి మంగళవారం రాత్రి వచ్చిన ఏనుగుల గుంపులో ఓ ఏనుగు తప్పిపోయి.. బుధవారం చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలో వెంకటేశులు, సెల్వి అనే భార్యభర్తలను తొక్కి చంపిన ఏనుగు, కార్తిక్‌ అనే యువకుడిని తీవ్రంగా గాయపరిచింది. బుధవారం రాత్రి గుడిపాలలో అటవీప్రాంతాల్లోకి వెళ్లిపోయిన ఏనుగు తమిళనాడు రాష్ట్రంలోకి వెళ్లిపోయింది. గురువారం తెల్లవారుజామున తమిళనాడు రాష్ట్రం పెరియ బోడినత్తం గ్రామంలోకి వెళ్లిపోయి అక్కడ వసంత (54) అనే మహిళను తొండంతో ఎత్తి కిందకేసి కాలితో తొక్కి చంపేసింది. ఒంటరి ఏనుగు బీభత్సంలో ఓ మేక కూడా చనిపోయింది. అక్కడి నుంచి మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి చిత్తూరు జిల్లా గుడిపాల మండలానికి చేరుకుంది. ఒంటరి ఏనుగు 197–రామాపురం గ్రామంలోకి రావడంతో మళ్లీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతూ బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఏనుగు జాడ గుర్తించిన అటవీశాఖ అధికారులు అప్పటికే కుమ్కీ ఏనుగులతో సిద్ధంగా ఉంటూ మదపుటేనుగును వెంబడించి డప్పులు కొడుతూ, టపాకాయలు పేల్చుతూ అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. తిరుపతి జూ పార్కు నుంచి వచ్చిన వైద్యుల సాయంతో మదపుటేనుగుకు మత్తు ఇంజెక్షన్‌ ఇవ్వడంతో అది కిందపడిపోయింది. తాళ్ల సాయంతో ఏనుగును బంధించి తిరుపతి జూ పార్కుకు తరలించారు. ఈ మొత్తం ఆపరేషన్‌లో చిత్తూరు అటవీశాఖ అధికారి చైతన్యకుమార్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. మరోవైపు ఏనుగు దాడిలో మృతిచెందిన దంపతులకు అంత్యక్రియలు నిర్వహించగా, ప్రభుత్వం అందించిన రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

16 నెలల బాలుడి కిడ్నాప్‌

- ప్రకాశం జిల్లా సీఎస్‌ పురం మండలం చింతలపాలెంలో ఘటన

సీఎస్‌ పురం (పామూరు): ప్రకాశం జిల్లా సీఎస్‌ పురం మండలం చింతలపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో 16 నెలల బాలుడు సాత్విక్‌షాలోన్‌ కిడ్నాప్‌ అయ్యాడు. మైలారి సామ్యేలు భార్య కెజియ, తల్లి తిరుపాలమ్మ, 16 నెలల కుమారుడు సాత్విక్‌షాలోన్‌తో కలిసి ఈ కాలనీలో ఉంటున్నాడు. తిరుపతిలో బేల్దారి పనులు చేసే సామ్యేలు తొమ్మిది రోజుల కిందట వచ్చివెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అత్తాకోడళ్లు కెజియ, తిరుపాలమ్మ ఇంటిముందు వరండాలో మంచాలు వేసుకుని పడుకున్నాడు. సాత్విక్‌షాలోన్‌ను తనవద్ద పడుకోబెట్టుకున్న నానమ్మ తిరుపాలమ్మ అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాలు తాగించింది. తర్వాత 1.30 – 2 గంటల మధ్యలో మంచం మీద సాత్విక్‌షాలోన్‌ లేకపోవడంతో తిరుపాలమ్మ కంగారుపడి కెజియను లేపింది. బాలుడి కోసం వెదికినా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక ఎస్‌ఐ పి.అనిల్‌కుమార్‌ కేసు నమోదు చేసి క్రైం అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు, కనిగిరి డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి బాలుడి కోసం గాలిస్తున్నారు.

పంచాయతీరాజ్‌లో పదోన్నతులు

- ఎంపీడీవోలకు డీఎల్‌డీవోలుగా అవకాశం
- గ్రేడ్‌ –1 కార్యదర్శులకు ఈవోపీఆర్‌డీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్‌ శాఖలో పనిస్తున్న ఎంపీడీవోలకు డివిజనల్‌ డెవలప్‌మెంట్‌ ఆఫీసర్స్‌ (డీఎల్‌డీవో)గా, మరో 167 గ్రేడ్‌-1 పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్‌ కార్యాలయాల్లో ఈవోపీఆర్‌డీలుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి 2007 గ్రూపు-1 నోటిఫికేషన్‌ ద్వారా ఎంపీడీవోలుగా ఉద్యోగాలు పొందిన మొత్తం 66 మంది సీనియారిటీ జాబితాను పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన డిపార్ట్‌మెంటల్‌ ప్రమోషన్‌ కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపినట్టు పంచాయతీరాజ్‌ శాఖ ఇన్‌చార్జి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది గురువారం వెల్లడించారు. కాగా.. 66 మంది ఎంపీడీవోల సీనియారిటీ జాబితాల్లో 14 మందిపై వివిధ శాఖాపరమైన అభియోగాలు పెండింగ్‌లో ఉన్నట్టు తెలిపారు. సీనియారిటీ జాబితాలో శాఖాపరమైన అభియోగాలు పెండింగ్‌ లేని ఎంపీడీవోల పదోన్నతులకు పూర్తి స్థాయిలో అర్హులుగా వివరించారు. కాగా.. పూర్వం మేజర్‌ గ్రామ పంచాయతీలో ఎగ్జిక్యూటివ్‌ అధికారులు(ఈవో)గా, గతంలో విలేజి డెవలప్‌మెంట్‌ అధికారులు(వీడీవో)గా పనిచేసి ప్రస్తుతం గ్రేడ్‌-1 పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగుతున్న వారితోపాటు మండల, జిల్లా పరిషత్‌ కార్యాలయాలు, డీపీవో కార్యాలయాల్లో సీనియర్‌ అసిస్టెంట్‌ ఉద్యోగ బాధ్యతల్లో ఉన్న 167 మందికి ఈవోపీఆర్‌డీలుగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్‌ శాఖ కమిషనర్‌ సూర్యకుమారి ఆమోదం తెలిపారు. ఈవోపీఆర్‌డీలుగా పదోన్నతులు కల్పించినందుకు రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వైవీడీ ప్రసాద్‌ సీఎంకు, పంచాయతీరాజ్‌ శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

రాజధాని పేరుతో దొంగల ముఠా దోపిడీ

- 1,068వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: రాజధాని పేరుతో బాబు అండ్‌ కో దొంగల ముఠా నిలువు దోపిడీ చేసిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌ యాక్సిస్‌ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 1,068వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. కులవాదులంతా అన్ని పార్టీల్లో చేరి బాబును గెలిపించి రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసేందుకు చేస్తున్న యత్నాలు ఎప్పటికీ ఫలించబోవన్నారు. బహుజనులంతా ఏకమై తమ హక్కులను హరిస్తున్న కులవాదులను తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఐదేళ్లు పాలించిన బాబు అమరావతిలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. పేదలకు ఉచితంగా విద్య, వైద్యం చేరువ చేసి ప్రైవేటుకు దీటుగా అందిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. పేదలకు ఉచితంగా 33 లక్షల ఇళ్ల స్థలాలు, అందులో పక్కా ఇళ్ల నిర్మాణం చేస్తున్న జగనన్న బహుజనులకు ఊళ్లకు ఊళ్లు నిర్మిస్తున్నారని, మరో 40 ఏళ్లు ఆయనను ముఖ్యమంత్రిగా చూడడం ఖాయమన్నారు. బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంపై ఖర్చు.. భవిష్యత్తు నిర్మాణమే

'సాక్షి' ఇంటర్వ్యూలో విఖ్యాత జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్‌

- సంక్షేమంపై అంత వ్యయం ఎందుకనే వారికి ఐదేళ్లలో ఫలితాలు అర్థమవుతాయి
- అభివృద్ధికి అసలైన నిర్వచనం మానవాభివృద్ధి.. ఏపీ రోల్‌ మోడల్‌గా నిలుస్తుంది
- ఆకలి, అనారోగ్యం లేని జనాభాను నిర్మించడమే నిజమైన అభివృద్ధికి నిదర్శనం
- కోవిడ్‌ సంక్షోభం సమాజంలో అంతరాలు, అసమానతలను పెంచింది
- వాటిని రూపుమాపడానికి పేదలకు మరింత చేయూత అవసరం
- ఎంజీఆర్‌ స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని తెచ్చినప్పుడు ఎగతాళి చేశారు
- పిల్లలంతా మన పిల్లలే అనే భావన పాలకులకు ఉండాలి
- రైతులపై ఒత్తిడి తగ్గించడానికి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ చర్యలు బాగున్నాయి
- అగ్రిల్యాబ్స్‌ కాన్సెప్ట్‌ బాగుంది... నిర్వహణ బాధ్యత రైతులకే అప్పగించాలి
- ప్రతి కుటుంబాన్ని 'ఫ్యామిలీ డాక్టర్‌' సందర్శించడం మానవ హక్కుల పరిరక్షణే
- వాతావరణ మార్పుల దుష్ప్రభావం సాగు సంక్షోభానికి దారి తీస్తుంది
- అధిగమించే చర్యలను సూచించే బాధ్యతను యూనివర్సిటీలకు అప్పగించాలి

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

పరిచయం అక్కర్లేని విఖ్యాత జర్నలిస్టు.. పాలగుమ్మి సాయినాథ్‌! గ్రామీణ అంశాలపై ఎన్నో విస్తృత కథనాలు రాసిన అనుభవం ఆయనది. పేదరిక నిర్మూలన, ఆకలి లేని సమాజం నిర్మాణం, పేదలకు మెరుగైన ఉపాధి కల్పన, వ్యవసాయ సంక్షోభ నివారణకు మార్గాన్వేషణ, మహిళా సాధికారత లక్ష్యంగా కృషి చేశారు. ఆసియా నోబెల్‌గా భావించే రామన్‌ మెగసెసే అవార్డు గ్రహీత. ఇక ఆయనకు లభించిన గౌరవ డాక్టరేట్లకు కొదవే లేదు. ఇటీవల విజయవాడ వచ్చిన పాలగుమ్మి సాయినాథ్‌ 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇవీ..

సంక్షేమాన్ని అపహాస్యం చేసే వాళ్లు చరిత్రంతా కనపడతారు..

సంక్షేమంపై ఎక్కువ ఖర్చు పెట్టడానికి నేను అనుకూలం. సంక్షేమ కార్యక్రమాల ప్రస్తావన రాగానే ఒక వర్గం ఎగతాళిగా చూడటం, మాట్లాడటాన్ని చరిత్రలో చాలాసార్లు చూశాం. మీకొక ఉదాహరణ చెబుతా.. ఎంజీ రామచంద్రన్‌ తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడు చాలా మంది ఎగతాళిగా మాట్లాడారు. మీడియా కూడా అపహాస్యం చేసింది. ఇండియన్‌ ఎక్స్‌ప్రెస్‌, ఇంకా చాలా పత్రికలు ఎంతో అపహాస్యం చేస్తూ వార్తలు ప్రచురించడం నాకు గుర్తుంది. టీచర్లను వంట మనుషులుగా చిత్రీకరించి కార్టూన్లు వేశాయి. తర్వాత ఏమైంది? నాలుగేళ్ల తర్వాత మధ్యాహ్న భోజన పథకానికి తమిళనాడు గ్లోబల్‌ రోల్‌ మోడల్‌ అని యూనిసెఫ్‌ ప్రశంసించింది. దశాబ్దం తిరగక ముందే దేశంలోని అన్ని రాష్ట్రాలు స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశాయి. మిగతా రాష్ట్రాల కంటే మేం మెరుగ్గా అమలు చేస్తున్నామని చాలా రాష్ట్రాలు ప్రకటించుకోవటాన్ని చూశాం.

మన పిల్లలే అనే భావన పాలకులకు ఉండాలి..

సమాజంలో అసమానతలను కోవిడ్‌ సంక్షోభం పెంచింది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ద్రవ్యోల్బణం నమ్మశక్యం కాని రీతిలో పెరిగిపోతోంది. దేశంలో పేదల ఆకలిని మరింత పెంచే ప్రమాద కారకాలు ఇవి. ఈ సంక్షోభం నుంచి బయట పడటానికి సంక్షేమ కార్యక్రమాలు ఎంతో అవసరం. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగుపరిచి విస్తరించాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ ప్రయత్నం జరగడం సంతోషం. పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలి. భోజనం చేసే పిల్లలంతా మన పిల్లలనే భావన పాలకులకు ఉండాలి. రోజుకొక గుడ్డు ఇస్తే పిల్లలకు పోషకాహారం అందడంతో పాటు పౌల్ట్రీ రంగం కూడా బాగుపడుతుంది. స్కూళ్లలో ఉదయాన్నే రాగి జావ ఇవ్వడం ఆహ్వానించదగిన పరిణామం.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ వంతు..

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఎలా అపహాస్యానికి గురైందో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ కూడా అంతే. సంక్షేమం మీద ఎక్కువ ఖర్చు పెడుతున్నారని వాపోతున్న వారికి కొన్నేళ్ల తర్వాత ఈ రాష్ట్రం.. 'హ్యూమన్‌ డెవలప్‌మెంట్‌'లో రోల్‌ మోడల్‌గా నిలిచాక అర్థమవుతుంది.



'అభివృద్ధి'ని ఎలా అర్థం చేసుకున్నారనే అంశం మీద మనం చేస్తున్న ఖర్చును నిర్వచించాల్సి ఉంటుంది. జీడీపీ (జాతీయ స్థూల ఉత్పత్తి) పెరిగి ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిన సమయంలో ప్రజలు ఆకలి బాధతో అల్లాడిపోతే దాన్ని అభివృద్ధి అందామా? అది సంపన్నుల అభివృద్ధి మాత్రమే అవుతుంది. మన దృష్టి అంతా ప్రజలకు ఏది మంచి అనే విషయం మీదే ఉండాలి. అనారోగ్యంతో, ఆకలితో అల్లాడుతున్న జనాభా పెరుగుతున్నప్పుడు అభివృద్ధికి అర్థం ఉండదు. వర్క్‌ఫోర్స్‌ ఆరోగ్యంగా, గరిష్ట సామర్థ్యంతో పనిచేయగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి అర్థం.

ఆకలిని రూపుమాపి.. ఆరోగ్యకరమైన జనాభా

ఆకలిని రూపుమాపి ఆరోగ్యకరమైన జనాభాను నిర్మించడమే అభివృద్ధి. అది మానవాభివృద్ధి (హ్యూమన్‌ డెవలప్‌మెంట్‌). ప్రతి అంశం మీద ప్రతి ఒక్కరూ ఒకే విధమైన ఆలోచనతో ఉండాలని భావించలేం. అభివృద్ధిపై ఒక్కొక్కరికి ఒక్కో రకమైన దృష్టి కోణం ఉంటుంది. నేను మానవాభివృద్ధినే చూస్తా. హ్యూమన్‌ క్యాపిటల్‌ మీద దృష్టి లేకుండా ఏ సమాజమూ అభివృద్ధి దిశగా అడుగులు వేయలేదు. మానవాభివృద్ధి సూచీలో ఆంధ్రప్రదేశ్‌ ఎలాంటి ప్రగతి కనపరుస్తుందో 5 సంవత్సరాల తర్వాత చూడాలి.

ఏపీ సహా కోస్టల్‌ రాష్ట్రాలన్నీ తక్షణం స్పందించాలి..

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అన్నదాతలకు అనుకూలమైన చాలా కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే ఇప్పుడు దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్య వాతావరణ మార్పుల దుష్ప్రభావం. మనం తక్షణం స్పందించి వినూత్న విధానాలను రూపొందించి అమలు చేయడం అత్యావశ్యకం. ఆంధ్రప్రదేశ్‌ సహా కోస్టల్‌ రాష్ట్రాలన్నీ తక్షణం ఈ సమస్యపై దృష్టి సారించాలి. ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం వెంటనే వాతావరణ మార్పుల ప్రభావాన్ని అధిగమించడానికి ఏం చేయాలనే అంశంపై అధ్యయన బాధ్యతను యూనివర్సిటీలకు అప్పజెప్పాలి. ఆయా ఆగ్రో ఎకోలాజికల్‌ జోన్స్‌లో పరిశోధనలు చేయాలని స్థానిక యూనివర్సిటీలను ప్రభుత్వం అడగాలి. శాస్త్రవేత్తల సూచనలను పరిగణలోకి తీసుకొని 'క్లైమేట్‌ యాక్షన్‌ ప్లాన్‌'కు ప్రభుత్వం రూపకల్పన చేయాలి. బ్యూరోక్రసీ కంటే యూనివర్సిటీలే అధ్యయనం చేయగలవని నా నమ్మకం.

విద్య, వైద్యం, సాగు.. బాగున్నాయి

- ఏపీలో ఫ్యామిలీ డాక్టర్‌ కాన్సెప్ట్‌ బాగుంది. గ్రామాల్లో అవసరం ఉన్న ప్రతి కుటుంబాన్ని వైద్యుడు సందర్శించడం బేసిక్‌ హ్యూమన్‌ రైట్‌ (మానవ హక్కుల) పరిరక్షణ కిందకే వస్తుంది. ప్రతి మనిషికి వైద్యం అందించడం మానవ హక్కుల పరిరక్షణే. ఈ కార్యక్రమం అమలుకు నిరంతర పర్యవేక్షణ అవసరం.
- విద్యారంగంలో తీసుకొచ్చే మార్పులు పేదలకు నేరుగా ఉపయోగపడతాయి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్‌కు గట్టి పునాదులు వేయడం సాధ్యమవుతుంది. పేదలకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా మానవ హక్కుల పరిరక్షణకు పాటు పడినట్లే.
- అగ్రి ల్యాబ్స్‌ ఏర్పాటు చేయడం మంచి పరిణామం. రైతులకు ఉపయోగపడతాయి. వాటి నిర్వహణను బ్యూరోక్రసీకి (అధికార యంత్రాంగానికి) కాకుండా రైతులకు అప్పగిస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.
- సామాన్యులను వీలైనంత ఎక్కువ సంఖ్యలో వ్యవస్థలో భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించడం సాధ్యమవుతుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.


వైఎస్సార్‌ కార్యక్రమాలు వినూత్నం.. ముందడుగు వేసిన సీఎం జగన్‌

డాక్టర్‌ వైఎస్‌ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను గట్టెక్కించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు జయతి ఘోష్‌ కమిటీని నియమించారు. రైతన్నలను ఆదుకునేందుకు వినూత్న, విభిన్న కార్యాచరణకు డాక్టర్‌ వైఎస్సార్‌ శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌ వారసత్వాన్ని అందుకొని ముందడుగు వేసిన వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఒత్తిడి నుంచి బయట పడేయటానికి చాలా చర్యలు చేపట్టారు. దేశంలో ఏ రాష్ట్రాల్లోనూ అమలు చేయని ఎన్నో కార్యక్రమాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టింది. ఆర్బీకేల ఏర్పాటు మొదలు రైతు భరోసా వరకు అన్ని కార్యక్రమాలు, పథకాలు రైతులకు అనుకూలమైనవే. వాటిని మరింత కన్సాలిడేట్‌ చేయడం ప్రభుత్వం ముందున్న సవాల్‌.

జేఈఈ–2024కి ఎన్నికల గండం!

జనవరి, ఏప్రిల్‌ల్లో నిర్వహించే మెయిన్‌ పరీక్షలపై ప్రభావం

డిసెంబర్‌కు ముందే ఎన్నికల హడావుడి	ఆ నెలలో తెలంగాణ, మధ్యప్రదేశ్‌, రాజస్థాన్‌, ఛత్తీస్‌గఢ్‌ల్లో అసెంబ్లీ ఎన్నికలు	మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంటు సహా ఏపీ, ఒడిశా, తదితర రాష్ట్రాలకు..	ఆ సమయంలో పరీక్షల నిర్వహణకు ఆటంకాలు తప్పవంటున్న నిపుణులు



సాక్షి, అమరావతి: ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఐఐటీ), నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ (ఐఐఐటీ), తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్‌ ఎంట్రన్స్‌ ఎగ్జామినేషన్‌ (జేఈఈ)–2024కి పలు రాష్ట్రాల అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల రూపంలో ఆటంకాలు తప్పేలా లేవు. జేఈఈ మెయిన్‌ పరీక్షలను నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఏటా రెండుసార్లు జనవరి, ఏప్రిల్‌ల్లో నిర్వహిస్తోంది. అనంతరం జూన్‌/జూలై నాటికి అడ్వాన్స్‌డ్‌ను కూడా నిర్వహించి ఆయా ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలను చేపడుతోంది. అయితే వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి నిర్వహించాల్సిన జేఈఈకి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల రూపంలో అడ్డంకులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోంది. దీనివల్ల పరీక్షలు ఆలస్యమై ప్రవేశాల్లో కూడా జాప్యం జరగొచ్చని నిపుణులు చెబుతున్నారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నం..

దేశంలో ఎన్నికల హడావుడి డిసెంబర్‌కన్నా ముందే ఆరంభం కానుంది. ఆ నెలలో మధ్యప్రదేశ్‌, తెలంగాణ, రాజస్థాన్‌, ఛత్తీస్‌గఢ్‌ శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లలో ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగం మొత్తం నిమగ్నమై ఉంటుంది. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల తంతు ముగిశాక 2024 మార్చి, ఏప్రిల్‌ల్లో ఆంధ్రప్రదేశ్‌, ఒడిశా సహా కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభకు సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఏర్పాట్లలోనూ అధికార యంత్రాంగం మొత్తం తలమునకలై ఉంటుంది. ఈ ఎన్నికల ప్రభావం జేఈఈపై పడుతుందని.. ఎన్నికల సమయంలో పరీక్షల నిర్వహణ కష్టసాధ్యం కాబట్టి వాయిదా వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

గతేడాది ఇదే పరిస్థితి..

జేఈఈ మెయిన్‌ 2022కు కూడా ఇలాగే ఆటంకాలు ఏర్పడ్డాయి. అప్పట్లో ఉత్తరప్రదేశ్‌, పంజాబ్‌, ఉత్తరాఖండ్‌, మణిపూర్‌, గోవా ఎన్నికలతో పరీక్షల షెడ్యూల్‌ వాయిదా పడింది. ఆ విద్యా సంవత్సరానికి జేఈఈ పరీక్షల షెడ్యూల్‌ను ఎన్‌టీఏ ముందరి సంవత్సరం అంటే 2021 సెప్టెంబర్‌ నాటికే విడుదల చేయాల్సి ఉండగా 2022 ఫిబ్రవరిలో కానీ విడుదల కాలేదు. ఆ షెడ్యూల్‌ను కూడా మూడుసార్లు మార్చి విద్యార్థులను తీవ్ర గందరగోళానికి గురిచేసింది. ఏటా జనవరి, ఏప్రిల్‌ నెలల్లో నిర్వహించేలా ఈ పరీక్షల సాధారణ షెడ్యూల్‌ ఉండగా జేఈఈ–2022 మెయిన్‌ మొదటి సెషన్‌ పరీక్షలు ఏప్రిల్‌ 16 నుంచి 21 వరకు, రెండో సెషన్‌ పరీక్షలు మే 24 నుంచి 29 వరకు ఉంటాయని ప్రకటించింది. వివిధ రాష్ట్రాల బోర్డుల పరీక్షలు అదే సమయంలో ఉండడం, సీబీఎస్‌ఈ ప్లస్‌2 తరగతుల పరీక్షల నేపథ్యంలో మళ్లీ రెండుసార్లు వేరే తేదీలను ప్రకటించినా సమస్య పరిష్కారం కాలేదు. చివరకు ఆ ఏడాది జూన్‌, జూలైకు పరీక్షలను వాయిదా వేశారు. ఫలితంగా జూన్‌ 3న జరగాల్సిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌ పరీక్ష ఆగస్టు 28కి వాయిదా పడింది. ఈసారి అంతకన్నా ఎక్కువగా డిసెంబర్‌ ముందు నుంచే ఎన్నికల హడావుడి ఆరంభం కానుండడం, ముఖ్యమైన పార్లమెంటు ఎన్నికలు కూడా జరగాల్సి ఉండడంతో జేఈఈ పరీక్షలు ఆలస్యమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని ఆయా విద్యాసంస్థల నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 2024 జేఈఈ షెడ్యూల్‌ సెప్టెంబర్‌లో విడుదల చేస్తారో, లేదో అనుమానమేనని అంటున్నారు.

క్లుప్తంగా...

రిషి కేబినెట్‌లోకి మరో భారత సంతతి మహిళ



లండన్: బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్ కొత్తగా కేబినెట్‌లోకి క్లెయిర్ కౌటిన్హో(32) అనే భారత సంతతి మహిళా సభ్యురాలిని చేర్చుకున్నారు. ఇంధన భద్రత మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. హోం మంత్రి సుయెల్లా బ్రేవర్‌మెన్‌తోపాటు క్లెయిర్ పూర్వీకులు కూడా గోవాకు చెందిన వారే. రక్షణ మంత్రి బెన్ వాలెస్ రాజీనామాతో ఆ బాధ్యతలను ఇంధన మంత్రి గ్రాంట్ షాప్స్‌కి అప్పగించారు. షాప్స్ నిర్వహించిన శాఖను క్లెయిర్‌కు ఇచ్చారు. ఈస్ట్ సర్రే నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు.

జీ20 శిఖరాగ్ర సదస్సుకు జిన్‌పింగ్ గైర్హాజరు!

న్యూఢిల్లీ: జీ20 దేశాల అధినేతల ముఖ్యమైన శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరవుతారా? లేదా? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ నెల 9, 10న ఢిల్లీలో ఈ సదస్సు జరుగనుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్, యూకే ప్రధాన మంత్రి రిషి సునాక్ సహా వివిధ దేశాధినేతలు హాజరు కానున్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం లేదని మీడియా సంస్థలు అంచనా వేస్తున్నాయి. బదులుగా ప్రధానమంత్రి లీ కియాంగ్ రావొచ్చని తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా సదస్సుకు రావడం లేదు.

'ఎక్స్'లో ఆడియో, వీడియో కాల్స్

వాషింగ్టన్: మైక్రో బ్లాగింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్విట్టర్'ను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ గత ఏడాది కొనుగోలు చేశారు. అప్పటి నుంచి అందులో ఎన్నో మార్పులు చేస్తున్నారు. ట్విట్టర్ పేరును 'ఎక్స్'గా మార్చారు. పిట్ట స్థానంలో ఎక్స్ లోగోను పొందుపర్చారు. ఆదాయం పెంపే లక్ష్యంగా మరో నిర్ణయం తీసుకున్నారు. 'ఎక్స్'లో ఇకపై ఆడియో, వీడియో కాల్స్ సదుపాయం కల్పించనున్నట్లు ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఫోన్ నంబర్ అవసరం లేకుండానే యూజర్లతో కాల్స్‌ను కనెక్ట్ చేసుకునే సదుపాయాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్, డెస్క్‌టాప్ సహా వినియోగదారులంతా ఈ సదుపాయం పొందవచ్చని సూచించారు. ప్రభావవంతమైన ప్రపంచ అడ్రస్ బుక్‌కు 'ఎక్స్' వేదిక కానుందని, ఇందులో ప్రత్యేకమైన ఫీచర్లు ఉంటాయని వివరించారు. 'ఎక్స్'లో ప్రస్తుతం ట్వీట్ డెక్ సర్వీసులు ఉచితంగా అందిస్తున్నారు. వాటిని పెయిడ్ సర్వీసులుగా మారుస్తున్నట్లు ఎలాన్ మస్క్ వెల్లడించారు.

ఇచట కార్లకు ప్రవేశం లేదు!

అక్కడ అడుగు పెడితే కాల స్పృహ కనుమరుగవుతుంది. అసలు కాలమే వెనక్కు వెళ్తుంది. కార్లన్నవి మచ్చుకు కూడా కానరాని కాలం కళ్ల ముందు కనిపిస్తుంది. గుర్రపు బగ్గీలే అక్కడ ప్రధాన ప్రయాణ సాధనాలు. కొండొకచో గాడిదలు, కంచర గాడిదలు బరువులు మోస్తూ కనిపిస్తుంటాయి. కనుచూపు మేరా ఎటు చూసినా పరుచుకున్న పచ్చదనం, దానికి దీటుగా పోటీ పడుతూ పరిశుభ్రత కనువిందు చేస్తాయి.

ఎక్కడిదా ప్రాంతం? ఏమా కథ...?!

- వాటిని నిషేధించిన గ్రీకు ద్వీపం హైడ్రా
- గుర్రపు బగ్గీలు, గాడిదలే ప్రయాణ సాధనాలు
- బారులు తీరుతున్న సందర్శకులు
- అక్కడే స్థిరపడుతున్న వీఐపీలు



గ్రీస్ దేశంలో అనగనగా అదో ద్వీపం. పేరు హైడ్రా. అక్కడి ఎజియన్ సముద్రంలోని ద్వీపాల్లో ఒకటి. వాటి మాదిరిగానే స్వచ్ఛమైన జలాలకు, అందమైన ప్రకృతికి పెట్టింది పేరు. కళ్లు చెదిరే అందాలకు, ఆహ్లాదకర వాతావరణానికి, పచ్చదనానికి కాణాచి. కాకపోతే వాటిల్లో దేనికీ లేని ప్రత్యేకత హైడ్రా దీవి సొంతం. ఆ కారణంగానే అది కొన్నేళ్లుగా అంతర్జాతీయ పర్యాటకుల నోళ్లలో తెగ నానుతోంది. అదేమిటంటే... అక్కడ కార్లు తదితర మోటారు వాహనాలు పూర్తిగా నిషేధం. గుర్రాలు, కంచర గాడిదలు మాత్రమే ప్రయాణ, రవాణా సాధనాలు. ఆ మేరకు కఠిన నిబంధనలు ఏర్పాటు చేసుకోవడమే గాక వాటిని తూచా తప్పకుండా పాటిస్తోంది కూడా. అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలకు మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపు.

హైడ్రా దీవిలో అడుగు పెట్టగానే మనల్ని పలకరించేది గుర్రాలు, కంచర గాడిదలే. స్థానికుల్లో ఎవరిని చూసినా వాటి మీదే చకచకా సాగిపోతూ కనిపిస్తారు. దక్షిణాన అందాలకు ఆలవాలమైన కమీనియ అనే కుగ్రామం మొదలు పశ్చిమాన అత్యంత పారదర్శకమూ, పరిశుభ్రమైన సముద్ర జలాలలో అలరారే మంద్రాకి దాకా అంతటా ఇవే దృశ్యాలు కనిపిస్తాయి.

ఆ కాలపు దీవి

హైడ్రా మనల్ని పాత కాలానికి తీసుకెళ్లి కట్టి పడేస్తుందని అంటారు హారియట్ జర్మన్. స్థానికంగా హార్స్ ట్రెక్కింగ్ కంపెనీ నడుపుతున్న ఆమె 24 ఏళ్ల క్రితం అనుకోకుండా అమ్మతో పాటు అక్కడికి విహార యాత్రకు వచ్చారు. ఆ ప్రాంతం ఎంతగా నచ్చిందంటే, అక్కడే శాశ్వతంగా స్థిరపడిపోయారు! తర్వాత పదేళ్ల క్రితం గ్రీస్‌ను అతలాకుతలం చేసిన ఆర్థిక సంక్షోభం కారణంగా తనకు ప్రాణప్రదమైన గుర్రం క్లోను అమ్మాల్సిన పరిస్థితి తలెత్తింది. దాంతో హార్స్ ట్రెక్కింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుందామె. ఇప్పుడు గుర్రాల సంఖ్య 12కు పెరిగింది. 'కార్లు లేవు గనుక ఇక్కడ అందరి జీవితాలూ హడావుడికి దూరంగా, నింపాదిగా గడుస్తుంటాయి' అంటూ నవ్వుతారామె.

చరిత్రే కారణం

హైడ్రా దీవి 18, 19వ శతాబ్దం దాకా ప్రముఖ సముద్ర వర్తక కేంద్రంగా ఓ వెలుగు వెలిగింది. 20వ శతాబ్దంలో మోటార్ వాహనాల శకం రాకతో ఆ వైభవం వెనకపట్టు పట్టింది. ఇరుకు సందులు, రాళ్ల ప్రాంతం కావడంతో హైడ్రాలో మోటార్ వాహనాల రాకపోకలు ఎప్పుడూ కష్టతరంగానే ఉంటూ వచ్చాయి. దాంతో, వాటిని పూర్తిగా నిషేధిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన స్థానిక యంత్రాంగానికి పుట్టుకొచ్చింది. అదే ఇప్పుడు ఆ దీవిని ప్రత్యేకంగా నిలిపింది.

వీఐపీలకు విశ్రామ స్థలం

హైడ్రా దీవి అందచందాలు, కార్ల జాడే లేని ప్రత్యేకత ఎందరెందరో వీఐపీలను ఆకర్షిస్తోంది. అప్పుడెప్పుడో 1950ల్లోనే ప్రముఖ ఇటాలియన్ నటి సోఫియా లారెన్ హైడ్రాలో షూటింగ్ చేసే క్రమంలో ఆ దీవితో ప్రేమలో పడ్డారు. అక్కడే స్థిరపడ్డారు. బ్రైస్ మార్డన్, అలెక్సిస్ వెరోకస్, పనగియోసిస్ టెట్సిస్, జాన్ క్రాక్సన్ వంటి ప్రఖ్యాత చిత్రకారుల నుంచి హెన్రీ మిల్లర్ వంటి ప్రముఖ రచయితల దాకా ఎందరెందరో హైడ్రాలో ఆరామ్‌గా జీవిస్తున్నారు. కెనేడియన్ గాయకుడు, పాటల రచయిత లియోనార్డ్ కోహెన్ రాసిన అజరామర గీతం 'బర్డ్ ఆన్ ద వైర్'కు హైడ్రా దీవే స్ఫూర్తి! ఒక్క మాటలో చెప్పాలంటే హైడ్రా భూలోక స్వర్గమే అంటారాయన.

నేషనల్ డెస్క్, సాక్షి

రైల్వే బోర్డు చీఫ్‌గా జయ వర్మ సిన్హా

మొట్టమొదటి మహిళా చైర్‌పర్సన్



న్యూఢిల్లీ: రైల్వే బోర్డు మొదటి మహిళా సీఈవో, చైర్‌పర్సన్‌గా జయ వర్మ సిన్హాను గురువారం కేంద్రప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆమె రైల్వే బోర్డు సభ్యురాలి(ఆపరేషన్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్)గా ఉన్నారు. ఒడిశాలోని బాలాసోర్‌లో జూన్ 2వ తేదీన 300 మందిని బలిగొన్న ఘోర రైల్వే ప్రమాద ఘటనకు సంక్లిష్ట సిగ్నలింగ్ వ్యవస్థే కారణమంటూ మీడియాతో చేసిన వ్యాఖ్యలతో ఆమె పేరు ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ రైల్వే బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా జయ వర్మ సిన్హా నియామకానికి ఆమోదముద్ర వేసిందని ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 1న లేదా ఆ తర్వాత ఆమె బాధ్యతలు చేపడతారు. 2024 ఆగస్టు 31వ తేదీ వరకు విధుల్లో కొనసాగుతారు. అక్టోబర్ ఒకటో తేదీన జయ వర్మ సిన్హా రిటైర్ కావాల్సి ఉంది. రైల్వే బోర్డు చీఫ్‌గా పదవీ కాలం పూర్తయ్యే వరకు కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ఆమెను తిరిగి నియమించింది. రైల్వే బోర్డు చీఫ్ అనిల్ కుమార్ లహోటి నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. అలహాబాద్ యూనివర్సిటీలో చదువుకున్న ఈమె 1988లో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌లో జాయినయ్యారు. ఉత్తర, ఈశాన్య, ఆగ్నేయ రైల్వే జోన్లలో పనిచేశారు.

మొన్న... ల్యాండర్‌ను క్లిక్ మనిపించిన రోవర్



నిన్న.. రోవర్‌ను ఫొటో తీసిన ల్యాండర్



చంద్రుడిపై సల్ఫర్ నిజమే

బెంగళూరు: అత్యంత విలువైన సల్ఫర్ నిల్వలు చందమామ ఉపరితలంపై ఉన్నట్లు చంద్రయాన్–3 మిషన్ ఇప్పటికే గుర్తించింది. అయితే, ఈ విషయాన్ని మరో విభిన్నమైన పరీక్ష ద్వారా రోవర్ ప్రజ్ఞాన్ మరోసారి నిర్ధారించింది. రోవర్‌లోని అల్ఫా పార్టికల్ ఎక్స్–రే స్పెక్ట్రోస్కోప్(ఏపీఎక్స్‌ఎస్) సల్ఫర్‌ను స్పష్టంగా గుర్తించిందని ఇస్రో వెల్లడించింది. అంతేకాకుండా మరికొన్ని చిన్నపాటి మూలకాలను కనిపెట్టిందని తెలియజేసింది. అయితే, చంద్రుడి మట్టిలోకి సల్ఫర్ ఎలా వచ్చిందన్నది కనిపెట్టాల్సి ఉందని పేర్కొంది. అగ్నిపర్వతం పేలడం వల్ల ఏర్పడిందా? లేక గ్రహశకలాల ద్వారా వచ్చిందా? అన్నది సైంటిస్టులు తేల్చాలని వెల్లడించింది.

జాబిల్లిపై ప్రజ్ఞాన్ చక్కర్లు

చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై రోవర్ ప్రజ్ఞాన్ చక్కర్లు కొడుతున్న వీడియోను ఇస్రో 'ఎక్స్'లో షేర్ చేసింది.

దక్షిణాఫ్రికాలో పెను విషాదం

- జొహన్నెస్‌బర్గ్‌లోని అయిదంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం
- 73 మంది సజీవ దహనం, మరో 52 మందికి గాయాలు
- బాధితులంతా వలస జీవులే



జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని అతిపెద్ద నగరం జొహన్నెస్‌బర్గ్‌లో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో 73 మంది చనిపోయారు. మరో 52 మంది గాయపడ్డారు. సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ ఘటనలో బాధితులంతా బతుకుదెరువు కోసం వచ్చిన వలసదారులేనని అధికారులు తెలిపారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో భవనంలో చెలరేగిన మంటలకు కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ప్రమాదం విషయం తెలియగానే తమ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పారని నగర అత్యవసర సేవల విభాగం ప్రతినిధి రాబర్ట్ ములౌడ్జి అన్నారు. భవనంలోని అయిదంతస్తుల్లోనూ మంటలు వ్యాపించాయన్నారు. అందులో చిక్కుకున్న వారిని సాధ్యమైనంత వరకు రక్షించామన్నారు. మొత్తం 73 మృతదేహాలను వెలికితీశామని చెప్పారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు కూడా ఉన్నారు. గాయపడిన, ఊపిరాడక స్పృహతప్పిన మరో 52 మందిని ఆస్పత్రులకు తరలించామన్నారు. 'భవనంలోని ప్రతి అంతస్తులోనూ అనధికారికంగా పలు నిర్మాణాలు ఉండటంతో చాలా మంది లోపలే చిక్కుకుపోయారు. దీంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. నేరగాళ్ల ముఠాలు తిష్ట వేయడంతో భవనానికి కరెంటు, నీరు, శానిటేషన్ వసతులను మున్సిపల్ అధికారులు కట్ చేశారు. ఇవి లేకున్నా వలసదారుల కుటుంబాలు ఉంటున్నాయి. కొందరికి పిల్లలు కూడా ఉన్నారు. ఇలాంటి భవనాలు ఇక్కడ చాలానే ఉన్నాయి'అని రాబర్ట్ చెప్పారు.

'ఇండియా' భేటీ ప్రారంభం

- తొలిరోజు సాధారణ సమావేశం
- కూటమి నేతలకు ఉద్ధవ్ ఠాక్రే విందు
- నేడు రెండో రోజు కీలక సమావేశం

ముంబై: దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికే తామంతా చేతులు కలిపామని విపక్ష 'ఇండియా' కూటమి నాయకులు స్పష్టం చేశారు. కూటమి సమావేశం గురువారం సాయంత్రం ముంబైలోని గ్రాండ్ హయత్ హోటల్‌లో ప్రారంభమైంది. కూటమిలోని వివిధ పార్టీల అగ్రనేతలు హాజరయ్యారు. తొలిరోజు సాధారణ సమావేశమే జరిగింది. రెండో రోజు నాటి అజెండాపై చర్చించారు. అనంతరం కూటమి నాయకులకు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన(ఉద్ధవ్) పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే విందు ఇచ్చారు. కీలక సమావేశం శుక్రవారం జరుగనుంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అధికార ఎన్డీయేను ఓడించడమే ధ్యేయంగా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయనున్నారు. మొదటి రోజు భేటీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, బిహార్ సీఎం నితీశ్ కుమార్, తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, పంజాబ్ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు భగవంత్ మాన్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్రీయ లోక్‌దళ్ చీఫ్ జయంత్ చౌదరి, పీడీపీ నేత మెహబూబా ముఫ్తీ తదితరులు పాల్గొన్నారు. దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని వెంటనే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని లాలూ ప్రసాద్ యాదవ్ అభిప్రాయపడ్డారు. దేశ సమస్యలను పరిష్కరించడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా సీట్ల పంపకంపై తేల్చాలని ఆప్ డిమాండ్ చేసినట్లు కేజ్రీవాల్ వెల్లడించారు.



భేటీకి వచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ

కొత్త రకం ఆక్సిజన్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు

టోక్యో: భూగోళంపై ఉన్న కోట్లాది రకాల జీవులు బతకడానికి ప్రాణవాయువు(ఆక్సిజన్) అవసరం. అంతర్జాతీయ భౌతిక శాస్త్రవేత్తల బృందం ప్రకృతిలో కొత్త రకం ఆక్సిజన్‌ను గుర్తించింది. జపాన్‌లోని టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన యొషుకే కొండో అనే అణు భౌతిక శాస్త్రవేత్త ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రవేత్తల బృందం 'ఆక్సిజన్–28' అనే కొత్తరకం ప్రాణవాయువును గుర్తించింది. ఇది ఆక్సిజన్ పరమాణువుకు సంబంధించిన ఒక ఐసోటోప్ అని సైంటిస్టులు వెల్లడించారు. ఈ ఆక్సిజన్–28 ఐసోటోప్ 20 న్యూట్రాన్‌లు, ఎనిమిది ప్రోటాన్‌లను కలిగి ఉంటుందని సమాచారం. ఇప్పటిదాకా మనకు అందుబాటులో ఉన్న ఆక్సిజన్ రకాల్లో ఇది పరిమాణంలో భారీగా ఉన్నట్లు తేల్చారు. ఈ ఆక్సిజన్ ఐసోటోప్ కొంత తక్కువ స్థిరత్వాన్ని కలిగి ఉందని గమనించారు. ప్రకృతిలో ఇది అసాధారణమైన ఆక్సిజన్ అని శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు.

విద్యార్థుల ఎదుటే టీచర్‌కు తలాక్ చెప్పిన భర్త

బారాబంకీ: తరగతి గదిలో పాఠాలు చెబుతున్న టీచర్‌కు ఆమె భర్త ట్రిపుల్ తలాక్ చెప్పాడు. దీంతో, సదరు ఉపాధ్యాయినితోపాటు విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో ఆగస్టు 24న ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమె భర్తపై కేసు నమోదు చేశారు. బారాబంకీకి చెందిన బాధితురాలికి ఫిరోజాబాద్ జిల్లాకు చెందిన మహ్మద్ షకీల్‌తో 2020లో వివాహమైంది. కొంతకాలం తర్వాత షకీల్ సౌదీ అరేబియా వెళ్లిపోయాడు. అత్తింటి వారు కట్నం తేవాలంటూ వేధించి ఆమెను బలవంతంగా పుట్టింటికి పంపారు. పుట్టింట్లో ఉంటూ ఆమె ఓ ప్రైవేట్ స్కూలులో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 28న సౌదీ అరేబియా నుంచి సొంతూరుకు చేరుకున్న షకీల్.. జూలై 10న బాధితురాలి వద్దకు వచ్చాడు. తనతో రావాలని కోరాడు. వెంటనే రాలేనని చెప్పడంతో ఆరు రోజుల అనంతరం తిరిగి సొంతూరుకు వెళ్లిపోయాడు. ఆగస్టు 24న తరగతి గదిలో ఉండగా వచ్చి విద్యార్థుల ఎదుటే తనకు మూడు సార్లు తలాక్ చెప్పారని బాధితురాలు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కొత్వాలీ సిటీ పోలీసులు షకీల్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. 2019లో కేంద్రం ట్రిపుల్ తలాక్ ఆచారం చట్ట విరుద్ధం, రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించిన విషయం తెలిసిందే.

నకిలీ వెబ్‌సైట్ పట్ల అప్రమత్తంగా ఉండండి

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు సుప్రీంకోర్టువెబ్‌సైట్‌ను కూడా వదిలిపెట్టలేదు. నకిలీ వెబ్‌సైట్ రూపొందించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ న్యాయవాదులను, కక్షిదారులను గురువారం సూచనలు జారీ చేశారు. నకిలీ వెబ్‌సైట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సుప్రీంకోర్టు సైతం పబ్లిక్ నోటీసు జారీ చేసింది. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయొద్దని, షేర్ చేయొద్దని వెల్లడించింది. అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు రూపొందించారని, యూఆర్ఎల్‌లో అందుబాటులో ఉంచారని తెలిపింది. ఈ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగత, రహస్య సమాచారం సేకరించి, మోసగించే ప్రమాదం ఉందన్నారు. లాయర్ల, కక్షిదారుల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని, ఆర్థిక లావాదేవీల వివరాలను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఎప్పుడూ కోరదని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది. www.sci.gov.in అనే వెబ్‌సైట్ మాత్రమే అసలైనదని స్పష్టం చేసింది. ఒకవేళ సైబర్ దాడి బారినపడితే బ్యాంకు ఆన్‌లైన్ ఖాతాల పాస్‌వర్డ్‌లు వెంటనే మార్చుకోవాలని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది.

కశ్మీర్‌లో ఎన్నికలు జరిపేందుకు సిద్ధం

- రాష్ట్ర హోదా పునరుద్ధరణకు మాత్రం సమయం పడుతుంది
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం తెలిపింది. అక్కడి ఓటర్ల జాబితా దాదాపుగా పూర్తి కావచ్చిందని, ఎన్నికలకు సంబంధించిన తేదీలను ఎన్నికల సంఘం ఖరారు చేయడమే మిగిలి ఉందని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు మాత్రం కొంత సమయం పడుతుందని వివరించింది. జమ్మూకశ్మీర్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా తాత్కాలిక అంశమేనంది. ఇదే విషయాన్ని హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లోనూ ప్రకటించారని గుర్తు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం ఈ విషయాలు వివరించారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు మూడు దఫాలుగా..పంచాయతీ, మున్సిపల్, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో జరుగుతాయన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పన నెల రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ విషయంలో అత్యంత అసాధారణ పరిస్థితిని ఎదుర్కొంటోంది. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కచ్చితమైన కాలపరిమితిని ప్రస్తుతానికి ఇవ్వలేం. దీనికి కొంత సమయం పట్టవచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం'అని ఆయన వివరించారు. 'లద్దాఖ్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా శాశ్వతం. అక్కడ లేహ్, కార్గిల్ అనే రెండు ప్రాంతాలున్నాయి. లేహ్‌లోని హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు ఇప్పటికే ఎన్నికలు పూర్తయ్యాయి. కార్గిల్‌లో వచ్చే నెలలో జరుగుతాయి'అని మెహతా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై 13 రోజులుగా విచారణ కొనసాగుతోంది. వీటి విచారణకు ఏర్పాటైన ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ వివరణపై అభ్యంతరం

'2018తో పోల్చి చూస్తే ఉగ్రవాద సంబంధ ఘటనలు అక్కడ 45.2 శాతం మేర, అక్రమ చొరబాట్లు 90.2 శాతం తగ్గాయి. రాళ్లు రువ్వే ఘటనలు అప్పట్లో 1,767 ఉండగా ఇప్పుడు పూర్తిగా అరికట్టారు. భద్రతాబలగాల వైపు ప్రాణనష్టం 60.9 శాతం పడిపోయింది. వేర్పాటువాద సంస్థల బంద్‌లు 2018లో 52 కాగా, ఇప్పుడవి సున్నాకు పడిపోయాయి'అంటూ అక్కడి పరిస్థితులను ధర్మాసనానికి మెహతా వివరించారు. ఈ గణాంకాలను ధర్మాసనం రికార్డు చేయడాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ నేత మహ్మద్ అక్బర్ లోనె తరఫున వాదిస్తున్న సీనియర్ లాయర్ కపిల్ సిబల్ అభ్యంతరం తెలిపారు. దీనిపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ..ఆర్టికల్ 370 రద్దు విషయమై జరుగుతున్న ప్రస్తుత విచారణకు సొలిసిటర్ జనరల్ వెల్లడిస్తున్న వివరాలతో సంబంధం ఉండదని స్పష్టం చేశారు. అక్కడ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే చర్యలకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను తెలుసుకుంటున్నామన్నారు.

మళ్లీ పుంజుకోనున్న రుతుపవనాలు

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిశాయి. జూలైలో భారీ వర్షపాతం నమోదయ్యింది. ఆగస్టులో రుతుపవనాలు ముఖం చాటేశాయి. అయితే, అతిత్వరలో రుతుపవనాలు మళ్లీ పుంజుకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ(ఐఎండీ) గురువారం వెల్లడించింది. మధ్య, దక్షిణ భారతదేశంలో వర్షాలు కురుస్తాయని తెలియజేసింది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. 91 నుంచి 109 శాతం వర్షపాతం నమోదవుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిసినా.. జూన్–సెప్టెంబర్ సీజన్‌లో సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లేనని తెలిపారు.

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్: 62వ వార్షిక అమర్‌నాథ్ యాత్ర గురువారంతో ముగిసింది. హిమాలయాల్లోని మంచు స్ఫటిక శివలింగం ఉన్న ఈ గుహాలయాన్ని ఈ ఏడాది 4.4 లక్షల మంది యాత్రికులు సందర్శించుకున్నారు. జూలై ఒకటో తేదీ నుంచి బల్టాల్, పహల్గామ్ మార్గాల్లో యాత్ర మొదలైంది. యాత్రికులు సహా మొత్తం 48 మంది వాతావరణ సంబంధ, సహజ కారణాలతో చనిపోగా, మరో 62 మంది గాయపడ్డారని అధికారులు చెప్పారు. యాత్ర ప్రశాంతంగా కొనసాగిందని, ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. గత ఏడాది 3.65 లక్షల మంది యాత్రికులు అమర్‌నాథ్ యాత్రలో పాల్గొన్నారు.

▶ మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ 'ప్రత్యేక' భేటీ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం తలపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం. ఆ మరుసటి రోజే ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానుండడం విశేషం.

కొత్త భవనంలోనే సమావేశాలు

ప్రత్యేక సమావేశాలు పార్లమెంట్ నూతన భవనంలోనే జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మే 28న ఈ కొత్త భవనాన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. సాధారణంగా ప్రతిఏటా మూడుసార్లు (బడ్జెట్, వర్షాకాల, శీతాకాల) పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈసారి ప్రత్యేక సమావేశాల వెనుక కారణంగా ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85 ప్రకారం.. ఏడాదిలో కనీసం రెండుసార్లు పార్లమెంట్‌ను సమావేశపరచాల్సి ఉంటుంది. రెండు భేటీల మధ్య వ్యవధి 6 నెలలకు మించరాదు. దానికి అనుగుణంగానే ప్రతిఏటా ఫిబ్రవరి–మే నెలల మధ్యలో బడ్జెట్, జూలై–ఆగస్టు మధ్య వర్షాకాల, నవంబర్–డిసెంబర్‌ల మధ్య శీతాకాల సమావేశాలను నిర్వహిస్తారు. ఈసారి ఏకంగా ఐదు రోజులపాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తుండడం పట్ల దేశవ్యాప్తంగా ఉత్కంఠ పెరిగిపోయింది.

పెండింగ్‌లో ఉన్న బిల్లుకు మోక్షం!

మరోవైపు సార్వత్రిక ఎన్నికల కంటే ముందే దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా పార్లమెంట్‌లో యూసీసీ బిల్లును ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అయితే, రాజకీయ అవసరాల కోసమే బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని తెరపైకి తీసుకొస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాగే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కూడా ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు గత రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉండిపోయింది. వివిధ వర్గాల నుంచి ఒత్తిళ్ల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. చంద్రయాన్–3 మిషన్ చరిత్ర సృష్టించడం, 'అమృతకాలం'లో భారతదేశ లక్ష్యాలతోపాటు ఇతర ముఖ్యమైన అంశాలపైనా ప్రత్యేక సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది.

ప్రజల దృష్టిని మళ్లించడానికే: జైరామ్ రమేశ్

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమావేశాలు, అదానీ గ్రూప్‌లో అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఐదు రోజుల ప్రత్యేక సమావేశాల పేరిట మోదీ ప్రభుత్వం కొత్త డ్రామాకు తెర తీసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ విమర్శించారు. 'ఇండియా' కూటమి సమావేశాల వార్తలకు మీడియాలో ప్రాధాన్యం లేకుండా చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మూడు వారాల క్రితమే ముగిశాయని, ఇంతలోనే మళ్లీ భేటీ కావడం వెనుక మతలబు ఏమిటని నిలదీశారు. అదానీ గ్రూప్ వ్యవహారంపై విచారణ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలంటూ పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని జైరామ్ రమేశ్ చెప్పారు. వినాయక చవితి ఉత్సవాలు జరిగే సమయంలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం సరైంది కాదని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) నేత ప్రియాంక చతుర్వేది అన్నారు.

ప్రత్యేక సమావేశాలు కొత్తేమీ కాదు

పార్లమెంట్ బడ్జెట్, వర్షాకాల, శీతాకాల సమావేశాలు కాకుండా, ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం అసాధారణమేమీ కాదు. 2017 జూన్ 30న అర్ధరాత్రి పార్లమెంట్‌ను సమావేశపర్చారు. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. కానీ, ఇది లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశం. 50వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకొని 1997 ఆగస్టులో ఆరు రోజులపాటుప్రత్యేకంగా సమావేశమైంది.క్విట్ ఇండియా ఉద్యమానికి 50 ఏళ్లయిన సందర్భంగా 1992 ఆగస్టు 9న, స్వాతంత్ర్య దినోత్సవ సిల్వర్ జూబ్లీ సందర్భంగా 1972 ఆగస్టు 14–15న అర్ధరాత్రి పార్లమెంట్ ప్రత్యేక సమావేశం జరిగింది.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023

రామేశ్వరంలో ఎన్ఐఏ సోదాలు

సాక్షి, చెన్నై : రామేశ్వరంలో గురువారం ఓ ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల కాలంగా జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) సోదాలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. గురువారం రామనాథపురం జిల్లా రామేశ్వరంలోని యూసఫ్ ఖాన్ అనే వ్యక్తి నివాసంలో సోదాలు జరిగాయి. కొన్ని గంటల పాటు జరిగిన సోదాల్లో సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. యూసఫ్ ఖాన్ గతంలో దుబాయ్‌లో పనిచేసినట్లు విచారణలో తేలింది. ఈ సమయంలో అతడు నిషేధిత సంస్థల మద్దతు దారులతో కలిసి తిరిగినట్లు ఆధారాలు లభించడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

15 కిలోల బంగారు కడ్డీలు స్వాధీనం

అన్నానగర్: రామనాథపురం సమీపంలో గురువారం వేకువజామున స్కూటీలో తరలిస్తున్న 15 కిలోల బంగారు కడ్డీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. వివరాలు.. రామనాథపురంలోని కస్టమ్స్ అధికారులు బంగారు కడ్డీలను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో గురువారం వేకువజామున తిరుపుల్లాని సమీపంలోని కలిమన్ కుంటూ బీచ్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ స్కూటీ డిక్కీలో 15 కిలోల బంగారు కడ్డీలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. స్కూటీ నడిపిన మండపానికి చెందిన సల్మాన్‌ను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారు కడ్డీలను, అరెస్టు చేసిన వ్యక్తిని రామనాథపురంలోని కస్టమ్స్ కార్యాలయానికి తరలించారు. సీజ్ చేసిన బంగారు కడ్డీల విలువ రూ.7 కోట్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

మెరీనా తీరంలో పురాతనమైన దేవత విగ్రహాలు స్వాధీనం

తిరువొత్తియూరు: మెరీనా సముద్ర తీరంలో ఇసుకలో పాతిపెట్టి ఉన్న 5 దేవత రాతి విగ్రహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి విచారణ చేస్తున్నారు. వివరాలు.. చెన్నై మెరీనా సముద్రతీరం వైట్ హౌస్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం కొందరు చిన్నారులు ఇసుకలో కూర్చుని గుంత తవ్వుకుని ఆడుకుంటున్నారు. ఆ సమయంలో రాత్రి విగ్రహాలు ఒకటి బయటపడింది. ఇది చూసిన ప్రజలు అక్కడున్న భద్రతా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఇసుకను తవ్వి చూడగా ఒక రాత్రి విగ్రహాలు బయటపడింది. అనంతరం మైలాపూర్ రెవెన్యూ అధికారులకు ఆ విగ్రహాలను అప్పగించారు.

8 దేవాలయాలకు చెందిన రూ. 31 కోట్ల భూమి స్వాధీనం

కొరుక్కుపేట: ఒక్కరోజులోనే 8 ఆలయాలకు చెందిన రూ. 30.90 కోట్ల విలువైన భూములు ఆక్రమణల దారుల నుంచి దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. డీఎంకే ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పలు ఆలయాలకు చెందిన ఆస్తులను ఆక్రమణ దారుల నుంచి రికవరీ చేసే పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం తూత్తుకుడి, నాగపట్నం, ఈరోడ్, తిరుపూర్ జిల్లాలకు చెందిన 8 ఆలయాలకు చెందిన రూ. 30.90 కోట్ల విలువైన భూములను కబ్జాకోరల నుంచి విడిపించి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో తూత్తుకుడి జిల్లా, వ్లాతికులంలోని అరుల్మికు మీనాక్షి సుందరేశ్వర దేవాలయానికి చెందిన 22 .48 సెంట్లు, తిరువారూర్ జిల్లా, నన్నిలం సర్కిల్, సిరుపు వీపూర్ అరుల్మిగు కిరూప సముద్రపెరుమాళ్ ఆలయానికి చెందిన 24 ఎకరాల భూమి, తిరుపల్లిముకోడల్ గ్రామం అరుల్మికూడల్ గ్రామం, అభిషేకట్ట, అభిషేకానికి చెందిన 19.54 ఎకరాలు ఉన్నాయి. జాయింట్ కమిషనర్ కుమారేయాన్, తిరువారూర్ అసిస్టెంట్ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించి అక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకున్నారు.

రేపు విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు

తిరువళ్లూరు: తిరువళ్లూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మర్మమతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాకు ఈనెల 2వ తేదీన అంతరాయం కలుగుతుందని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు తిరువళ్లూరులోని జీఎన్‌రోడ్డు, ఎల్ఐసీ, రైల్వేస్టేషన్, పూంగానగర్, ఐఆర్ఎన్ వెనుక భాగం, పుంగత్తూరు, ఎస్పీ కార్యాలయం, మనవాలనగర్, పట్టరై, సేలై, ఏకాటూరు, అదిగత్తూరు, వెంగత్తూరు, ఎగువనల్లాటూరు, దిగువనల్లాటూరు, నుంగంబాక్కం, రాజాజీపురం, పెద్దకుప్పం, ఒండికుప్పం, రామంజేరి, పాండూర్, పోలీవాక్కం, పట్టరై పెరంబదూరు, రామంజేరితో పాటు సమీప ప్రాంతాలకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

కొరుక్కుపేట: మేయర్ ప్రియ అధ్యక్షతన చెన్నై కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఇందులో డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, కమిషనర్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమైన తర్వాత మేయర్ ప్రియ చంద్రయాన్ ప్రాజెక్టును తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రారంభించి, ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌ను నిర్వహించినందుకు వ్యవసాయ, క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను తగ్గించింది. అందుకు కూడా కృతజ్ఞతలు చెప్పాలని బీజేపీ కౌన్సిలర్లు ఉమ, రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. దీనిని కొందరు డీఎంకే, కాంగ్రెస్ కౌన్సిలర్లు వ్యతిరేకించారు. దీంతో వాగ్వాదం నెలకొంది. దీంతో మేయర్ సభ నుంచి వెళ్లిపోయారు. మళ్లీ ప్రారంభమైన తర్వాతలో సభలో 59 తీర్మానాలను ఆమోదించారు. ఇందులో ఖతీడ్రల్ రోడ్ సమీపంలోని ఫ్లైఓవర్‌కు ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు డాక్టర్ ఎం. బాలమురళీకృష్ణ పేరు పెట్టారు.

ఏసీబీ మరో ఊసర వెల్లి

రాష్ట్ర అవినీతి నిరోధక విభాగాన్ని హైకోర్టు ఊసర వెల్లితో పోల్చుతూ సంచలన వ్యాఖ్యలు చేసింది. అధికారంలో ఎవరుంటే వారికి అధికారులు తొత్తులుగా మారుతున్నారని ఆక్షేపించింది. అక్రమాస్తుల కేసులో మాజీ సీఎం పన్నీరు సెల్వంకు క్లీన్ చిట్ ఇచ్చిన వ్యవహారంలో ఏసీబీని ఉద్దేశించి న్యాయమూర్తి ఆనంద్ వెంకటేషన్ గురువారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

- పాలకులకు తొత్తుగా మారిందంటూ హైకోర్టు ఆగ్రహం
- పన్నీరుకు విముక్తి కేసులో తీవ్ర వ్యాఖ్యలు
- ఓపీఎస్ బృందానికి నోటీసులు



హైకోర్టు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చినప్పుడు డీఎంకే వర్గాలపై ఏసీబీని ఉసిగొల్పి దాడులు, కేసుల మోత మోగించడం తెలిసిందే. అలాగే డీఎంకే అధికారంలోకి వచ్చిన పక్షంలో అదే ఏసీబీ ద్వారా అన్నాడీఎంకే వర్గాల భరతం పట్టేలా దూకుడు ప్రదర్శించడం పరిపాటిగా మారింది. ఈ రెండు పార్టీలు తాము ప్రభుత్వంలో ఉన్నప్పుడల్లా అవినీతి నిరోధకశాఖను తమకు అనుకూలంగా మలచుకుంటూ వస్తున్నాయి. పరస్పరం కేసులు నమోదు చేయించుకుంటున్నారు. అదే సమయంలో తాము అధికారంలోకి వస్తే డీఎంకే హయాంలో పెట్టిన కేసులను కింది కోర్టుల ఉత్తర్వులు, తీర్పుల ద్వారా అన్నాడీఎంకే వర్గాలు గట్టెక్కడం జరుగుతోంది. ప్రస్తుతం డీఎంకే అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తమ మీదున్న కేసుల నుంచి మంత్రులు బయట పడుతూ వస్తున్నారు. ఇప్పటికే మంత్రులు తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్, పొన్ముడి తదితరులు తమ మీదున్న కేసుల్లో నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని బయటపడ్డారు. ఈ పరిణామాలను గతవారం హైకోర్టు తీవ్రంగానే పరిగణించింది. ఈ ముగ్గురు మంత్రుల విడుదలను వ్యతిరేకిస్తూ న్యాయమూర్తి ఆనంద్ వెంకటేషన్ సుమోటోగా కేసు నమోదు చేసి , నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గతంలో ఎప్పుడో వెలుగు చూసిన కేసును తాజాగా అదే న్యాయయమూర్తి అస్త్రంగా చేసుకుని ఏసీబీని టార్గెట్ చేస్తూ గురువారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పన్నీరు సెల్వం కేసులో..

2006లో డీఎంకే అధికారంలోకి వచ్చినానంతరం మాజీ సీఎం పన్నీరు సెల్వం, ఆయన కుటుంబ సభ్యులపై ఏసీబీని ఉసిగొల్పింది. ఆదాయానికి మించి ఆస్తులను పన్నీరు సెల్వం అండ్ కుటుంబీకులు గడించినట్లు కేసులు నమోదు అయ్యాయి. 2011లో అన్నాడీఎంకే రాష్ట్ర అధికార పగ్గాలు చేజిక్కించుకుంది. 2012లో తన మీదున్న అక్రమాస్తుల కేసు నుంచి పన్నీరు సెల్వంతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కింది కోర్టు తీర్పుతో విముక్తి పొందారు. ఎవరు అధికారంలో ఉంటారో, వారికి అనుకూలంగా వచ్చే తీర్పులలో వ్యతిరేకిస్తూ ఏసీబీ అప్పీల్ పిటిషన్ దాఖలు చేసిన సందర్భాలు లేవు. ఇదే ప్రస్తావనను తాజాగా న్యాయమూర్తి లేవనెత్తారు. పన్నీరు సెల్వంను విడుదల చేస్తూ దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తి ఆనంద్ వెంకటేషన్ సుమోటోగా కేసును స్వీకరించారు. గురువారం విచారణ సమయంలో ఏసీబీని ఆయన టార్గెట్ చేసి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉంటే, వారికి తొత్తుగా ఏసీబీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మధ్యవర్తిగా వ్యవహరించాల్సిన వారు, ఎవరు అధికారంలో ఉంటే, వారికి అణిగిమణిగి ఉండడం శోచనీయమని విమర్శించారు. వాస్తవానికి చెప్పాలంటే, ఊసరవెల్లిగా ఈ విభాగం మారిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సుమోటో కేసుకు వివరణ ఇవ్వాలని పన్నీరు సెల్వం అండ్ కుటుంబ సభ్యులకు న్యాయమూర్తి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 27కి వాయిదా వేశారు.



పన్నీరు సెల్వం

రసాయన విగ్రహాలు వద్దు

- నిబంధనలు పాటించాల్సిందే..
- మదురై ధర్మాసనం ఆదేశాలు

సాక్షి, చెన్నై: రసాయనాలతో తయారు చేసిన గణపయ్య ప్రతిమలను ఈ ఏడాది వినాయక చవితి పూజలకు ఉపయోగించ వద్దని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని మదురై ధర్మాసనం ఆదేశించింది. నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా 17న సెలవు రద్దు చేసి ఈనెల 18వ తేదీని వినాయక చవితి సెలవు దినంగా ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు.. పండుగ వినాయక చవితి వస్తున్నదంటే చాలు రాష్ట్రంలో వాడ వాడలలో ఉండ్రాలయ్య విగ్రహాలను కొలువు దీర్చి పూజలు చేయడం ఆనవాయితీ. పలు హిందూ సంఘాలు, బీజేపీ నాయకుల నేతృత్వంలో ఈ విగ్రహాలను కొలువు దీర్చడం జరుగుతోంది. అలాగే పండుగ రోజున ఇంటిళ్లి పాది గణపయ్య విగ్రహాలను కొలువు దీర్చుతారు. ఈ విగ్రహాలను మూడో రోజు లేదా ఏడో రోజు నిమజ్జనం చేస్తారు. అయితే, ఈ విగ్రహాలు అత్యధికంగా రసాయనాలతో తయారు చేసినవే ఉండడంతో అవి నీటిలో కరగడం లేదు. దీంతో పర్యావరణ సమస్యలు ఎదురు అవుతున్నాయి. ఇదే వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ మదురైకు చెందిన అరసు పాండి అనే సామాజిక కార్యకర్త ధర్మాసనంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.



కాలుష్యాన్ని తగ్గించేందుకు..

గురువారం ఈ పిటిషన్ విచారణ సమయంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి రసాయనాల రూపంలో ఎదురు అవుతున్న అనర్థాలు, నీటి కాలుష్యం, పర్యావరణ పరిస్థితులను కోర్టుకు పిటిషన్ తరపు న్యాయవాది వివరించారు. వాదనల అనంతరం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గంగా పూర్వాల, న్యాయమూర్తి కుమరేషన్ నేతృత్వంలోని బెంచ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ శాఖ, గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన నిబంధనలు, జారీ చేసిన ఆదేశాలను ఈ వ్యవహారంలో తప్పనిసరిగా అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. రసాయనాలతో తయారు చేసే వినాయకుడి విగ్రహాలను ఉపయోగించ వద్దని, వీటిని నిమజ్జనానికి అనుమతించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రసాయన విగ్రహాల వాడకం కట్టడి, నదులు, కొలనులు, చెరువులు తదితర నీటి పరివాహక ప్రదేశాలలో నిమజ్జనం వ్యవహారంలో తప్పనిసరిగా నిబంధనలను అనుసరించాల్సిందేనని ఆదేశించారు. రసాయన విగ్రహాలు ఈ ప్రాంతాల్లో నిమజ్జనం కాకుండా కట్టడి చేయడం అధికార యంత్రాంగం బాధ్యత అని తేల్చిచెప్పారు.

సెలవు 17 కాదు..18న

వినాయక చవితి సెలవును ఈనెల 17వ తేదీగా ప్రభుత్వం ఇది వరకు ప్రకటించింది. దీనిపై విమర్శలు రావడంతో పండుగ ఈనెల 18వ తేదీకి మార్పుచేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. అలాగే ఈనెల 17వ తేదీన ప్రకటించిన సెలవును రద్దు చేసింది.

స్పీకింగ్ ఫర్ ఇండియా

- సీఎం స్టాలిన్ కొత్త నినాదం
- వీడియో విడుదల



సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : ''దక్షిణాది నుంచి ఇక జ్వలించే గళం కోసం వేచి ఉండండి'' అంటూ స్పీకింగ్ ఫర్ ఇండియా నినాదాన్ని సీఎం స్టాలిన్ తెర మీదకు తెచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను గురువారం విడుదల చేశారు. సీఎం స్టాలిన్ తరచూ మీలో ఒకడ్నీ నినాదంతో ప్రజలతో మాట్లాడుతూ వస్తున్న విషయం తెలిసిందే. ప్రజల నుంచి వచ్చే ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇస్తూ ఉంటారు. అలాగే ట్విట్టర్ వేదికగా పలు అంశాలను ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ముంబైలో ఇండియా కూటమి సమావేశం నేపథ్యంలో సీఎం స్టాలిన్ ఓ ఆడియోను విడుదల చేశారు. ఇందులో ఆయన దక్షిణాది నుంచి జ్వలించే గళం కోసం వేచి ఉండండి అంటూ స్పీకింగ్ ఫర్ ఇండియా నినాదాన్ని తెరమీదకు తెచ్చారు. డీఎంకే ఆవిర్భావం, సిద్ధాంతాలను గురించి గుర్తు చేస్తూ, దేశంలోనే అతి పెద్ద మూడో పార్టీగా నేడు అవతరించి ఉందని వివరించారు. దివంగత నేతలు అన్నాదురై, కలైంజ్ఞర్ కరుణానిధి దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఇక, దేశం గురించి మాట్లాడాల్సిన అవసరం, సమయం ఇదేనని వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీ పాలనకు చరమ గీతం లక్ష్యంగా నవ భారత నిర్మాణం, దేశ భవిష్యత్తే లక్ష్యంగా, సమానత్వం, సహోదరత్వం ధ్యేయంగా దక్షిణ భారతదేశం నుంచి గళం జ్వలించబోతోందన్నారు. ఈ గళానికి స్పీకింగ్ ఫర్ ఇండియా అన్న ట్యాగ్ లైన్‌ను జోడిస్తున్నానని, ఇక, దక్షిణాది నుంచి జ్వలించే గళం కోసం వేచి ఉండండి అని ఆ వీడియోలో సీఎం వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా సీఎం వారసుడు, క్రీడల మంత్రి ఉదయ నిధి ఓ ప్రకటన విడుదల చేస్తూ, ప్రజల్లోకి వెళ్లు.. వారితో జీవించు.. వారి నుంచి నేర్చుకో.. అని అన్నాదురై వ్యాఖ్యలను గుర్తు చేస్తూ, తదుపరి ప్రకటన కోసం వేచి ఉండండి, త్వరలో వెలువడుతుందని అందులో వివరించడం గమనార్హం.

చెన్నైలో వైఎస్సార్ వర్ధంతి సభ రేపు

- భారీఎత్తున సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు
- తరలిరావాలని అభిమానులకు పిలుపు

సాక్షి, చెన్నై: మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం చెన్నైలో పెద్దఎత్తున సేవా కార్యక్రమాల ఏర్పాటు చేయాలని తమిళనాడు వైఎస్సార్ సీపీ సేవాదళ్ నిర్ణయించింది. వర్ధంతి సభకు పెద్ద సంఖ్యలో అభిమానులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తరలి రావాలని సేవాదళ్ ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్ పిలుపు నిచ్చారు. తమిళనాడు వైఎస్సార్ సీపీ సేవాదళ్ వేదికగా ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా చెన్నైలో అభిమానులు, మద్దతు దారులు, కార్యకర్తలు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. శనివారం మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం తదితర కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ సేవాదళ్ నిర్ణయించినట్టు ఉపాధ్యక్షుడు జకీర్ హుస్సేన్ గురువారం మీడియాకు తెలిపారు. శనివారం ఉదయం తొలుత పెరంబూరులోని పార్టీ కార్యాలయంలో మహానేతకు నివాళులర్పించే కార్యక్రమం జరుగుతుందన్నారు. 10 గంటల నుంచి ఐనావరంలోని దయ సదన్‌లో మహానేతను స్మరిస్తూ ప్రార్థనలు నిర్వహించనున్నామని వివరించారు. ఇక్కడి పేదలకు సంక్షేమ కార్యక్రమాలు, వారికి కావాల్సిన నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే అల్పాహారం, పండ్లు అందజేస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అంబత్తూరులోని టెండర్ కేర్ హోంలోని అనాథలు, వృద్ధులకు సేవలు అందించనున్నామని వివరించారు. మటన్ బిర్యానీ, ఫలాలు, బెడ్‌షీట్‌లు, చీరలు, ధోవతిలు అందించనున్నామన్నారు. మహానేత కోసం ఇక్కడ కూడా ప్రార్థనలకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే విధంగా పెద్దసంఖ్యలో చెన్నై, శివారు జిల్లాలోని జగనన్న అభిమమానులు, మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలు తరలి రావాలని పిలుపు నిచ్చారు.



మెట్రోతో ఎంఆర్‌టీఎస్ అనుసంధానం



మెట్రో రైలు



ఎంఆర్‌టీఎస్ రైలు

- ప్రాథమిక నివేదిక సిద్ధం
- త్వరలో పనులు ప్రారంభం

సాక్షి, చెన్నై: చెన్నైలోని ప్రధాన రవాణా మార్గం మెట్రో రైలుతో ఎంఆర్‌టీఎస్ రైలు సేవలను అనుసంధానించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక నివేదికను అధికారులు సిద్ధం చేశారు. ఈమేరకు త్వరలో పనులు చేపట్టనున్నట్లు సమాచారం. వివరాలు.. చెన్నై నగరంలో ఒకప్పుడు నగర రవాణా సంస్థ బస్సులు, దక్షిణ రైల్వే పరిధిలోని ఎలక్ట్రిక్, ఎంఆర్‌టీఎస్ రైలు సేవలు కీలకంగా ఉండేవి. ఈ జాబితాలోకి ఇటీవల మెట్రో కూడా వచ్చి చేరింది. ప్రస్తుతం రెండు ప్రధాన మార్గాల్లో మెట్రో రైలు సేవలు అందుతున్నాయి. మరో మూడు మార్గాలలో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులు ముగియగానే చెన్నై చుట్టూ మెట్రో సేవల దిశగా అధికార యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. అదే సమయంలో చెన్నైలో వంతెన మార్గంగా ఉన్న ఎంఆర్‌టీఎస్‌ను మెట్రోకు అనుకూలంగా మలచుకునేందుకు పరిశీలన ప్రక్రియపై దృష్టి పెట్టారు.

మెట్రోలోకి..

చెన్నై బీచ్ నుంచి చింత్రాది పేట, ట్రిప్లికేన్, మైలాపూర్, తరమణి మీదుగా వేళచ్చేరి వరకు ఎంఆర్‌టీఎస్ రైలు సేవలు అందుతున్నాయి. ఇది పూర్తిగా వంతెన మార్గంలో ప్రయాణిస్తుంది. వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్‌కు ఈ రైలు సేవను అనుసంధానించే పనులు ముగింపు దశలో ఉన్నాయి. ఈ ఎంఆర్‌టీఎస్‌ను మెట్రోకి అను సంధానించడం ద్వారా దాదాపుగా సగం చెన్నై వైపుగా మెట్రో రైలు సేవలను అందించేందుకు వీలుంది. ఎంఆర్‌టీస్ రైలు పూర్తిగా వంతెన మార్గంగానే ఉండడంతో మెట్రోకు అనుగుణంగా కొంత మార్పులు చేస్తే చాలు సేవలు సులభతరం చేసుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు. సెయింట్ థామస్ మౌంట్ నుంచి మెట్రో సేవలు ప్రస్తుతం ఓ మార్గంలో జరుగుతోంది. ఈ మార్గంలోకి ఎంఆర్‌టీఎస్‌ను కలపడం ద్వారా అదనంగా అనేక మార్గల్లోకి మెట్రో సేవలు త్వరితగతిన చేరినట్టే అని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక నివేదిక సిద్ధం చేసి ఉన్నారు. దీనిని దక్షిణ రైల్వే సిద్ధం చేసింది. మెట్రో ప్రాజెక్టు వర్గాలకు ఈ నివేదికను సమర్పించడం ద్వారా అతి త్వరలో ఎంఆర్‌టీఎస్ మార్గాన్ని మెట్రో మార్గంగా మలిచే పనులు మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పనులపై చెన్నై మెట్రో డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక దృష్టి పెట్టడం విశేషం. ఎంఆర్‌టీఎస్ మార్గాన్ని మెట్రోగా మార్చడం ద్వారా చెన్నైలో 75 శాతం ప్రాంతానికి మెట్రో రైలు సేవలు అందించేందుకు వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమా..?

తమిళసినిమా: నటుడు విజయ్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. దీనికి కారణం ఆయన తన ప్రజా సంఘం ద్వారా తలపెడుతున్న కార్యక్రమాలు, తీసుకుంటున్న చర్యలే. విజయ్ తన సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి మరింతగా చొచ్చుకు పోతున్నారు అనే చెప్పాలి. నటుడుగా అశేష ప్రజాదరణ పొందుతున్న విజయ్ దాన్ని రాజకీయంగా వాడుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ దిశగా అడుగులు వేస్తున్న విజయ్ ఇటీవల సామాజిక మాధ్యమాలను వాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఇటీవలికాలంలో విజయ్ ప్రజా సంఘం కార్యదర్శి బుస్సీ ఆనంద్ నిత్యత్వంలో స్థానిక పనైయూర్ లోని విజయ్ అభిమాన సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని 24 నియోజక వర్గాలకు చెందిన పలువురు సంఘ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ వాడుకునే విధంగా 1600 వాట్సాప్ గ్రూప్‌లో ఏర్పాటు చేశారు ఈ సంఖ్యను 10 వేలకు చేర్చాలని ఆదేశించినట్లు సమాచారం. కాగా గతంలో ఎండీఎంకే నేత విజయకాంత్ కూడా ఇదేవిధంగా తన అభిమానులను ప్రజల్లోకి పంపారు. కాగా నటుడు విజయ్ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయకపోయినా కొన్నింట్లో అయినా సత్తాచాటాలని యత్నిస్తున్నట్టు విజయ్ ప్రజా సంఘం నాయకుడొకరు పేర్కొన్నారు.



విజయ్

తొలివిడత పాదయాత్ర విజయవంతం

- అన్నామలైకు అభినందనల వెల్లువ
- ఘన సత్కారం

సాక్షి, చెన్నై: నా మట్టి..నా ప్రజలు పేరిట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేపట్టిన తొలి విడత పాదయాత్ర విజయోత్సవాన్ని ఆ పార్టీ వర్గాలు గురువారం ఘనంగా జరుపుకున్నాయి. అన్నామలైను అభినందనలతో ముంచెత్తారు. ఘనంగా సత్కరించారు. వివరాలు.. రాష్ట్రంలో బలోపేతమే లక్ష్యంగా, అధికార మార్పు ధ్యేయంతో జూలై 28వ తేదీన రామేశ్వరంలో నా మట్టి.. నా ప్రజలు నినాదంతో అన్నామలై పాదయాత్ర చేపట్టిన విషయం తెలిసిందే. ఆగస్టు 22వ తేదీతో ఈ యాత్ర తొలి విడత పయనం ముగిసింది. తొలి విడత యాత్ర విజయోత్సవ కార్యక్రమాన్ని గురువారం టీ నగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం కమలాలయంలో నిర్వహించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల కో - ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై అన్నామలైను సత్కరించారు. జాతీయ, రాష్ట్ర నేతలు పలువురు తరలి వచ్చి అన్నామలైను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల అభిమానాన్ని ఈ యాత్రతో అన్నామలై చూరగొన్నారని పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులతో పాటు రాష్ట్ర ప్రజలు కోరుకునే మార్పును తీసుకు రాగల సమర్థుడిగా అన్నామలై రాష్ట్రంలో ఎదిగి ఉన్నారని కొనియాడారు. 9 సంవత్సరాల ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. అన్నామలై మలివిడత యాత్ర మరింత బ్రహ్మాండ విజయవంతం అవుతుందని, ప్రజలు ఆయన రాక కోసం ఎదురు చూస్తుండడం, తమ విజ్ఞప్తులను ఆయన దృష్టికి తీసుకెళ్తుండడం ఆహ్వానించ దగ్గ విషయంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు హెచ్ రాజ, ఎమ్మెల్యే కే సరస్వతి, రాష్ట్ర నేతలు దురై స్వామి, కనకసభా పతి, నాగరాజన్, రామలింగం, చక్రవర్తిం, డాల్ఫిన్ శ్రీధర్, ఏజీ సంపత్, పాల్గొన్నారు.



అన్నామలైను సత్కరిస్తున్న నేతలు



హాజరైన కార్యకర్తలు

అలల తాకిడిలో చిక్కుకున్న నౌక

- కేంద్ర మంత్రులు సురక్షితం

సాక్షి, చెన్నై: కేరళ నుంచి కన్యాకుమారి వైపుగా గురువారం ఉదయం వస్తున్న ఓ నౌక అలల తాకిడిలో చిక్కుకుంది. ఇందులోని కేంద్ర కేబినెట్ మంత్రి, సహాయ మంత్రిని సురక్షింతంగా ఒడ్డుకు చేర్చారు. వివరాలు.. కేరళ సముద్ర తీరంలోని ఓ గ్రామంలో సాగర భారత్‌యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కేంద్ర మత్స్యశాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల, కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ చిన్న నౌకలో కన్యాకుమారికి సముద్ర మార్గంలో బయలుదేరారు. మార్గం మధ్యలో నౌక అలల తాకిడికి గురైంది. ఫలితంగా తేంగాయ పట్నంకు ఓ నాటికన్ మైలు దూరంలో నౌక ఆగింది. ఇందులో కేంద్ర మంత్రులు, అధికారులు ఉండడంతో వారిని ఒడ్డుకు తీసుకొచ్చేందు కు జాలర్లు వెళ్లారు. వారితోపాటు కోస్టుగార్డు అధికారులు రంగంలోకి దిగి మంత్రులు, అధికారులను సురక్షితంగా సాయంత్రం ఒడ్డుకు చేర్చారు.

క్లుప్తంగా

ఖాళీ బిందెలతో రాస్తారోకో



రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు

అన్నానగర్: సక్రమంగా తాగునీరు అందించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో గురువారం పళని సమీపంలో రాస్తారోకో నిర్వహించారు. ఫలితంగా పళని–పుద్దరపురం రహదారిపై ట్రాఫిక్ రద్దీ నెలకొంది. పళని మున్సిపల్ కమిషనర్ బాలమురుగన్, తహసీల్దార్ పళనిచామి, పళనిటౌన్ పోలీసులు మహిళలతో చర్చించి ఆందోళన విరమింపజేశారు. మోటార్లకు త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి

అన్నానగర్: కెలమంగళం సమీపంలో బుధవారం రాత్రి బైక్‌ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. కృష్ణగిరి జిల్లా కెలమంగళం సాదేశ్వరి ఆలయ వీధికి చెందిన తిమ్మయ్య (23) అదే ప్రాంతంలోని మిరియమ్మన్ కోవిల్ వీధికి చెందిన శివకుమార్ (24) భవన నిర్మాణ కార్మికులు. వీరిద్దరూ బుధవారం రాత్రి బైకులో కెలమంగళం–డెంకణికోట్టై రహదారిపై వెళ్తున్నారు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తిమ్మయ్య, శివకుమార్ మృతి చెందారు. స్థానిక పోలీసులు ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తమిళనాడు వంటకాలకు గుర్తింపు

సాక్షి, చెన్నై : తమిళనాడు వంటకాలు, రుచులకు నిజమైన గుర్తింపు కల్పించే విధంగా మిషన్ రాకితో కొత్త సీజన్‌కు హిస్టరీ 18 ఛానల్ నిర్ణయించింది. సెప్టెంబరు 4 నుంచి 11వ తేదీ వరకు తమిళనాడులో డిజిటల్ వేదికగా ఫస్ట్ సీరిస్‌గా ఈ సందడిని ప్రదర్శించనున్నారు. ఈ వివరాలను గురువారం ఓ ప్రకటన ద్వారా వివరించారు. తమిళ వంటకాల గురించి, ఇడ్లీ, సాంబార్ తో పాటుగా ఇతర రచులను వెలుగులోకి తెచ్చే విధంగా పర్యాటకుడు, ఆహార ప్రియుడు రాకీ సింగ్ రోడ్ ట్రిప్ సాగనున్నది. కన్యాకుమారి నుంచి బయలు దేరి ఆధ్యాత్మిక పట్టనం మదురై వైపుగా , ఆతర్వాత కోయంబత్తూరు, చివరకు 11వ తేదీన చెన్నైలో పర్యటన ముగించే విధంగా కార్యక్రమం జరగనున్నది. మార్గంమధ్యలో తిరునల్వేలి, కారైక్కుడి, సేలం, మహాబలిపురంలలో విభిన్న వంటకాలకు ప్రాధాన్యతను ఇస్తూ పురాతన చరిత్రను గుర్తుచేసే విధంగా కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

రాజ్ భవన్‌కు మళ్లీ టీఎన్‌పీఎస్సీ నివేదిక



రాజ్ భవన్

సాక్షి, చెన్నై: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ నియామకం వ్యవహారం మళ్లీ గురువారం రాజ్ భవన్‌కు చేరింది. గవర్నర్ ఆర్‌ఎన్ రవి అడిగిన వివరణకు, ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానాలు ఇస్తూ తాజా నివేదికను అందించినట్లు తెలిసింది. తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మాజీ డీజీపీ శైలేంద్రబాబును నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయనతో పాటు తొమ్మిది మందిని సభ్యులుగా నియమించారు. ఈ నియామకానికి ఆమోదం తెలియజేయాలని గవర్నర్ రవికి ఇటీవల నివేదికను పంపించారు. కొంతకాలం ఈఫైల్‌ను తుంగలో తొక్కిన గవర్నర్ గతవారం రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి పంపించారు. ఈ నియామకం నిబంధనల విరుద్ధంగా జరిగిందంటూ అనేక ప్రశ్నలు లేవదీస్తూ వివరణ కోరారు. దీనికి సమాధానం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మరో నివేదికను రాజ్ భవన్‌కు పంపించింది. గవర్నర్ అడిగిన అన్ని ప్రశ్నలకూ సమాధానాలు ఇందులో ఇచ్చారు. ప్రధానంగా మాజీ డీజీపీ శైలేంద్రబాబు నియామకానికి సంబంధించి వివరాలను ప్రత్యేకంగా తాజా నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

కళాశాల హాస్టల్‌లో చోరీ

– ఇద్దరి అరెస్టు

తిరువొత్తియూరు: చెంగల్పట్టు జిల్లా మరైమలై నగర్ సమీపంలోని బొతేరి ప్రాంతంలో ప్రైవేటు యూనివర్సిటీకి సంబంధించిన హాస్టల్లో విద్యార్థులు ఉంటున్నారు. బుధవారం రాత్రి హాస్టల్లో విద్యార్థులు భోజనం చేయడానికి వెళ్లిన సమయంలో ఇద్దరు వ్యక్తులు చొరబడి అక్కడున్న ఓ లాప్‌టాప్‌ను తీసుకుని పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఇది చూసిన హాస్టల్ సెక్యూరిటీ గార్డులు ఇద్దరిని పట్టుకొని మరైమలర్ నగర్ పోలీసులకు అప్పగించారు. విచారణ చేయగా ఇద్దరు తిరువన్నామలైకు చెందిన శంకర్ కుమారుడు వాసుదేవన్ (30). కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన మహాదేవ్ జ్యోతి కుమారుడు వెంకటేష్ (25) అని తెలిసింది. ఇద్దరినీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇంటిని లీజుకిచ్చి రూ.6 లక్షలు మోసం

తిరువొత్తియూరు: కోర్టులో కేసు నడుస్తుండగా ఇంటిని లీజుకి ఇచ్చి రూ. 6 లక్షలు మోసం చేసిన ఇంటి యజమానిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తూ ఉన్నారు. వివరాలు.. చెన్నై కొడుంగయూర్ కన్నదాసన్ నగర్ అభిరామి అవెన్యూ 9వ వీధికి చెందిన రామమూర్తి (50). ఇతను లేతు పత్రను అడుగుతున్నారు. ఇతను ఉంటున్న ఇంటిని ఖాళీ చేసి తర్వాత కొడుంగయూర్ ఎంఆర్ నగర్ భారతి పార్థసారథి వీధిలో ఉన్న ఒక ఇంటిని చూసి ఆ ఇంటి యజమాని శ్రీనివాస్ వద్ద రూ. 6 లక్షలకు లీజుకు తీసుకున్నారు. దీని తర్వాత ఇంటిని శుభ్రం చేస్తుండగా శ్రీనివాసం తమ్ముడు, భార్య వచ్చి ఈ ఇంటిపై కేసు ఉందని చెప్పారు. ఇంటికి ఎవరు రాకూడదని వాళ్లు హెచ్చరించారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన రామమూర్తి నేరుగా శ్రీనివాసులు వద్దకు వెళ్లి నగదును ఇవ్వమని కోరారు. నగదును శ్రీనివాసన్ తిరిగి ఇవ్వకుండ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీనిపై మోసపోయిన రామమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొడుంగయూర్ క్రైమ్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి శ్రీనివాసన్‌ను ప్రశ్నిస్తున్నారు.

బైకును ఢీకొన్న కారు

- ఇద్దరు యువకుల మృతి

అన్నానగర్: తిరువిల్లిపుత్తూరు సమీపంలో గురువారం ఉదయం బైకును కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాలు.. తెన్కాసిలో ఆర్. ఎస్.పాళయానికి చెందిన గురుమూర్తి (26) విరుదునగర్ జిల్లా తిరువిల్లిపుత్తూరు –రాజపాళయం రోడ్డులోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. తిరువిల్లిపుత్తూరు సమీపంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులకు వెళ్లేవాడు. అలాగే తిరువిల్లిపుత్తూరుకు చెందిన ముత్తుమణి (30) కూడా గురుమూర్తి కంపెనీలోనే పనిచేస్తున్నారు. ఇద్దరూ ఒకే బైక్‌పై రోజూ పనికి వెళ్లేవారు. గురువారం ఉదయం పనికి బయల్దేరిన వారు వన్నియంపట్టి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన కారు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వన్నియాంబట్టి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరువల్లిపుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

బ్రెయిన్ డెడ్ మృతురాలికి హానరీ వాక్

– తొలిసారిగా నివాళులు

సాక్షి, చెన్నై : బ్రెయిన్ డెడ్ అయ్యి మరణించిన ఓ మహిళ మృత దేహానికి హానరీ వాక్ పేరిట వైద్యులు నివాళులర్పించారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఓ మృతురాలికి ఈరకంగా నివాళులర్పించడం గమనార్హం. వివరాలు.. వేలూరుకు చెందిన సత్య(36) ఆగస్టు 27వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురి అయ్యారు. స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించారు. మరుసటి రోజున ఆమెను చెన్నై రాజీవ్ గాంధీ జీహెచ్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ 29వ తేదీన బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబీకులకు సమాచారం అందించారు. సత్య అవయవాలను దానం చేయడానికి కుటుంబీకులు ముందుకు వచ్చారు. ఆమె కిడ్నీలను రాజీవ్ గాంధీ జీహెచ్‌లో చికిత్సలో ఉన్న ఓ రోగికి శస్త్ర చికిత్స ద్వారా అవయవ మార్పిడి జరిగింది. మిగిలిన అవయవాలను రాష్ట్ర ప్రభుత్వ అవయవ దానం అథారిటీలో నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఆధారంగా ఆయా ఆస్పత్రులకు పంపించారు. బ్రెయిన్ డెడ్‌తో మరణించి, అవయవాలను దానంగా ఇచ్చిన సత్యకు గౌరవం కల్పించే విధంగా హానరీ వాక్‌తో నివాళులర్పించేందుకు రాజీవ్ గాంధీ జీహెచ్ వర్గాలు నిర్ణయించాయి. గురువారం ఉదయం ఆమె భౌతిక కాయానికి ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బంది అందరూ నివాళుర్పించారు. ఆస్పత్రి ఆవరణలో బారులు తీరిన మౌన అంజలితో ఆమె మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ విషయంగా రాజీవ్‌గాంధీ జీహెచ్ డీన్ తేరడి రాజన్ పేర్కొంటూ, బ్రెయిన్ డెడకు గురై, అవయవదానం చేసిన ఒక మృతురాలికి భౌతిక కాయనికి ఈ హానరీ వాక్ నివాళులు అందించడం ఇదే రాష్ట్రంలో ప్రప్రథమం అని పేర్కొన్నారు. అవయవదానంపై అవగాహన విస్తృతం కావాలనే కాంక్షతో సత్య భౌతి కాయానికి ఈ గౌరవం కల్పించామన్నారు.

సీఎం అల్పాహారంపై తెలంగాణ అధ్యయనం

- చెన్నైలో అధికారుల పర్యటన

సాక్షి, చెన్నై : తమిళనాడులోని పాఠశాలలో అమల్లో ఉన్న సీఎం అల్పాహార పథకం పై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ పథకంపై అధ్యయానికి తెలంగాణ అధికారుల బృందం గురువారం చెన్నైలో పర్యటించారు. ఒకటో తరగతి నుంచి ఐ దో తరగతి వరకు చదువుతున్న ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం అల్పాహార పథకం అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. గత ఏడాది లాంఛనంగా కొన్ని పాఠశాలలో ప్రారంభించినా, ఆగస్టు నెలాఖరులో 31 వేల పాఠశాలలో ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఈ పథకం తెలంగాణ ప్రభుత్వాన్ని ఆకర్షించినట్టుంది. ఇక్కడ అమ లు అవుతున్న విధానాన్ని పరిశీలించేందుకు తెలంగాణ అధికారుల బృందం ఉదయం చెన్నైకు వచ్చా రు. చెన్నై రాయపురంలోని ఉర్దూపాఠశాలలో ఈ పథకం అమలును అధికారులు పరిశీలించారు. ఈ బృదంలో తెలంగాణ సీఎం కార్యదర్శి స్మిత సబర్వాల్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిష్టినా, విద్యా శాఖ కార్యదర్శి కరుణా వాకాటి, తదితర అధికారులు ఉన్నారు. ఈ విషయంగా తమిళనాడు లో సీఎం అల్పాహారం పథకం అమలు ప్రత్యేక అధికారిగా ఇలం భగవత్ పేర్కొంటూ, తెలంగాణ అధికారులు ఈ పథకం గురించి అధ్యయనానికి ఇక్కడకు వచ్చినట్టు గుర్తు చేశారు. వారికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఇతర రాష్ట్రాల అధికారు లు సైతం ఇక్కడకు రాబోతున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా విజయవతంగా అమలు అవుతున్న ఈ పథకం గురించి ఓ మీడియా సంస్థ రాసిన వ్యతిరేక కథనం సీఎం స్టాలిన్, క్రీడల శాఖమంత్రి ఉదయ నిధి స్టాలిన్‌లో ఆగ్రహాన్ని రేపాయి. ఆ కథనాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

అమామూక ముఖ్యుడి మనవడి అరెస్ట్

కొరుక్కుపేట: ఏర్కాడ్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై దాడి చేసిన అమామూక పార్టీకి చెందిన ప్రముఖుడి మనుమడు, పలువురిపై కేసు నమోదు చేసి సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందులో అమామూక నేత మనవడుతో పాటు, మరో ఇద్దరు వ్యక్తులను ప్రత్యేక బలగాల పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. సేలం జిల్లా ఏర్కాడ్‌లోని ప్రముఖ ప్రైవేట్ పాఠశాలలో 100 మందికి పైగా విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ తరగతి చదువుతున్నారు. ఇందులో 12వ తరగతి విద్యార్థుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కడంపూర్ ప్రాంతానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని, ఆమె స్నేహితులపై కొందరు 12వ తరగతి విద్యార్థులు దాడి చేశారు. దీంతో విద్యార్థి తన సోదరుడికి సమాచారం అందించాడు. కొందరు స్నేహితులతో కలిసి 7వ తేదీన ఏర్కాడ్ పాఠశాలకు వచ్చి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులపై తీవ్రంగా దాడి చేసి పరారయ్యాడు. దీంతో స్కూల్ యాజమాన్యం ఏర్కాడ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అందులో కడంపూర్ ప్రాంతానికి చెందిన అమామూకా ప్రముఖుడు మనవడు మాణిక్య రాజు, అతని స్నేహితులు వచ్చి దాడి చేశారు. దాడికి పాల్పడిన కడంపూర్‌కు చెందిన శరవణ అయ్యప్పన్ (22), దురైరాజ్ (23), మహారాజా (24), పాంగనేష్ (21), అయ్యనార్ (29)ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ కేసులో మాణికరాజు తమిళనాడు – కేరళ సరిహద్దులోని తేని జిల్లాలో తలదాచుకున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీని ప్రకారం, స్పెషల్ ఫోర్స్ పోలీసులు గురువారం తెల్లవారుజామున అక్కడికి వెళ్లిన మాణిక్య రాజా (24), అతని బంధువు కార్తీకరాజు (21) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

కిటకిటలాడిన గిరివలయం రోడ్డు



గిరివలయం రోడ్డులో స్వామి దర్శనానికి వెళ్తున్న భక్తులు

వేలూరు : తమిళ ఆవణి మాస పౌర్ణమిని పురస్కరించుకొని తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ గిరివలయం రోడ్డు భక్తులతో కిటకిటలాడింది. పంచ భూత స్థలమైన అరుణాచలేశ్వరాలయంలో ప్రతినెలా పౌర్ణమి రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గిరివలయం రోడ్డులోని 14 కిలో మీటర్ల దూరం నడిచి వెళ్లి స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా పౌర్ణమి ఘడియలు బుధవారం ఉదయం 10.58 గంటలకు ప్రారంభమై గురువారం ఉదయం 8.17 గంటలకు ముగియడంతో కార్తీక దీపం తరహాలోనే భక్తులు అధిక సంఖ్యలో వస్తారని ఆలయ అధికారులు ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లును సిద్ధం చేశారు. అదేవిధంగా ఆలయంలోని అన్నామలైయార్ సమేత ఉన్నామలై అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి పుష్పాలంకరణలు చేశారు. ఇదిలా ఉండగా పౌర్ణమి సమయంలో 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరివలయం రోడ్డులో కాలి నడకన వచ్చి స్వామి వారిని దర్శించుకుంటే చేసిన పాపాలు పోయి పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. అందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తిరువణ్ణామలై చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని మాడ వీధుల్లో ఊరేగించడంతో భక్తులు అధిక సంఖ్యలో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

విజయ్‌సేతుపతి నాపై పగ తీర్చుకోలేరు



జవాన్ ప్రీ రిలీజ్ వేడుకలో చిత్ర యూనిట్

తమిళసినిమా: బాలీవుడ్ బాద్షా షారూఖ్ ఖాన్ పఠాన్ చిత్రం తరువాత కథానాయకుడిగా నటించిన చిత్రం జవాన్.ఆయన సొంత నిర్మాణ సంస్థ రెడ్ చిల్లీ పతాకంపై నిర్మించిన ఈ చిత్రం ద్వారా కోలీవుడ్ యువ దర్శకుడు అట్లీ బాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంలో నయనతార కథానాయకిగా నటించగా విజయ్ సేతుపతి, యోగిబాబు, ప్రియమణి తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు నటి దీపికా పడుకొనే అతిథి పాత్రలో నటించిన ఈ చిత్రం ద్వారా అనిరుధ్ సంగీతం అందించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న జవాన్ చిత్రం ఈనెల 7న ప్రపంచవ్యాప్తంగా తెరపైకి రానుంది. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఈ చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని చెన్నైలోని ఓ ప్రైవేట్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రాన్ని ఎనిమిది నెలలు పూర్తి చేయాలని ప్రణాళికను సిద్ధం చేశామని అయితే కరోనా తదితర కారణాల వల్ల మూడేళ్లు పట్టిందని చెప్పారు. అదే సమయంలో చిత్రం మరింత బ్రహ్మాండంగా రూపొందిందని, ఖర్చు కూడా భారీగా పెరిగిందన్నారు. అందుకు షారుక్ ఖాన్ ఎంతగానో సహకరించారని అట్లీ చెప్పారు. షారుక్ ఖాన్ కలిసి నటించడం మంచి అనుభవమని విజయ్ సేతుపతి పేర్కొన్నారు. తాను పాఠశాలలో చదువుకునేటప్పుడు ఒక అమ్మాయిని ప్రేమించానని అయితే అది వన్ సైడ్ లవ్ అని చెప్పారు. ఆ అమ్మాయి మాత్రం తాను నటుడు షారుక్ ఖాన్ వీరాభిమానినని ఆయన్ని ప్రేమిస్తున్నానని చెప్పిందన్నారు. అప్పటినుంచి తనకు షారుక్ ఖాన్ పై పగ ఏర్పడిందన్నారు. ఆ పగను ఈ చిత్రంలో తీర్చుకున్నానని సరదాగా అన్నారు. షారుక్ ఖాన్ మాట్లాడుతూ నటుడు విజయ్ సేతుపతి ఇంతకు ముందు చెప్పినట్లుగా తనపై ప్రతీకారం తీర్చుకోలేరని కారణం ఆయన తనకు అభిమాని అని పేర్కొన్నారు. జవాన్ చిత్రంలో నటించడంతో దక్షిణాది సినిమా గురించి చాలా నేర్చుకున్నానని షారుక్ ఖాన్ చెప్పారు. కాగా చెన్నైలో జవాన్ చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో పాల్గొనడానికి వచ్చిన షారుక్ ఖాన్‌కు నటుడు కమలహాసన్ వీడియో ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.



నయనతార

సరికొత్తగా లేడీ సూపర్ స్టార్ ఎంట్రీ

తమిళసినిమా: దక్షిణాది సినీ పరిశ్రమలో లేడీ సూపర్ స్టార్‌గా వెలిగి పోతున్న నటి నయనతార. అయ్యా చిత్రంలో కోలీవుడ్‌కి కథానాయకిగా పరిచయం అయి న ఈ కేరళ భామ ఆ తరువాత రజనీకాంత్ సరసన చంద్రముఖి చిత్రంలో నటించే లక్కీ చాన్స్ దక్కించుకున్నారు. ఆపై నటిగా వెనక్కి తిరిగి చూసుకునే అవసరం నయన్‌కు లేకపోయింది. అలా 20 ఏళ్లుగా పలు భాషల్లో అగ్ర నటులందరి సరసన నటిస్తూ టాప్ హీరోయిన్‌గా రాణించారు. ఆ తరువాత మాయ, అరమ్ వంటి హీరోయిన్ ఓరియంటెడ్ కథా చిత్రాల్లో నటించిన లేడీ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందారు. తాజాగా జవాన్ చిత్రంతో బాలీవుడ్‌లోనూ పాగా వేశారు. కాగా కథానాయకిగా ఒక స్థాయికి ఎదిగిన తరువాత ఒక పాలసీ పేరుతో తన కంటూ. గిరి గీసుకున్నారు. తాను ఇతర చిత్రాలతో సహా తను నటించిన చిత్రాల ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొన్నరాదన్నదే ఆ పాలసీ. అయితే తాను సొంతంగా బ్యానర్లో నిర్మించిన చిత్రాల ప్రమోషన్లలో మాత్రం పాల్గొంటున్నారు. అదే ఆమెను విమర్శలకు గురి చేస్తోంది. కాగా లేడీ సూపర్ స్టార్ గా రాణిస్తున్న నయనతార ట్విట్టర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అలాంటిది ఇప్పుడు తొలి సారిగా ఇన్‌స్టాగామ్ ఎకౌంటు ప్రారంభించడం విశేషం. తన అభిమానులతో తరచూ ముచ్చటిస్తూ, తన చిత్రాల విషయాలను వారితో పంచుకోవడానికే ఇన్‌స్టాగామ్ లోకి ఎంటర్ అయినట్లు గురువారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఇన్‌స్టాగామ్ లో మొట్టమొదటి సారిగా తన ఇద్దరు కవల పిల్లలను ఎత్తుకున్న ఫొటోను పోస్ట్ చేశారు. దీనికి లైక్‌ల వర్షం కురుస్తోంది.

కోలీవుడ్ టాక్స్

కుటుంబ అనుబంధాల ‘రంగోలి’

తమిళ సినిమా: పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ, ఆశలు విద్యార్థి కుటుంబ అనుబంధాలను ఆవిష్కరించే కథాంశంతో రూపొందిన చిత్రం రంగోలి. మధ్యతరగతి కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు మంచి పొజిషన్లో ఉండాలనే ఆశతో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే కొడుకును ప్రైవేట్ పాఠశాలలో చదివించాలని భావిస్తారు. అయితే అతనికి ఇష్టం లేకపోయినా తల్లిదండ్రుల కోరికను నిరుత్సాహ పరచరాదన్న దృక్పథంతో ప్రైవేట్ పాఠశాలలు చేరుతాడు. అయితే అక్కడ విద్యా విధానం ఆ యువకుడికి అర్థం కాదు. అందుకు తోడు సహ విద్యార్థుల అవమానాలను ఎదుర్కొనే పరిస్థితి. మరోపక్క అతను చదివించడానికి తల్లిదండ్రులు ఎంతగానో శ్రమిస్తుంటారు. అప్పులు కూడా చేస్తారు. తన చదువు కోసం తల్లిదండ్రులు సోదరి పడే కష్టం చూసి ఆ విద్యార్థి ఎలాంటి నిర్ణయం తీసుకున్నాడు అన్నదే రంగోలి చిత్ర కథ. గోపురం స్టూడియోస్ పతాకంపై బాబురెడ్డి, ఎస్.సతీష్ కుమార్ కలిసి నిర్మించిన ఈ చిత్రం ద్వారా దర్శకుడు ఏఎల్ విజయ్ మేనల్లుడు, నిర్మాత, పంపిణీ దారుడు ఏఎల్.అళగప్పన్ మనవడు అమ్రేష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నాడు. నటి ప్రార్థన నాయకిగా నటించిన ఇందులో నటుడు మురుగదాస్, నటి సాయి శ్రీ ప్రభాకరన్, అక్షయ హరిహరన్, అమిత్ భార్గవ్ తదితరులు ముఖ్యపాత్ర పోషించారు. దర్శకుడు వసంత్ శిష్యుడు వాలి మోహన్ దాస్ ఈ చిత్రం దర్శకునిగా పరిచయం అవుతున్నారు. మరుదనాయకం ఛాయాగ్రహణం, సుందరమూర్తి కేఎస్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో తెరపైకి రానుంది. కాగా ఇది ప్రేక్షకులను కచ్చితంగా మెప్పించి ఘన విజయం సాధిస్తుందని చిత్రవర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.



రంగోలి చిత్రంలో అమ్రేష్, ప్రార్థన



చిత్ర యూనిట్ సభ్యుల సందడి

థ్యాంక్యూ కశ్మీర్

తమిళ సినిమా: నటుడు శివ కార్తికేయన్ మావీరన్ వంటి విజయవంతమైన చిత్రం తర్వాత నటిస్తున్న సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. నటి సాయి పల్లవి చాలా కాలం తరువాత హీరోయిన్‌గా తమిళంలో నటిస్తున్న ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమలహాసన్ తన రాసి కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇది శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న 21వ చిత్రం కావడం గమనార్హం. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్ర షూటింగ్ గత 75 రోజులుగా కాశ్మీర్లో ఏకధాటిగా జరుపుకుంది. కాగా కశ్మీర్లో షూటింగులు ముగించుకున్న చిత్త ఇటు సంతోషంతో రంగుల వలయం మధ్య సంబరాలు చేసుకున్నారు. ఆ ఫొటోలను ట్విట్టర్లో పోస్ట్ చేసి మరోసారి తిరిగి వచ్చేవరకు థాంక్యూ కాశ్మీర్ అంటూ పేర్కొన్నారు. కాగా చెన్నైకి తిరిగి వచ్చిన చిత్రం యూనిట్ తదుపరి చిత్ర షూటింగ్‌ను చెన్నైలో నిర్వహించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాగా ఈ చిత్రం తర్వాత నటుడు శివ కార్తికేయన్ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో నటించడానికి సిద్ధమవుతున్నారు.



కార్తీ

వా వాద్దియారేగా.. కార్తీ

తమిళసినిమా: నటుడు కార్తీ స్పీడ్ పెంచారనే చెప్పాలి. వరుసగా విజయాలతో దూసుకుపోతున్న ఈయన ఇటీవల కాలంలో విరుమాన్, పొన్నియిన్ సెల్వన్, సర్దార్ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలలో నటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈయన కథానాయకుడిగా తన 25వ చిత్రం జపాన్ ను సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశారు. ఈ చిత్రంలోని చివరి పాటను కూడా ఇటీవలే కశ్మీర్లో నటించి పూర్తి చేసేశారు. ఈ చిత్రం దీపావళి రేస్ సిద్ధమవుతోంది. కాగా ప్రస్తుతం కార్తీ దర్శకుడు నలన్ కుమారసామి దర్శకత్వంలో నటిస్తున్నారు. ఇది ఆయన నటిస్తున్న 26వ చిత్రం. నటి కృతిశెట్టి నాయకిగా నటిస్తోంది. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ఇది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కథా చిత్రంగా రూపొందుతున్న ఇందులో కార్తీ ఎంజీఆర్ వీరాభిమానిగా నటిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ చిత్రానికి వా వాద్దియారే అనే టైటిల్ నిర్ణయించినట్లు సమాచారం. అయితే చిత్ర వర్గాలు టైటిల్ గురించి ఇంకా అధికారిక పూర్వకంగా వెల్లడించలేదన్నది గమనార్హం. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చెన్నై పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటోంది. కాగా తదుపరి కార్తీ 96 చిత్రం ఫేమ్ ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో నటించనున్నారు. ఇందులో నటుడు అరవిందస్వామి ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. గోవింద్ వసంత సంగీతం, పీసీ శ్రీరామ్ ఛాయాగ్రహణం అందించనున్న ఈ చిత్రాన్ని నటుడు సూర్యకు చెందిన 2డీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించనుంది. ఆ తర్వాత సర్దార్– 2, ఖైదీ– 2 చిత్రాల్లో కార్తీ నటించనున్నారని సమాచారం.



కృతిశెట్టి

క్లుప్తంగా

రూ.9 లక్షల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

అన్నానగర్: దిండివనం, మధురాంతకంలోని రెండు ఇళ్లలో దాచిన రూ.9 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. హోల్‌సేల్ వ్యాపారి సహా ఇద్దరిని అరెస్టు చేశారు. దిండివనం సమీపంలోని కిలిమావిలంగై గ్రామంలోని ఓ ఇంట్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు ఉంచి విక్రయిస్తున్నట్లు విల్లుపురం జిల్లా ఎస్పీ ససాంగ్ సాయికి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు స్పెషల్ ఫోర్స్ పోలీసులు బుధవారం సోదాలు చేశారు. రెండు బస్తాల్లో ఉంచిన పొగాకు ఉత్పత్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇంటి యజమాని, అదే గ్రామంలో పెట్టె దుకాణం నిర్వహిస్తున్న పెరుమాళ్ కుమారుడు సెల్వం(37)ను అదుపులోకి తీసుకున్నారు. చెంగల్‌పట్టు జిల్లా ఒరతి గ్రామం నుంచి పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేసి హోల్‌సేల్ వ్యాపారి వెంకటేశం(48) నుంచి పెట్టెల దుకాణంలో విక్రయించినట్లు తేలింది. అనంతరం ఒరతిలోని వెంకటేశం ఇంటికి ప్రత్యేక బలగాల పోలీసులు వెళ్లి దాడులు నిర్వహించారు. అక్కడ 40 బస్తాల పొగాకు ఉత్పత్తులను స్వాధీనంచేసుకున్నారు. వీటి విలువ రూ.9 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. సెల్వం, వెంకటేశంను అరెస్టు చేశారు.

ఇసుకాసురులపై చర్యలు తీసుకోవాలి



చెరుకుతోటలో నిల్వచేసిన ఇసుక

పళ్లిపట్టు: కాలువ నుంచి ఇసుక అక్రమంగా తరలించి చెరుకు తోటలో నిల్వ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని గ్రామీణులు డిమాండ్ చేశారు. పళ్లిపట్టు యూనియన్ అత్తిమాంజేరి గ్రామంలో చెరువు కాలువ నుంచి రాత్రి సమయాల్లో కూలీల సాయంతో ఇసుక తరలించి సమీపంలోని చెరుకు తోటలో నిల్వ చేస్తున్నట్లు గ్రామీణులు ఆరోపిస్తున్నారు. పళ్లిపట్టు సమీపం కుశస్థలినదిలో ప్రభుత్వ ఇసుక క్వారీ ద్వారా తక్కువ ధరకు ప్రభుత్వం ఇసుక విక్రయిస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతి లేకుండా చెరువు కాలువ నుంచి ఇసుకను తరలించి నిల్వ చేసి విక్రయించే ప్రయత్నాన్ని పోలీసులతో పాటు రెవెన్యూ శాఖ అధికారులు అడ్డుకుని ఇసుక చోరీకి పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లి కోరిక తీర్చిన కుమారులు

–95 ఏళ్ల వృద్ధురాలి నేత్రాలు దానం

కొరుక్కుపేట: తల్లి కోరిక మేరకు కుమారులు ఆమె కళ్లను దానం చేశారు. తిరువొత్తియూరులోని అప్పా స్వామి కోయిల్ వీధికి చెందిన హంసవల్లి (95)కి ఇద్దరు కుమారులు రవి (76), అన్బళగన్ (72) ఉన్నారు. హంసవల్లి తన కుమారులు, మనవడు, ఐదుగురు మనుమలు నివసిస్తున్నారు. మూడు తరాలను చూసిన హంసవల్లి తన మరణానంతరం కళ్లను దానం చేయాలని కుమారులకు చెప్పేది. వయోభారంతో హంసవల్లి ఆకస్మికంగా మృతి చెందింది. తల్లి కోరిక మేరకు ఆమె నేత్రాలు దానం చేస్తామని కుమారులు ప్రయివేటు కంటి ఆసుపత్రి యాజమాన్యానికి తెలియజేశారు. వైద్యులు పరీక్షించగా హంసవల్లి కళ్లు బాగానే ఉన్నాయని నిర్ధారించి కళ్లు తీసుకెళ్లారు.

ఆదర్శ ఉపాధ్యాయుడిగా ఎంపిక

తిరుత్తణి: సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు పలు సంస్థలు వేడుకలు నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించనున్నాయి. ఇందులో భాగంగా తమిళనాడు విద్యా పరిశోధన సంస్థ ద్వారా ఆదర్శ ఉపాధ్యాయులు ఎంపిక చేసి చెన్నైలో సెప్టెంబర్ 5న నిర్వహించే కార్యక్రమంలో అవార్డులతో సత్కరించనున్నారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మాసిలామణి ఆదర్శ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఆయన విద్య, తమిళ భాష అభ్యున్నతికి విశేష కృషి చేశారని, బోధనలో ఆకట్టుకునే పద్ధతులు అవలంబించారని, అందువల్ల ఆయనను ఆదర్శ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినట్లు విద్య పరిశోధన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

తిరువొత్తియూరు: చాకలిపేట పోలీస్ స్టేషన్‌లో ప్రేమ జంట ఆశ్రయం కోరింది. కొత్త చాకలిపేట నమయ్య మేస్త్రీ వీధికి చెందిన రమేష్ (29) ప్రైవేటు సంస్థ ఉద్యోగి. ఇతను పెరంబూర్ ప్రాంతానికి చెందిన ఐటీ సంస్థలో పని చేస్తున్న దుర్గాదేవి (27) ప్రేమించుకుంటున్నారు. ఈ సంగతి దుర్గాదేవి తల్లిదండ్రులకు తెలియడంతో బంధువుతో పెళ్లి ఏర్పాటు చేశారు. దుర్గాదేవి బుధవారం ప్రియుడు రమేష్ ఇంటికి వెళ్లిపోయింది. తర్వాత ఇద్దరూ కొత్త చాకలిపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఆశ్రయం కోరారు. పోలీసులు ఇరువురి కుటుంబ సభ్యులను పిలిపించి చర్చించారు.

ఎస్వీయూ ప్రొఫెసర్‌కు ఫెలోషిప్ అవార్డు

తిరుపతి సిటీ: ఎస్వీయూ బయోకెమిస్ట్రీ విభాగపు సీనియర్ అధ్యాపకులు ఎస్‌డీఎస్ మూర్తి ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ బయోకెమిస్ట్రీ వారిచ్చే ఫెలో షిప్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ఆయనకు ఆహ్వానం పంపారు. నవంబర్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆయన అవార్డును అందుకోనున్నారు.

న్యాయవాదుల నిరాహార దీక్ష



తిరువళ్లూరులోని ఉమ్మడి కోర్టు ఆవరణలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు



వేలూరు కోర్టు ఎదుట దీక్ష చేస్తున్న న్యాయవాదులు

తిరువళ్లూరు: వందేళ్లకు పైగా ఆచరణలో వున్న చట్టాలను మార్చడంతో పాటు భాషా స్వేచ్ఛను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా వున్న న్యాయవాదులు కోర్టులను బహిష్కరించి 21 నుంచి ఆందోళన చేస్తున్నారు. గురువారం నిరాహార దీక్షను చేపట్టారు. తిరువళ్లూరు ఉమ్మడి కోర్టు ఆవరణలో జరిగిన నిరాహార దీక్షకు పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మారప్పన్ అధ్యక్షత వహించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమైన నిరాహార దీక్ష సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ఈ సందర్భంగా మారప్పన్ మాట్లాడుతూ వందేళ్లకు పైగా ఆచరణలో వున్న ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ అనే మూడు చట్టాల నిబంధనలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం సవరించింది. దీంతో పాటు భాషాస్వేచ్ఛ ఉన్న భారతదేశంలో ఆంగ్ల భాషలో వున్న చట్టాలను సంస్కృత భాషలో అర్థాలు వచ్చే విధంగా మార్చడం సరికాదన్నారు. వాస్తవానికి చట్టాలు, చట్టాల పేర్లను మార్చడానికి లా కమిటీ సిఫార్సు చేయాలని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా ఏకంగా సంస్కృత భాషలో అర్థాలు వచ్చే విధంగా చట్టాలను మార్చడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిర్ణయాలను పునఃసమీక్షించి వెంటనే వెనుక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చట్టాలు నిరంకుశ పాలను తెరలేపేలా వుందని విమర్శించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను వెంటనే వెనుక్కి తీసుకోవాలని, లేని పక్షంలో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో న్యాయవాదుల సంఘం నేతలు ఆదామ్, రామ్‌కుమార్, బీకే నాగరాజ్, వెంకటరంగం, విజయకుమార్, మురళీబాబు, బాలమురుగన్, రాజరాజన్, సుకుమార్, సురేష్‌బహుజన్, శ్రీనివాసన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

వేలూరు: కేంద్ర ప్రభుత్వం భారత శిక్షాస్మృతిలోని పలు చట్టాలకు తీసుకొచ్చిన పలు సవరణలను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు వేలూరు కోర్టు ఎదుట గురువారం ఉదయం నిరాహార దీక్ష చేపట్టారు. వేలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సవరణలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించకుంటే పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షా కార్యక్రమంలో లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిరామన్, అసోసియేషన్ అధ్యక్షుడు కపిలన్, న్యాయవాదులు వెట్రివేలన్, అశోక్‌కుమార్, బాలసుబ్రమణి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయండి

- అధికారులకు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఆదేశం



సహాయకాలు అందజేస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

తిరువళ్లూరు: జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో వున్న ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర యువజన క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటి సారి ఆయన తిరువళ్లూరు జిల్లాలో అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు డీఎంకే నేతలు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన మంత్రికి కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ్, ఆవడి కమిషనర్ శంకర్, ఎమ్మెల్యేలు ఆవడి నాజర్, పూందమల్లి కృష్ణస్వామి, తిరుత్తణి చంద్రన్, గుమ్మిడిపూండి టీజే గోవిందరాజన్, తిరువళ్లూరు వీజీ రాజేంద్రన్, మధురవాయల్ కారపాక్కం గణపతి, జెడ్పీ చైర్మన్ ఉమామహేశ్వరి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ శేఖర్ తదితరులు స్వాగతం పలికారు. మొదట 912 మంది లబ్ధిదారులకు రూ.35.83 కోట్ల విలువ చేసే సంక్షేమ పథకాలను అందజేశారు. అనంతరం కరికలవాక్కంలో రూ.1540 కోట్ల చేపట్టిన తచ్చూర్–తిరువళ్లూరు రోడ్డు పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో అన్ని శాఖలకు చెందిన అధికారులతో నాలుగు గంటల పాటు సమీక్షించారు. అభివృద్ధి పనులు, జిల్లాకు అవసరమైన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసే సమయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం ఉలుందై గ్రామంలో బస చేసి ఆవడిలో జరిగే యువజన విభాగం కార్యవర్గ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎంకే జిల్లా ఉపకార్యదర్శులు వీసీకే కుమరన్, న్యాయవాద విభాగం కార్యదర్శి పోలీవాక్కం బీకే నాగరాజ్, పార్టీ నేతలు అరుణజైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు రూ.25 వేల జరిమానా

కొరుక్కుపేట: బ్రాండ్ లేని ఉత్పత్తులను వినియోగిస్తే రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామని 55 మందికి పైగా వ్యాపారులకు పరిశ్రమల శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు 2వ సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డివిజన్ లేబర్ కమిషనర్ సుభాచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై సహా రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్లు, ప్రధాన రోడ్లు, ఫుట్‌పాత్ దుకాణాలు, ట్రాలీ షాపుల్లో విక్రయించే పండ్లు, చేపలు తక్కువ బరువుతో ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో వెంటనే తనిఖీలు చేసి జరిమానా విధించాలని లేబర్ కమిషనర్ అతుల్ ఆనంద్, చెన్నై లీగల్ వెయిట్ కంట్రోల్ ఆఫీసర్ లక్ష్మీకాంతన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ విమలనాథన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో చెన్నై జిల్లాలోని అన్ని మార్కెట్లు, ఇతర ప్రాంతాల్లో లీగల్ సిస్టమ్ బరువుల చట్టం 2009 నిబంధనల ప్రకారం వరుస తనిఖీ చేపట్టారు. ఆగస్టు 30వ తేదీన చెన్నై తిరువాన్మియూర్ ఫార్మసీలు, కూరగాయల మార్కెట్‌లోని షాపుల్లో లీగల్ వెయింగ్ యాక్ట్ 2009 ప్రకారం చెన్నై – 28 సర్కిల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కమిషనర్ శుభచంద్రన్ నేతృత్వంలో తిరువాన్మియూర్ పోలీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ వేలాయుధం, పోలీసు సిబ్బందితో ముద్రలు వేయకుండా వినియోగంలో ఉన్న 27 ఎలక్ట్రానిక్ స్కేల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుకాణాలను తనిఖీ చేసి చర్యలు తీసుకున్నారు. వ్యాపారులు వారు ఉపయోగించే తూకాలను రీ –స్టాంప్ చేయించుకోవాలని, నెల, సంవత్సరం, అంతకంటే ఎక్కువ వినియోగదారులకు బాగా తెలిసిన విధంగా రీ – ప్రింటెడ్ సర్టిఫికెట్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో ఫిర్యాదులకు రీ – స్టాంపింగ్ చేయకపోతే రూ. 25000 వరకు జరిమానా విధించేలా చర్యలు చేపట్టారు.

ఇండియా కూటమితోనే దేశ భవిష్యత్తు



రామాపురం ప్రచార సభలో మాట్లాడుతున్న వన్నై పుహారి

పళ్లిపట్టు: ఇండియా కూటమి విజయంతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి వుందని డీఎంకే ప్రధాన వక్త వన్నై పుహారి పేర్కొన్నారు. పళ్లిపట్టు సౌత్ యూనియన్ డీఎంకే ఆధ్వర్యంలో బుధవారం రామాపురం, కాకళూరు గ్రామాల్లో ప్రచార సభలు చేపట్టారు. యూనియన్ కార్యదర్శి జి.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఆ పార్టీ ప్రధాన వక్త వన్నై పుహారి పాల్గొని ప్రసంగించారు. బీజేపీ కులం, మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టి విజయం సాధిస్తోందన్నారు. తద్వారా దేశంలో సాధారణ పౌరులకు భద్రత కొరవడిందని, మహిళలు, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతోపాటు సామాన్యుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని పేర్కొన్నారు. ఇండియా కూటమిని లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా వుందని తెలిపారు. యూనియన్ వైస్ చైర్మన్ భారతి, యూనియన్ నాయకులు గోవిందస్వామి, నదియ నాగరాజన్, గోపి, వెంకటపెరుమాళ్ పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో మరో మహిళ మృతి



అటవీ ఏనుగు దాడిలో మృతి చెందిన వసంత(ఫైల్)



ఏనుగు దాడిలో మృతి చెందిన మేకలు

వేలూరు: చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలో ముదపుటేనుగు సృష్టించిన బీభత్సంలో బుధవారం ఉదయం దంపతులు మృతి చెందిన విషయం తెలిసిందే. గుడిపాల మండలం రామాపురం గ్రామానికి చెందిన వెంకటేశులు, సెల్వి బుధవారం ఉదయం టమాటా చెట్లకు మందు పిచికారీ చేస్తుండగా ఏనుగు దాడి చేసింది. దంపతులు అక్కడికక్కడే మృతి చెందగా అదే గ్రామానికి చెందిన కార్తీక్ తీవ్రంగా గాయపడ్డాడు. భయాందోళన చెందిన గ్రామస్తులు ఏనుగును టపాకాయలు పేల్చి, డప్పులు వాయించి తరిమివేశారు. దీంతో అటవీ ఏనుగు ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన కాట్పాడి, పొన్నై, మగిమండలం వంటి ప్రాంతాల్లో తిరుగుతున్నట్టు మేకల కాపరులు తెలిపారు. ఈ ఏనుగు గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో కాట్పాడి సమీపంలోని పెరియబోడినత్తం గ్రామంలోకి ప్రవేశించింది. బాలక్రిష్ణన్ పైపులు, మేకల కొట్టంపై దాడి చేసింది. బాలక్రిష్ణన్ భార్య వసంత(54) బయటకు వచ్చింది. ఆ సమయంలో ఆ ఏనుగు తొండంతో ఆమెను కొట్టింది. బాలక్రిష్ణన్ కేకలు వేయడంతో ఏనుగు అక్కడి నుంచి వెళ్లి పోయింది. అతను 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేయడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వసంతను పరీక్షించి మృతిచెందినట్టు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మేల్‌పాడి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అటవీశాఖ అధికారులు గురువారం సాయంత్రం రెండు కుంకీ ఏనుగులను గుడిపాల మండలానికి పంపించి మత్తు ఇంజక్షన్ వేసి అటవీ ఏనుగును పట్టుకున్నారు.

చెన్నై, బెంగళూరు హైవేలో స్తంభించిన ట్రాఫిక్

తిరువొత్తియూరు: కాంచీపురం సమీపంలో చెన్నై– బెంగళూరు జాతీయ రోడ్డులో గురువారం ఉదయం పవన విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన భారీ రెక్కలను తీసుకొని లారీ వెళ్లింది. సత్రం వద్ద చెక్కాంగులం ప్రాంతంలో అదుపు తప్పి లారీ బోల్తా పడింది. వెంటనే దాన్ని తొలగించడానికి వీలు కాలేదు. ఈ కారణంగా చెన్నై వెళుతున్న వాహనాలు చెన్నైలో నుంచి వేలూరు బెంగళూరుకు వెళ్తున్న వాహనాలు ఐదు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. సుమారు 3 గంటలకు వాహనాల రాకరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాంచీపురం పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను సరి చేశారు.

కేవీ చెలియన్ సేవలు చిరస్మరణీయం



చెలియన్‌కు నివాళులర్పిస్తున్న యు.బాబు, నాగేంద్రన్, డీఎంకే నాయకులు

కొరుక్కుపేట: చెన్నై ట్రిప్లికేన్ ప్రాంత ప్రజలకు దివంగత కేవీ చెలియన్ చేసిన సేవలు చిరస్మరణీయమైనవని డీఎంకే నాయకులు కొనియాడారు. గురువారం స్వతంత్ర నగర్‌లో సామాజిక సేవకులు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి ఊసురుపాటి బాబు, ఎల్ఎస్‌టీ నాగేంద్రన్ సంయుక్తంగా డీఎంకే మాజీ ప్రాంతీయ కార్యదర్శి కేవీ చెలియన్ మొదటి వర్ధంతి సందర్భంగా స్వతంత్ర నగర్ ప్రాంతంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. డీఎంకే జిల్లా కార్యదర్శి చిత్రరసు, ఏరియా కార్యదర్శి ఏఆర్‌పీఎం కామరాజ్, జిల్లా ఉపకార్యదర్శి ఆర్‌ఎన్‌దురై, 119వ వార్డు కౌన్సిలర్ వి.కమల చెలియన్, 120 వార్డు తాలూకా కార్యదర్శి ఐసీఎఫ్ శంకర్, మోహన్, రవి, మంగై రాజ్ కుమార్, కుమార్, స్వతంత్ర నగర్ ఆది ఆంధ్ర వెల్ఫేర్ అసోసియేషన్ గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 400 మంది పేదలకు అన్నదానం చేశారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

తిరువొత్తియూరు: సేలం జిల్లాలో మహిళ హత్య కేసులో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సేలం జిల్లా తంభం పట్టి సమీపంలోని చందామర్రై పట్టికి చెందిన రాణి కుమారుడు ఇలంగో (45) ప్రభుత్వ బస్సు కండక్టర్‌గా పని చేస్తున్నాడు. ప్రమాదంలో గాయపడి ఒక కాలు పోగొట్టుకున్నాడు. స్థల విషయంలో రాణితో గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గత నెల 28వ తేదీ ఇంటిలో ఇంటిలో ఉన్న తల్లిపై దాడి చేశాడు. ఆమె తీవ్ర గాయాలతో మృతి చెందారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి ఇలంగోను అరెస్టు చేశారు. అతన్ని కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు.

తెక్కళూరు వారపు సంతతో ట్రాఫిక్ కష్టాలు



తిరుత్తణి – పొదటూరుపేట రోడ్డులో నిర్వహిస్తున్న తెక్కళూరు వారపుసంత

తిరుత్తణి: తెక్కళూరు వారపు సంతతో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమవుతున్నాయి. తిరుత్తణి యూనియన్ తెక్కళూరు గ్రామంలో తిరుత్తణి – పొదటూరుపేట రాష్ట్ర రహదారికి ఇరువైపులా వంద మందికి పైగా వ్యాపారులు ప్రతి బుధవారం వారపు సంత నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూరగాయలు, పండ్లు, సహా వివిధ వస్తువులు విక్రయిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు సంతలో వస్తువులు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. హైవేశాఖ అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో సంత ఏర్పాటును నిషేధించి గ్రామ పంచాయతీ ద్వారా వేరొక ప్రాంతంలో సంత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కోలాహలంగా ఫ్రెండ్‌షిప్ డే



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

కొరుక్కుపేట: స్నేహమే నా జీవితం...స్నేహమేరా శాశ్వతం అంటూ విద్యార్థులు గురువారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు కోలాహలంగా జరుపుకున్నారు. శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాలలో నెస్టర్ పూర్వ విద్యార్థుల సంఘం తరపున ఫ్రెండ్‌షిప్ డేని పురస్కరించుకుని విద్యార్థులకు రీల్స్, ట్విన్ వాక్, గ్రూమ్ యువర్ ఫ్రెండ్, ఫైర్‌లెస్, వైర్‌లెస్ కుక్కింగ్ తదితర పోటీలు నిర్వహించారు. అధ్యాపకులు డాక్టర్ కె.వినోద, ప్రతిభా భారతి, కె.లక్ష్మి, షీబా అలోర్సియస్, ఎ.నిర్మలా ఫౌస్టా, ఎం.వి.దుర్గాదేవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విద్యార్థినులు ఆయా పోటీల్లో ప్రతిభను చాటుకున్నారు. విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ పూటుకూరు శరత్ కుమార్, ప్రిన్సిపాల్ టి.మోహనశ్రీ, డీన్ పీబీ వనిత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.నప్పినై తదితరులు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్య

అన్నానగర్: పుదుకోట్టై జిల్లా ఆలంగుడి సమీపంలో తిరువరంగునం నింబునేశ్వరానికి చెందిన కరుపయ్య కుమారుడు పార్తనైయాన్ (38) కూలీ. ఇతని భార్య ప్రియాంక (23) డిప్లొమా పూర్తి చేసి అలంగుడిలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. వీరికి పెళ్లయ్యి 14 నెలలే అయ్యింది. ఇంకా పిల్లలు లేరు. తాగుడికి బానిసైన పార్తనైయాన్, ప్రియాంక నగలు అమ్మి రోజూ తాగి ఇంటికి వచ్చేవాడు. దీంతో మనస్పర్థలు రావడంతో పెద్దలు సయోధ్య కుదిర్చారు. పార్తనైయాన్ ఇక తాగనని ఒప్పుకున్నాడు. కానీ మద్యం మానలేకపోయాడు. ఈనేపథ్యంలో గురువారం ప్రియాంక ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు, లోపల ఉన్న చిన్న షెడ్డులో పార్తనైయాన్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వారు మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం పుదుక్కోట్టై ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి కి తరలించారు. భర్తతో గొడవల కారణంగా ప్రియాంక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని, ఇది చూసి షాక్‌కు గురైన పార్తనైయాన్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. అలంగుడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని భాషలకు తల్లి సంస్కృతమే



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి సిటీ: ప్రపంచంలోని అన్ని భాషలకు సంస్కృతం తల్లివంటిదని గోవింద రాజస్వామి ఆర్ట్స్ కళాశాల సంస్కృత అధ్యాపకుడు కోటీశ్వరయ్య తెలిపారు. కళాశాలలో గురువారం సంస్కృత భాషా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ పౌర్ణమి రోజున సంస్కృత భాషా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ప్రపంచ భాషల్లో సంస్కృతం ప్రాచీనమైనదని, అతి మధురమైన భాష అని కొనియాడారు. వేదానికి ఓంకారం, మానవజన్మకు మాతృమూర్తి లాగానే భారతీయులకు సంస్కృతం అంతే ప్రధానమైనదన్నారు. పాశ్చాత్య దేశాలు ప్రస్తుతం సంస్కృతం వైపు మొగ్గు చూపుతున్నాయని తెలపారు. భారతీయులందరూ సంస్కృత విద్యను అభ్యసించాలని కోరారు. అనంతరం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి బహుమతులు, పుస్తకాలు అందజేశారు.

7న ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈ నెల 7న గోకులాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. టీటీడీ హిందువుల ముఖ్యమైన పండుగల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఇందులో భాగంగా శ్రీకృష్ణ గోలోకాన్ని తలపించే విధంగా టీటీడీ శ్రీవేంకటేశ్వర గోశాలలో ఏర్పాట్లు చేయనుంది. ఈ ఏడాది సందర్శకులు గోశాలలో గోమాతలకు బెల్లం, బియ్యం స్వయంగా తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. గోకులాష్టమి సందర్భంగా ఎస్వీ గోసంరక్షణశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామికి అభిషేకం, వేణుగానం, వేద పఠనం, దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులతో భజనలు, కోలాటాలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం శ్రీ వేణుగోపాలస్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు. సాయంత్రం 6 గంటలకు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ గానం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా...

శ్రీమఠం సేవలు అభినందనీయం: గవర్నర్



శ్రీరాఘవేంద్రస్వామికి హారతినిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

మంత్రాలయం (కర్నూలు): శ్రీరాఘవేంద్ర స్వామి మఠం సేవలు ఆదర్శనీయంగా ఉన్నాయని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. రాఘవేంద్రుల 352వ ఆరాధన వేడుకలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం గవర్నర్ నజీర్ మంత్రాలయం విచ్చేశారు. స్థానిక పద్మనాభ అతిథి గృహం వద్ద ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. శ్రీమఠం వద్ద ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం యోగీంద్ర మంటపంలో జరిగిన రాయరు అనుగ్రహ ప్రశస్తి అవార్డుల కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు చేతుల మీదుగా అనుగ్రహ ప్రశస్థి అవార్డు స్వీకరించారు. గవర్నర్ మాట్లాడుతూ.. ధార్మిక, సాంస్కృతిక, మంత్రాలయం ప్రగతికి చేస్తున్న కృషి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అవార్డుల స్వీకరణానంతరం పద్మనాభతీర్థ అతిథి గృహం చేరుకుని బస చేశారు.

టీడీపీ నేతల ముందస్తు బెయిల్ పిటిషన్ల తిరస్కరణ

మదనపల్లె : ఉమ్మడి చిత్తూరు జిల్లా అంగళ్లు, పుంగనూరులలో ఆగస్టు 4న చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన అల్లర్ల ఘటనలో నమోదైన కేసులకు సంబంధించి పరారీలో ఉన్న 13 మంది టీడీపీ నేతలు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను తిరస్కరిస్తూ రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి అబ్రహాం గురువారం తీర్పునిచ్చారు. అంగళ్లు, పుంగనూరు ఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో 106 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి బెయిల్ పిటిషన్లను ఇదివరకే కోర్టు తిరస్కరించింది. కాగా, అరెస్ట్ కాకుండా అజ్ఞాతంలో ఉన్న 13 మంది ముందస్తు బెయిల్‌కు సంబంధించి ఆగస్టు 29న రెండో ఏడీజే కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును 31వ తేదీకి వాయిదా వేశారు.

నాణెం ఆవిష్కరణను రాజకీయం చేయడం తగదు

రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు స్మారక నాణెం ఆవిష్కరణ కార్యక్రమంలో తమ కుటుంబం అంతా పాల్గొందని.. రాష్ట్రపతి పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని రాజకీయం చేయడం తగదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. గురువారం విజయవాడలో బీజేపీ సోషల్ మీడియా, ఐటీ విభాగం ప్రతినిధుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు పురందేశ్వరి బదులిస్తూ.. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంపై సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని వ్యాఖ్యానించారు.

వైవీయూకు నూతన పాలకమండలి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం (వైవీయూ)కి మూడేళ్ల పదవీ కాలంతో నూతన పాలకమండలిని నియమిస్తూ ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జే.శ్యామలరావు గురువారం ఉత్తర్వులిచ్చారు. ఎంపికైన వారిలో వైవీయూ ఆచార్యులు పి.చంద్రమతీశంకర్, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సి.నాగరాజు, శ్రీకాళహస్తి పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.శ్రీలత, వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.మాదక్క, కడప ప్రభుత్వ పురుషుల కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలు జె.వెంకటలక్ష్మి, విశ్రాంత ఆచార్యులు మూల మల్లికార్జునరెడ్డి, సోషల్ యాక్టివిస్ట్ కె.చిన్నసుబ్బారావు, ప్రముఖ వైద్యురాలు వై.ప్రమోద, అల్ హబీబా డిగ్రీ కళాశాల డైరెక్టర్ పి.ముబీనా బేగం ఉన్నారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూ తొలి పాలకమండలి ఏర్పాటు..

కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీకి నూతన (తొలి) పాలక మండలిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో సభ్యులుగా విశాఖపట్నం వరహా ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.రామతీర్థ, తిరుపతి చదలవాడ అరుణ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. పావనీ దామోదర్, పెన్నా చంద్రశేఖర్‌రెడ్డి (తిరుపతి), నవీన్‌కాంత్ (ఆర్కిటెక్చరల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు), రేఖపల్లి కుసుమరవళి (ఆర్కిటెక్చర్ అండ్ ఇంటీరియర్ డిజైన్), సనం నాగేంద్రన్(గుంటూరు కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్) ఉన్నారు.

పాస్‌పోర్ట్‌లపై ప్రకటనలు చట్ట విరుద్ధం

సాక్షి, హైదరాబాద్: ట్రావెల్ సంస్థల ప్రకటనల కోసం పాస్‌పోర్టులను వాడుకోవడంపై విదేశీ వ్యవహారాల శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత పాస్‌పోర్ట్ కవర్ పేజీని ట్రావెల్ ఏజెంట్లు తమ ప్రకటనల స్టిక్కర్లు అంటిస్తున్నారని రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య తెలిపారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమే కాకుండా.. పాస్‌పోర్టు గౌరవాన్ని చులకన చేసినట్టేనని బాలయ్య గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

నారాసురుడే ఇసుకాసురుడు!

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- అన్ని అనుమతులున్న రీచ్‌ల వద్ద టీడీపీ ధర్నాలా?
- నాడు ఉచితం పేరుతో వంశధారను మింగేశారు.. నాగావళిని దోచేశారు
- గోదావరిని పిండేశారు.. కృష్ణా గర్భాన్ని కొల్లగొట్టారు
- ఆ దోపిడీలో ప్రతి నెలా రూ.500 కోట్లు లోకేశ్‌కి వెళ్లేవి
- మహిళా అధికారిని జుట్టు పట్టుకుని దాడి చేసింది ఎవరు?



టీడీపీ హయాంలో ఎమ్మార్వో వనజాక్షిపై జరిగిన దాడి ఘటనను వివరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

సాక్షి, అమరావతి: ఇసుకాసురుడు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబేనని భూగర్భ గనులు, విద్యుత్, అటవీ, పర్యావరణం, శాస్త్ర – సాంకేతిక శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో ఉచితం ముసుగులో కోట్లు దండుకున్న చంద్రబాబుకు ఇసుకపై మాట్లాడే అర్హత లేదన్నారు. చంద్రబాబు హయాంలో జరిగిన ఇసుక దందా – ఇప్పుడు పారదర్శకంగా అమలు చేస్తున్న విధానంపై వాస్తవాలను వివరిస్తూ గురువారం వెలగపూడిలోని సచివాలయంలో మీడియాకు ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏమన్నారంటే..

- రాష్ట్రంలో ఇసుక విధానంపై ఆరోపణలు చేసిన చంద్రబాబు అన్ని అనుమతులున్న ఇసుక రీచ్‌ల వద్దకు వెళ్లి ధర్నాలు చేస్తున్నారు. ఉచిత ఇసుక పేరుతో 19 జీవోలిచ్చి దోచేసిన వారే ఆరోపణలు చేయడం విడ్డూరం. కరకట్టలోని చంద్రబాబు నివాసం వెనక ఇసుక దోపిడీ వాస్తవం కాదా? ఉచిత ఇసుక పేరుతో ఖజానాకు ఎంత సున్నం పెట్టారు? ఉచితం పేరుతో బ్లాక్ మార్కెట్‌ను పెంచి పోషించారు. ప్రజలపై చెప్పలేని భారం మోపారు. ఆయన పాలనలో ఇసుక రేణువంత కూడా పారదర్శకత లేదు.
- చంద్రబాబు హయాంలో ఇసుక అక్రమాలను అడ్డుకున్న అధికారులపై దాడులు చేశారు. ఎమ్మార్వో వనజాక్షిపై దాడి చేసిన చింతమనేని ప్రభాకర్ ఫొటోలు, వీడియోలతో సహా దొరికినా చంద్రబాబు చర్యలు తీసుకోలేదు. పంచాయతీ చేసి ఒక మహిళా అధికారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశారు. మొదట డ్వాక్రా మహిళల పేరుతో ఇసుకను దోచేశాడు. తర్వాత ఉచితం అంటూ దోపిడీకి గేట్లు ఎత్తేశాడు. వంశధారను మింగేశారు. నాగావళిని దోచేశారు. గోదావరిని పిండేశారు. కృష్ణా గర్భాన్ని కొల్లగొట్టి, పెన్నానదిని దోచుకున్న గజదొంగలు చంద్రబాబు ముఠా.
- టీడీపీ నేతలు కూన రవికుమార్, పెందుర్తి వెంకటేష్, జవహర్, బూరుగుపల్లి శేషారావు, చింతమనేని ప్రభాకర్, నారా లోకేష్, శ్రావణ్ కుమార్, దేవినేని ఉమ, తంగిరాల సౌమ్య, కొమ్మాలపాటి శ్రీధర్, శ్రీరాం తాతయ్య, నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజా, అమర్‌నాథ్‌రెడ్డి, బాపిరాజు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఇసుక దోపిడీలో కీలకపాత్ర పోషించారు. ఈ ముఠా అంతా దోపిడీ చేసి కమీషన్లు నారా లోకేశ్‌కు ఇచ్చింది. ప్రతినెలా దాదాపు రూ.500 కోట్లకుపైగా లోకేశ్ జేబుల్లోకి చేరింది. గోదావరి, కృష్ణా నదులు, కృష్ణా జిల్లా ముసునూరు మండలం తమ్మిలేరు, రంగంపేట గ్రామ పరిధిలో, విజయవాడ రూరల్ మండలం సూరాయిపాలెం, కృష్ణాజిల్లా రొయ్యూరు ఇలా చెప్పుకుంటూ పోతే అడుగడుగునా అక్రమ ఇసుక దందా నిర్వహించారు.
- చంద్రబాబు ప్రభుత్వంలో అక్రమ ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ తీవ్రంగా స్పందించి నాడు ఏకంగా రూ.100 కోట్ల జరిమానా విధించింది. అది కూడా చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్ట ప్రాంతంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపైనే ఈ తీర్పు ఇచ్చింది.
- ఏడాదికి 10 కోట్ల టన్నుల ఇసుక తవ్వకాలు, రవాణా జరిగాయని చంద్రబాబు ఆరోపిస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు, రవాణా సాధ్యమా? ఇంత ఇసుకను ఎవరు కొంటారు? లేని రీచ్‌లు ఉన్నాయంటూ, దానిలో అక్రమ తవ్వకాలు జరిగాయంటూ అభూత కల్పనలు చేస్తున్నారు.
- ఇసుక సత్యాగ్రహం పేరుతో టీడీపీ నేతలు డ్రామాలాడుతున్నారు. అనుమతి ఉన్న రీచ్‌లు, యార్డుల వద్ద ఓవరాక్షన్ చేస్తున్నారు. వర్షాకాలంలో పనుల కోసం ఇసుకను నిల్వ చేయడం తప్పా? పనులు జరగాలంటే ఈ మాత్రం ముందు జాగ్రత్తలు తీసుకోరా? ఆ యార్డుల దగ్గరకు వెళ్లి చంద్రబాబు, లోకేశ్ ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారు. రూ.40 వేల కోట్ల దోపిడీ అంటూ వక్రీకరణలకు పాల్పడుతున్నారు. అన్నమయ్య ప్రాజెక్ట్ దెబ్బతినడానికి, ఇసుకకు సంబంధం ఏమిటి? ఇటువంటి ప్రేలాపనలతో చంద్రబాబుకు మతిస్థిమితం లేదని భావించాల్సి వస్తోంది.
- ఇసుక ద్వారా రూ.4 వేల కోట్ల ఆదాయం అని లోకేష్ చెబుతుంటే రూ.40 వేల కోట్లు అని చంద్రబాబు అంటున్నారు. రూ.4 వేల కోట్లు ఇస్తే ఇసుక కాంట్రాక్టును చంద్రబాబుకే ఇస్తాం. చంద్రబాబుకు ఇది మా బంపర్ ఆఫర్.

కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో టెండర్లు

ఇసుక తవ్వకాలపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎంఎస్‌టీసీ ద్వారా టెండర్లను ఆహ్వానించి నిర్వహణ, పర్యవేక్షణ చేపట్టాం. టెండర్లలో ఎవరైనా పాల్గొనేలా వెసులుబాటు కల్పించాం. అత్యంత పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ జరిగింది. అత్యధికంగా బిడ్ కోట్ చేసిన జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్ టెండర్లను దక్కించుకుంది.

చంద్రబాబు, రామోజీ ఎందుకు పాల్గొనలేదు?

ఇసుకపై నిత్యం బురద చల్లుతున్న చంద్రబాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న ఈనాడు అధినేత రామోజీరావు టెండర్లలో ఎందుకు పాల్గొనలేదు? వ్యాపారవేత్తగా ఉన్న రామోజీరావు ఇసుక టెండర్లలో పాల్గొని ఉంటే ఎంత పారదర్శకంగా నిర్వహించామో అర్థమయ్యేది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్లాట్‌ఫామ్‌పై చంద్రబాబు ఎప్పుడైనా టెండర్లను పిలిచారా? టెండర్ దక్కించుకున్నది ఒకటే కంపెనీ. అన్ని అనుమతులతో ఎక్కడైనా సరే ఆ సంస్థే తవ్వకాలు చేస్తుంది.

ప్రభుత్వానికి టన్నుకు రూ.375 ఆదాయం

కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థ ప్రతి టన్నుకు రూ.375 చొప్పున ప్రభుత్వానికి చెల్లిస్తోంది. దీనిపై మరో రూ.100 వేసుకుని టన్ను రూ.475కి అమ్ముకుంటోంది. ఆ రూ.వందలోనే కాంట్రాక్టు కంపెనీ తన కార్యకలాపాలు నిర్వహించుకోవాల్సి ఉంటుంది. మరి ఏదో జరిగిపోతోందనే విధంగా చంద్రబాబు ఎలా ఆరోపణలు చేస్తున్నారు?

ఈ ఆదాయం నాడు ఏమైంది?

ఇసుక టెండర్ల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.765 కోట్లు ఆదాయం. అంటే ఐదేళ్లలో రూ.3,825 కోట్ల ఆదాయం. ఇంత ఆదాయం రాష్ట్ర ప్రభుత్వం కోల్పోతోందని తెలిసినా నాడు ఎందుకు టెండర్లు పిలవలేదు? చంద్రబాబు పరిపాలనలో ఇన్ని వేల కోట్లు ఎక్కడికి వెళ్లాయి? చంద్రబాబు, లోకేష్ జేబుల్లోకే వెళ్లాయి.

పారదర్శకంగా పత్రికల్లో ప్రకటన

మెరుగైన ఇసుక విధానంలో డిపోల వద్ద ఎంత ధరకు విక్రయిస్తున్నారో పారదర్శకంగా పత్రికల్లో ప్రకటనల ద్వారా తెలియచేస్తున్నాం. అంతకంటే ఎక్కువ రేటుకు విక్రయిస్తే ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చాం. అక్రమాలకు పాల్పడితే రూ.2 లక్షల జరిమానా, రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించేలా చట్టాల్లో మార్పులు చేశాం. స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఏర్పాటు చేశాం. దాదాపు 18 వేల కేసులను ఈ బ్యూరో నమోదు చేసింది. 6.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేసింది. ఈ కేసుల్లో చాలా మందికి శిక్షలు కూడా పడ్డాయి. చంద్రబాబు హయాంలో ఇలాంటి చర్యలే లేవు.

జేపీ సంస్థ ద్వారానే ఇసుక తవ్వకాలు

జేపీ సంస్థ ద్వారానే రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ సంస్థ ఎవరికి సబ్ కాంట్రాక్ట్‌కు ఇచ్చుకుంటుందనే దానితో ప్రభుత్వానికి సంబంధం ఉండదు. పర్యావరణ అనుమతులకు అనుగుణంగానే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎన్జీటీ, న్యాయస్థానాల ఉత్తర్వులను గౌరవిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన ఎన్జీటీ నాడు చంద్రబాబు హయాంలో విధించిన రూ.100 కోట్ల జరిమానా రద్దు చేసింది.

60 లక్షల దొంగ ఓట్లను చేర్చిన టీడీపీ..

2018లో.. ఎన్నికలకు ముందుగా 60 లక్షల దొంగ ఓట్లను టీడీపీ నేతలు చేర్చారు. రాష్ట్రంలో 3.30 కోట్ల ఓట్లు ఉండగా వాటిని 3.90 కోట్లకు పెంచారు. పెద్ద ఎత్తున దొంగ ఓట్లను పెంచింది చంద్రబాబే. ఇప్పుడు పరిశీలనలో ఈ దొంగ ఓట్లు బయటపడుతున్నాయి. వాటిని ఎన్నికల కమిషన్ దృష్టికి తెస్తుంటే చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. దొంగ ఓట్లను తొలగించకుండా హడావుడి చేస్తున్నారు. కుప్పంలో మున్సిపల్ ఎన్నికల సమయంలో 12 వేల దొంగ ఓట్లను తొలగించాం. చంద్రబాబు కూడా దానిపై మాట్లాడలేదు. ప్రజలు స్వేచ్ఛగా ఓట్లను వేసుకోవాలి. దొంగ ఓట్లు ఉండకూడదు. నిబంధనల ప్రకారమే దొంగ ఓట్లను తొలగిస్తున్నారు.

బాబు ప్రశ్నలు - వాస్తవాల

నాలుగున్నరేళ్లలో 6.70 కోట్ల టన్నుల ఇసుకను తవ్వారు. మొత్తం రూ.2,300 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. జీఎస్టీని కేంద్ర విభాగాలు చూసుకుంటాయి. కాంట్రాక్టు ఏజెన్సీ జీఎస్టీ చెల్లింపులు చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 136 స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వాటిల్లో 64 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉంది. రాష్ట్రంలో పర్యావరణ అనుమతులు ఉన్న రీచ్‌లు 110 ఉన్నాయి. వాటిల్లో 77 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతి ఉంది. వరదలు, వర్షాల వల్ల కొన్ని చోట్ల తాత్కాలికంగా ఓపెన్ రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఇక 42 డీసిల్టింగ్ పాయింట్లు ఉన్నాయి. వీటి ద్వారా 90 లక్షల ఇసుక తవ్వకాలు చేసుకునేందుకు అనుమతులున్నాయి. సెమీ మెకనైజ్డ్ పద్ధతుల్లో జరుగుతున్న తవ్వకాలను నిలిపివేసి తాజాగా ఈసీలు పొందాలని ఎన్జీటీ ఆదేశించింది. ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టింగ్ ఏజెన్సీపై ఎన్జీటీ విధించిన రూ.18 కోట్ల జరిమానాను సుప్రీంకోర్టు నిలిపివేసింది.



కరకట్టపై చంద్రబాబు నివాసం సమీపంలోనే గతంలో అక్రమ ఇసుక తవ్వకాలు



చంద్రబాబు ఇంటి సమీపంలో ఇసుక లారీల క్యూ



టీడీపీ హయాంలో కృష్ణా జిల్లా రొయ్యూరులో అక్రమంగా నిల్వ చేసిన భారీ ఇసుక డంప్



చంద్రబాబు హయాంలో కృష్ణా నది గర్భంలో డ్రెడ్జింగ్ చేసి ఇసుక తరలింపు



టీడీపీ హయాంలో ఇసుక మాఫియా గురించి జాతీయ పత్రికలో వచ్చిన వార్త

నేడు పారదర్శకంగా ఇసుక

అధికారం చేపట్టిన వెంటనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇసుక మాఫియాకు చెక్ పెట్టి నూతన విధానాన్ని తెచ్చారు. ప్రజలకు అందుబాటు ధరలో ఇసుక లభించేలా చర్యలు తీసుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. అత్యంత పారదర్శకమైన ఇసుక విధానంపై 4.9.2019న రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్లు 70, 71 ద్వారా ఉత్తర్వులు ఇచ్చింది. ఇసుక విధానంలోని లోటుపాట్లను సవరించేందుకు 17.7.2022న మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రజల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదించింది. దీనిపై 12.11.2020న జీవో 78 జారీ చేశాం. వాటిలో కొన్ని నిబంధనల్లో మార్పు చేస్తూ 16.4.2021న జీవో 25 ఇచ్చాం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఇసుక విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకున్నాం. నిర్మాణ రంగానికి సీఎం జగన్ అండగా నిలిచారు. వర్షాకాలంలో ఇసుక కొరత లేకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎండాకాలంలోనే స్టాక్ యార్డుల్లో ఇసుకను నిల్వ చేయించారు. తద్వారా వర్షాకాలంలోనూ ఇసుక లభించేలా ఏర్పాట్లు చేశారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. చెక్‌పోస్టులతో నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం.



సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో మైనింగ్ ఆదాయంలో వృద్ధిని వివరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ర్యాలీ కుదరదు.. షరతులకు లోబడే సభ

- సీపీఎస్ ఉద్యోగుల సంఘానికి హైకోర్టు స్పష్టీకరణ
- ప్రైవేటు స్థలంలో సభ పెట్టినా షరతులు వర్తిస్తాయి
- నిర్దిష్ట సంఖ్యలోనే సభలో పాల్గొనాలి
- సెప్టెంబర్ 1న అనుమతినివ్వలేం
- మరో తేదీ చెప్పాలని స్పష్టీకరణ
- విచారణ నేటికి వాయిదా
- విద్యుత్ కార్మికులు సెలవు రోజుల్లోనే ధర్నా చేయాలి

సాక్షి, అమరావతి : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) పునరుద్ధరించాలన్న డిమాండ్‌తో తలపెట్టిన బహిరంగ సభకు హైకోర్టు షరతులు విధించింది. ఈ షరతులకు లోబడే సభ నిర్వహించాలని ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘానికి తేల్చి చెప్పింది. ర్యాలీకి అనుమతినిచ్చే ప్రసక్తే లేదంది. సంఘం నిర్ణయించిన సెప్టెంబర్ 1న సభకు అనుమతించలేమని, మరో తేదీ చెప్పాలని ఆదేశించింది. ప్రైవేటు స్థలంలో సభకు షరతులు వర్తించవంటే కుదరదని స్పష్టం చేసింది. ప్రైవేటు స్థలంలోనైనా షరతులకు లోబడే సభ నిర్వహించాలని చెప్పింది. ఛలో విజయవాడ పేరుతో ఉద్యోగ సంఘాలు ముద్రించిన కరపత్రంలో 4 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులున్నట్లు పేర్కొన్నారని, ఇంత పెద్ద స్థాయిలో సమావేశానికి పిలుపునిచ్చినప్పుడు షరతులకు కట్టుబడి ఉండాల్సిందేనని తెలిపింది. నిర్దిష్ట సంఖ్యలో మాత్రమే ఉద్యోగులు సభలో పాల్గొనేందుకు అనుమతిస్తామని తేల్చి చెప్పింది. షరతులను ఉల్లంఘించి సమావేశం నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే వెసులుబాటును పోలీసులకు ఇస్తామంది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీపీఎస్‌ను రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ డిమాండ్‌తో సెప్టెంబర్ 1న విజయవాడలో ర్యాలీ, బహిరంగ సభకు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. 1000 మందితో జింఖానా గ్రౌండ్స్‌లో బహిరంగ సభకు అనుమతి కోరుతూ సంఘం కార్యదర్శి హుస్సేన్ పోలీసులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సభకు పోలీసులు అనుమతిని నిరాకరించారు. దీంతో సంఘం ప్రైవేటు స్థలంలో సభకు పోలీసుల అనుమతి కోరింది. అయితే పోలీసులు ఎలాంటి నిర్ణయం చెప్పకపోవడంతో సంఘం కార్యదర్శి హుస్సేన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపిస్తూ.. ప్రైవేటు స్థలంలో సభకు అనుమతులు అవసరం లేదన్నారు. కేవలం 1,000 మందితో సభ నిర్వహిస్తామని, 4 లక్షల మంది ఉద్యోగులు పాల్గొనరని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది (హోం) వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. సీపీఎస్ ఉద్యోగుల సంఘంలో 4 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లు కరపత్రంలో ముద్రించారన్నారు. శాంతిభద్రతల సమస్యను సృష్టించే ప్రమాదం ఉన్నందునే జింఖానా గ్రౌండ్స్‌లో సభకు అనుమతించలేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి ర్యాలీకి అనుమతినిచ్చేది లేదని చెప్పారు. సభ తాము విధించే షరతులకు లోబడే ఉండాల్సిందన్నారు. మరో తేదీని తెలియజేస్తే దానినిబట్టి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

విద్యుత్ కార్మికుల ధర్నాకూ హైకోర్టు షరతులు

విద్యుత్ కార్మిక సంఘాల ధర్నాకు కూడా హైకోర్టు షరతులతో కూడిన అనుమతిని ఇచ్చింది. సెలవు రోజుల్లో మాత్రమే ధర్నా చేయాలని, తాము నిర్దేశించిన సంఖ్యకు మించి ఉద్యోగులు పాల్గొనడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ధర్నాలో పాల్గొనే ఉద్యోగులందరూ వారం ముందుగానే ఆధార్ కార్డులను పోలీసులకు సమర్పించాలని స్పష్టం చేసింది. రెండు గంటల్లో ధర్నా, నిరసన ముగించేలా ఆదేశాలిస్తామంది. ధర్నాను ఏ రోజున చేపడతారో నిర్ణయించి, తమకు చెప్పాలని నిర్వాహకులను ఆదేశించింది. దాని ఆధారంగా తగిన షరతులతో ఆదేశాలు జారీ చేస్తామంది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ డిమాండ్ల సాధనకు విజయవాడ ధర్నా చౌక్ లేదా జింఖానా గ్రౌండ్స్‌లో ధర్నా, నిరసన కార్యక్రమానికి అనుమతినిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ పలు వామపక్ష విద్యుత్ కార్మిక సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాది నల్లూరి మాధవరావు వాదనలు వినిపిస్తూ.. తాము ధర్నా మాత్రమే చేస్తున్నామని, సమ్మెకు దిగడం లేదని చెప్పారు. అందువల్ల ఎస్మా వర్తించదని తెలిపారు. ధర్నా వల్ల విద్యుత్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండబోదన్నారు. ప్రభుత్వ న్యాయవాది (హోం) వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. విద్యుత్ ఉద్యోగులు ఎస్మా పరిధిలోకి వస్తారని, ఎలాంటి నిరసనలు, ఆందోళనలు చేపట్టడానికి వీల్లేదన్నారు. అందువల్ల వీరి ధర్నా, నిరసనకు అనుమతులు ఇవ్వొద్దని కోర్టును అభ్యర్థించారు.

వివాదాస్పదమైన పైలాన్ ఆవిష్కరణ

- చిత్రపటంలోని లోకేశ్ కాళ్ల వద్ద పూర్ణకుంభంపై ప్రజాగ్రహం
- వైఎస్సార్‌సీపీపై అనుచిత వ్యాఖ్యలు.. లోకేశ్ దిష్టిబొమ్మ దగ్ధం



పవిత్ర పూర్ణకుంభాన్ని లోకేశ్ చిత్రపటంలోని కాళ్ల వద్ద ఉంచి పూజలు నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం/జంగారెడ్డిగూడెం : యువగళం పాదయాత్ర సందర్భంగా గురువారం సీతంపేట వద్ద నారా లోకేశ్ ఆవిష్కరించిన పైలాన్ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. పాదయాత్ర 200వ రోజుకు చేరిన నేపథ్యంలో సీతంపేటలో పైలాన్ నిర్మించారు. ఈ సందర్భంగా 35 అడుగుల ఎత్తులో లోకేశ్ ఫొటోతో కూడిన మెటల్ పైలాన్‌ను ఏర్పాటుచేశారు. చిత్రపటంలోని లోకేశ్ కాళ్ల వద్ద పూర్ణకుంభాన్ని ఉంచి పూజలు నిర్వహించి పైలాన్‌ని ప్రారంభించడం వివాదాస్పదమైంది. ఈ క్రమంలో ప్రజలు తమ మనోభావాలను దెబ్బతీసేలా కార్యక్రమం నిర్వహించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమం రసాభాసగా మారింది.

అంబులెన్స్‌కు దారి ఇవ్వని తమ్ముళ్లు

యువగళం పాదయాత్ర పేరిట లోకేశ్ గురువారం చేపట్టిన కార్యక్రమం ఏలూరు జిల్లా నరసన్నపాలెం వై.జంక్షన్ నుంచి పొంగుటూరు వరకు కొనసాగింది. పాదయాత్ర కొనసాగుతుండగా అంబులెన్స్ వాహనాలకు తెలుగు తమ్ముళ్లు దారి ఇవ్వకపోవడంతో స్థానిక ప్రజలు పోలీసుల సహాయంతో మార్గం సుగమం చేశారు. అలాగే, పాదయాత్రలో లోకేశ్‌తోపాటు తల్లి భువనేశ్వరి విక్టరీ సింబల్ కాకుండా కామ్రేడ్స్ మాదిరిగా పిడికిలి బిగించి అభివాదం చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

బూచోడిలా లోకేశ్..

పాదయాత్రలో ఓ ఆసక్తికర ఘటన కూడా చోటుచేసుకుంది. బయ్యనగూడెం సమీపంలో రామకోనేరు వద్ద ఓ మహిళ తన చిన్నారితో నిలబడి ఉండగా.. లోకేశ్ వారి వద్దకు వెళ్లి బూచోడు మాదిరిగా హావభావాలు ప్రదర్శించారు.



దీంతో ఆ చిన్నారి ఒక్కసారిగా ఏడుపు అందుకుంది. ఆ తర్వాత స్థానికులు వైఎస్ జగన్ చిన్నారులపట్ల చూపించే ఆప్యాయత గురించి చర్చించుకుంటూ లోకేశ్‌పై ఛలోక్తులు విసరడం కనిపించింది. మరోవైపు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు సీతంపేటలో లోకేశ్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అలాగే, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లోకేశ్ దిష్టిబొమ్మను గాడిదపై ఊరేగించి దగ్ధంచేశారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
శుక్రవారం ॥ 1-9-2023


ఫ్యాషన్




* ఆభరణం

ముక్కున సింగారం





ఆభరణాలు ఎన్ని ఉన్నా, ఆ ఒక్క అలంకారం తక్కువైతే అందానికి పరిపూర్ణత చేకూరదు. ఆ ఒక్కటే ముక్కుపుడక లేదా ముక్కెర. వేడుకలలో ప్రత్యేకంగా వెలిగిపోతూ నోస్‌పిన్‌గా స్టైల్‌లో తనదైన శైలిని చూపుతూ మురిపెంగా మెరిసిపోయే ముక్కున సింగారపు వేడుకలకు ప్రత్యేకం.



వ్యక్తిగత శైలికి బలమైన ప్రతిబింబంగా నిలిచే ముక్కెర ఎంపిక కోసం కొన్ని కసరత్తులు చేయాల్సిందే. గుండ్రని ముఖం ఉన్న మహిళలు పొడవుగా ఉండే నోస్‌రింగ్ ఎంచుకోవడం మంచిది. అలాగే, ముఖం కోలగా ఉండేవారు గుండ్రని నోస్పిన్ డిజైన్స్ ఎంచుకుంటే మరింత ప్రత్యేకంగా కనిపిస్తారు.

■ సంప్రదాయంలో మెరుపు



బ్రైడల్ కలెక్షన్‌లో భాగంగా స్వచ్ఛమైన బంగారు, డైమండ్ ముక్కు ఆభరణాలను ఎంచుకుంటుంటారు. అయితే గ్రాండ్‌గా ఉండేందుకు బంగారం, డైమండ్, ముత్యాలు, ఇతర రత్నాలతో ఉండే ముక్కెరలను ఎంచుకోవచ్చు. ఇటీవల బ్రైడల్ నోస్ రింగ్స్‌లో డిజైన్స్ సందర్భానికి తగ్గట్టుగా ఉంటున్నాయి.

❁ ఆధునిక శైలి



వృత్తి, ఉద్యోగాలలో ఉంటున్న మహిళలైతే ఎలాంటి హంగులూ లేని సింపుల్ డిజైన్స్ ఇష్టపడుతుంటారు. అయితే, ఇటీవలి కాలంలో డ్రెస్సులకు తగినట్టు మార్చుకోగలిగే ట్రెండింగ్ డిజైన్స్‌ను ఎంచుకుంటున్నారు. వీటిలో అన్ని రకాల స్టోన్స్‌కు మాత్రమే కాదు సిల్వర్, స్టీల్ నోస్‌రింగ్స్‌కు ఓటేస్తున్నారు. వీటిలో సెంట్రల్ నోస్ రింగ్స్ మరింత ట్రెండీగా మారాయి.

❁ రాష్ట్రాల వారీగా...



మహారాష్ట్రీయుల ముక్కెర చంద్రవంక లేదా జీడిపప్పు ఆకారాన్ని పోలి ఉంటుంది. ముత్యాలూ, వజ్రాలు, రాళ్లు, పూసలు జత చేసి ఉంటాయి. మహారాష్ట్ర పెళ్లికూతురు కేవలం ముక్కెర కోసమే వధువు కావాలని కోరుకునేంత అందంగా ఉంటుంది. హిమాలయ ప్రాంతాల మహిళలు బులక్ అనే పేరున్న వెడల్పాటి నోస్ రింగ్స్‌ను ఎంచుకుంటారు.

పంజాబీయుల నథ్ అనే పేరు గల ముక్కు ఉంగరాలు చాలా తేలికగా ఉంటాయి. గుజరాత్, రాజస్థాన్ మహిళల నోస్ రింగ్స్ కూడా నథ్ లేదా నాథూరి అని పిలిచే నోస్ రింగ్స్‌ను పోలి ఉంటాయి. ఇవి బంగారం లేదా వెండితో ఉంగరంలా తయారుచేస్తారు. వీటిలో విలువైన రత్నాలను పొదుగుతారు. వేడుకలలో ధరించేవి పెద్దవిగా ఉంటాయి. ముక్కు నుంచి జుట్టుకు జత చేసే గొలుసు ఉన్న నోస్ రింగ్స్‌ను కూడా వాడుతుంటారు. ఇవి బ్రైడల్, ప్రత్యేక సంప్రదాయ వేడుకల అలంకారాలలో కనిపిస్తుంటాయి. ప్రాచీన భారతీయ రాజకుటుంబీకులు వీటిని ధరించేవారు. ఆ తర్వాతి కాలాల్లో పెళ్లి కూతురు అలంకరణలో భాగమైంది. ఉత్తరాఖండ్ మహిళల ఆభరణాల్లో నోస్ రింగ్‌ను టిహ్రీ నథ్ అని పిలుస్తారు. దీని అలంకారం అద్భుతంగా చెప్పుకుంటారు. ఈ నోస్ రింగ్‌లో విలువైన కెంపులు, ముత్యాలతో పొదిగిన వెడల్పాటి బంగారు తీగ ఉంటుంది. నెమలి డిజైన్స్ కూడా ఇందులో చూస్తాం. ఇక్కడి వివాహిత మహిళలు ఈ నోస్ రింగ్‌ను శుభప్రదంగా భావిస్తారు. ఆభరణాల కళాత్మకతలో ఈ నోస్ రింగ్‌ను ప్రత్యేకంగా చెప్పుకుంటారు. తామర పువ్వు, హంస ఆకారంలో ఉన్న ముక్కెరలు గోవా, కొంకణ్ ప్రాంతాల వధువులు ఎంపిక చేసుకుంటారు. ఈ డిజైన్స్ కర్నాటక, కేరళలో కూడా ధరిస్తారు.





❁ దక్షిణాన శాశ్వతం

తెలుగు, తమిళ, కన్నడ రాష్ట్రాలలో ముక్కు ఉంగరాల కన్నా స్టడ్స్‌కే ప్రాధాన్యత. డైమండ్స్, కెంపులు, బంగారంతో తయారు చేసినవి ఉంటాయి. దక్షిణ భారత దేశాన ముక్కుపుడక ఒక శాశ్వత ఎంపికగా ఉంటుంది. ముక్కుపుడక అందం వారి అనుభవంతో కలిసి ప్రకాశిస్తుందా అన్నట్టుగా ఉంటుంది.



లీడర్



యువ బృందంతో భాగ్యశ్రీ

'ఇరవై ఏళ్ల వరకూ మా ఇంట్లో బల్బు చూళ్లేదు' అంటుంది భాగ్యశ్రీ. మహారాష్ట్రలో నక్సల్ ప్రభావిత గడ్చిరోలి జిల్లాలోని తమ గూడేనికి చాలా కాలం పాటు సర్పంచ్‌గా ఎవరూ నిల్చునే ధైర్యం చేయలేదు. సమస్యలు తీర్చేవారూ లేరు. 'చివరకు నేనే సర్పంచ్ అవుదామని నిశ్చయించుకున్నా' అంది భాగ్యశ్రీ. 24 ఏళ్ల ఈ గిరిజన నాయకురాలు తన వారి కోసం పని చేస్తున్న తీరు ప్రతి అణగారిన సమూహానికి చూపుతున్న మార్గం చాలానే ఉంది.

గూడేనికి వెలుతురు నువ్వమ్మా



గ్రామస్తులను చైతన్యవంతం చేస్తూ...

మహారాష్ట్రలో ముంబై, పూణె వంటి నగరాలది ఒక ప్రపంచమైతే గడ్చిరోలి వంటి నక్సల్ ప్రభావిత గిరిజన ప్రాంతాలది మరో ప్రపంచం. 'మహారాష్ట్రకు ఊపిరితిత్తి' అని పిలిచే ఈ ప్రాంతమంతా దట్టమైన అడవి, గిరిజన ఆవాసాలతో ఉంటుంది. అయితే నక్సలైట్ల ప్రభావం వల్ల, గిరిజనులనే నిర్లక్ష్యం వల్ల దారుణమైన వెనుకబాటుతనం ఇక్కడ ఉంటుంది. 'మా గూడెంలో నాకు ఇరవై ఏళ్లు వచ్చే వరకూ కరెంటు లేదు. మా ఇంట్లో బల్బు వెలగడం చూళ్లేదు' అంటుంది 24 ఏళ్ల భాగ్యశ్రీ లక్ష్మి. గడ్చిరోలి అడవుల్లో అత్యధిక సంఖ్యలో ఉండే మడియా తెగకు చెందిన ఈ చదువుకున్న అమ్మాయి తన సొంతగూడెం 'కొటి' పంచాయితీ కింద ఉన్న 9 గ్రామాలకు సర్పంచ్. ఈ ప్రాంత గిరిజనుల జీవితాలకు ఒక ఆశాదీపం.

> గిరిజనులకు కొన్ని విశ్వాసాలుంటాయి. వారు అన్ని మాటలు వినరు. వారిని ఒప్పించి అభివృద్ధివైపు నడిపించడమే పెద్ద సవాలు. బయటవారు నాయకులు కావడం కంటే లోపలివారు నాయకులైతేనే అది సులభం. ఎవరి సమూహాల మేలు వారే చూసుకోవాలి.

■ సర్పంచ్ లేని ఊరు

భాగ్యశ్రీ లక్ష్మి పుట్టి పెరిగిన 'కొటి' గూడేనికి 2003 నుంచి సర్పంచ్ లేదు. ఎందుకంటే నక్సల్ ప్రభావం వల్ల ఏ సమస్యో అని ఎవరూ నిలబడలేదు. దాంతో ఆ ప్రాంతమంతా అనేక సమస్యలు పేరుకుపోయాయి. బాల్య వివాహాలు, చదువు మానేయడం, నక్సల్ అనే అనుమానంతో అమాయక గిరిజన యువకులను ఏళ్ల తరబడి జైళ్లల్లో పడేయడం.. ఇదీ అక్కడ జరుగుతున్నది. డాక్టర్లు పొరపాటున కూడా రారు. అదేమంటే రోడ్లు లేవంటారు. రోడ్లు వేయమని అధికారుల దగ్గరకు వెళితే వారు మరేవో సమస్యలు చెప్తారు. 'ఇవన్నీ చూసి చూసి విని విని నేనే సర్పంచ్‌గా మారి ఏదో ఒకటి చేద్దామని బయలుదేరాను' అంటుంది భాగ్యశ్రీ లక్ష్మి.

■ నేనొచ్చాను

భాగ్యశ్రీ లక్ష్మి తల్లి అంగన్‌వాడి టీచర్. తండ్రి ప్రభుత్వ టీచర్. అందుకే భాగ్యశ్రీని చదివించారు. 'చంద్రాపూర్‌లో బి.ఏ. ఫిజికల్ ఎడ్యుకేషన్ చదివాను. మంచి వాలీబాల్ ప్లేయర్‌ని నేను. టీచింగ్ రంగంలోకి వెళదామనుకున్నాను. కాని నా చదువు నాకు మాత్రమే ఉపయోగపడితే ఎలా? నా వారికి ఏదైనా చేయాలని సర్పంచ్ అయ్యాను. ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నారు' అంది భాగ్యశ్రీ. అయితే ఆమెకు పదవి రావడాన్ని ఊహించని కొంతమంది మగవారు భాగ్యశ్రీ పదవీ స్వీకారం రోజు ఆమెతో దురుసుగా వ్యవహరించారు. మైక్ తీసుకొని మాట్లాడబోతే మాట్లాడనివ్వలేదు. అసభ్యంగా ప్రవర్తించారు. 'నేను ఇంటికొచ్చి చాలా ఏడ్చాను. అయితే మా అమ్మ– నువ్వు ఇక మీదట మామూలు భాగ్యశ్రీగా ఉండకు. ఒక నాయకురాలు ఎలా ఉంటుందో అలా ఉండు' అని ధైర్యం చెప్పింది. ఆ క్షణమే నేను గట్టిగా నిలబడాలనుకున్నాను' అంటుంది భాగ్యశ్రీ.

■ బైక్ మీద తిరుగుతూ...

ప్రతి ఉదయం టీ తాగి బైక్ మీద తిరుగుతూ తన అజమాయిషీలో ఉన్న గ్రామాల సమస్యలు పరిష్కరిస్తోంది భాగ్యశ్రీ. ఆమె సర్పంచ్ అయ్యాక గూడెల్లోని తల్లిదండ్రులతో పోట్లాడి మొదటగా చేసిన పని బాల్యవివాహాలు మాన్పించడం... బాలికలను హాస్టళ్లకు పంపి చదివించడం... స్కూళ్లలో తిరిగి చేరేలా చేయడం, టాయిలెట్లు నిర్మించడం... 'నా కింద తొమ్మిది గ్రామాల్లో ఆరింటికి కరెంటు తెప్పించాను' అని తెలిపిందామె. 'అధికారులు ఏది అడిగినా నక్సల్స్ సమస్యను సాకుగా చూపుతారు. ప్రజల సమస్యలను నిజంగా పరిష్కరిస్తే నక్సల్స్ అడ్డుపడరు' అంది. 'గిరిజనులకు కొన్ని విశ్వాసాలుంటాయి. వారు అన్ని మాటలూ వినరు. వారిని ఒప్పించి అభివృద్ధివైపు నడిపించడమే పెద్ద సవాలు. బయటవారు నాయకులు కావడం కంటే లోపలివారు నాయకులైతేనే అది సులభం. ఎవరి సమూహాల మేలు వారే చూసుకోవాలి' అంటుంది భాగ్యశ్రీ.

న్యూస్ మేకర్

విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువును మాత్రమే కాదు... సమాజాన్ని కూడా లోతుగా చదివే వారే ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా గెలుపు జెండా ఎగరేయగలరని నిరూపించారు 'కలైదోఫిన్' కో-ఫౌండర్, సీయివో సుచరిత ముఖర్జీ, 'అప్నాక్లబ్' సీయీవో శ్రుతి. తాజాగా... ఫోర్బ్స్ ఆసియా '100 టు వాచ్' వార్షిక జాబితాలో ఆరు భారతీయ కంపెనీలు చోటు చేసుకున్నాయి. వాటిలో 'కలైదోఫిన్' 'అప్నాక్లబ్'లు ఉన్నాయి..

సుచరిత సుమధుర శ్రుతి



'కలైదోఫిన్' కో–ఫౌండర్, సీయీవో సుచరిత 'అప్నా క్లబ్' సీయీవో శ్రుతి

అయిదుగురు కుటుంబ సభ్యుల పోషణ బాధ్యతను తలకెత్తుకున్న చెన్నైకి చెందిన రమణీ శేఖర్ దినసరి కూలీ. రోజుకు రెండు వందల రూపాయల వరకు సంపాదిస్తుంది. కంటిచూపు కోల్పోవడంతో భర్త ఇంటికే పరిమితం అయ్యాడు. కొడుకు, కూతురు కాస్తో కూస్తో చదువుకున్నారు గానీ ఏ ఉద్యోగమూ చేయడం లేదు. వీరితో పాటు తల్లి పోషణ భారం కూడా తనదే. ఒక విధంగా చెప్పాలంటే నెలాఖరుకు పైసా మిగలడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా 'కలైడోఫిన్' పేరు మీద అయిదు వందల రూపాయలు పొదుపు చేయడం మానలేదు రమణి.

'అత్యవసర పరిస్థితుల్లో వైద్య అవసరాల కోసం ఈ డబ్బును ఉపయోగిస్తాను' అంటున్న రమణి కొంత డబ్బును సెల్ఫ్–హెల్ప్ గ్రూప్ సేవింగ్ స్కీమ్స్‌లో కూడా పెడుతుంది.

'రమణిలాంటి ఎంతోమంది పేదవాళ్లకు కష్ట సమయంలో కలైడోఫిన్ అండగా ఉంది' అంటుంది ఫిన్‌టెక్ కంపెనీ 'కలైడోఫిన్' కో–ఫౌండర్, సీయీవో సుచరిత ముఖర్జీ.

దీర్ఘకాల, మధ్యకాల, స్వల్పకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఉడాన్, లక్ష్య, ఉమ్మిద్ అనే ప్యాకేజీలను లాంచ్ చేసింది కలైడోఫిన్.

'కలైడోఫిన్' ప్యాకేజిలలో ఒకటైన 'లక్ష్య'ను పేద ప్రజల ఆరోగ్యం, చదువు, వివాహాన్ని దృష్టిలో పెట్టుకొని రెండు నుంచి నాలుగు సంవత్సరాల కాలపరిమితితో రూపొందించారు. ఈ ప్యాకేజీలో మరణం లేదా అంగవైకల్యానికి బీమా ఉంటుంది.

'తమ ఆర్థిక స్థాయిని బట్టి ఎవరైనా సరే వెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీసులతో యాక్సెస్ కావచ్చు' అంటూ దిగువ మధ్యతరగతి, పేదవర్గాలకు భరోసాతో బయలుదేరింది కలైడోఫిన్. చెన్నై కేంద్రంగా ప్రారంభమైన ఈ ఫిన్‌టెక్ కంపెనీ అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందింది.

వ్యాపారవేత్తకు కేవలం వ్యాపార దృష్టి మాత్రమే కాదు సాధ్యాసాధ్యాలకు సంబంధించి వినియోగదారుల దృష్టి నుంచి కూడా ఆలోచించాలి. ఈ విషయంలో తగిన అధ్యయనం చేసింది సుచరిత.

ఢిల్లీ యూనివర్శిటీలో ఎకనామిక్స్‌లో డిగ్రీ, ఐఐఎం, అహ్మదాబాద్‌లో ఎంబీఏ చేసిన సుచరిత ఐఎఫ్‌ఎంఆర్ ట్రస్ట్ గ్రూప్ కంపెనీలలో ఉన్నత హోదాలలో పనిచేసింది. ఆ తరువాత 'కలైడోఫిన్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం ప్రారంభించింది.

• • •

శ్రుతి తండ్రి ఐఏఎస్ అధికారి. అయినప్పటికీ ఆయనకు ఆడపిల్లల విషయంలో 'అయ్యో!'లు తప్పలేదు.

'పాపం ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే' అని లేని బాధను కొని తెచ్చుకునేవారు చుట్టాలు, పక్కాలు.

స్కూల్ నుంచి కాలేజీ రోజుల వరకు ఎన్నోసార్లు లింగవివక్షతను ఎదుర్కొంది శ్రుతి.

ఆత్మవిశ్వాసం ఉన్నా తప్పే లేకున్నా తప్పే అన్నట్లుగా ఉండేది పరిస్థితి. ఆత్మవిశ్వాసం ఉంటే 'అంత వోవర్ కాన్ఫిడెన్సా?' అని వెక్కిరింపు. లేకపోతే 'అంత ఆత్మన్యూనతా!' అని చిన్నచూపు. ఇలాంటి పరిస్థితులను తట్టుకొని పెద్ద ప్రయాణమే చేయాల్సి వచ్చింది శ్రుతి. అయితే ఆ ప్రయాణంలో ఆమె ఎప్పుడూ ఆగిపోలేదు. ఐఐటీ–ఢిల్లీలో ఎం.టెక్. పూర్తిచేసిన శ్రుతి ఉద్యోగం చేయాలనుకుంది. ఆ తరువాత 'ఉద్యోగం చేయగలనా?' అని కూడా అనుకుంది. దీనికి కారణం... తన స్వతంత్ర వ్యక్తిత్వం.

'నీకు చాలా కోపం' అనే మాట చాలాసార్లు విన్నది.

'ఆవేశంతో కనిపించే వాళ్లకు సాధించాలనే కసి ఎక్కువగా ఉంటుంది' అనే మాట కూడా విన్నది. 'అప్నాక్లబ్' రూపంలో అది తన విషయంలో నిజమైంది.

వ్యాపారంలో రాణించాలనుకున్న శ్రుతి హార్వర్డ్ బిజినెస్ స్కూల్(హెచ్‌బీఎస్)లో ఎంబీఏ చేసింది. ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత 'సైర్' పేరుతో ట్రావెల్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. అయితే అది తనకు చేదు అనుభవాన్ని నేర్పించడమే కాకుండా తియ్యటి పాఠాలు నేర్పింది. చిన్న పట్టణాలకు చెందిన వాళ్లు ఎఫ్‌ఎంసీజీ(ఫాస్ట్–మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) ప్రొడక్స్ కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారనే విషయం గ్రహించిన శ్రుతి 'అప్నాక్లబ్' పేరుతో ఎఫ్‌ఎంసీజీ హోల్‌సేల్ ప్లాట్‌ఫామ్‌ను మొదలు పెట్టింది. సెమీ–అర్బన్, గ్రామీణ ప్రాంతాల కస్టమర్‌ల నుంచి మంచి స్పందన వచ్చింది.

'పరవాలేదు' అనుకుంటున్న సమయంలో కంపెనీ వేగంగా దూసుకుపోవడం మొదలైంది. టైగర్ గ్లోబల్, ట్రూ స్కేల్ క్యాపిటల్, ఫ్లోరిష్ వెంచర్స్, వైట్‌బోర్డ్ క్యాపిటల్... బ్యాకర్స్‌గా 'అప్నాక్లబ్' శక్తిమంతంగా తయారైంది. అంతర్జాతీయ స్థాయిలో మెరిసిపోతోంది.

'నీకున్న ఆవేశానికి ఉద్యోగం చేయడం కష్టం. వ్యాపారం చేయడం అంత కంటే కష్టం' అనే మాటను ఎన్నోసార్లు విన్నది శ్రుతి.

ఇప్పుడు అలాంటి మాటలు ముఖం చాటేశాయి.

'ఏదో సాధించాలనే గట్టి తపన, సంకల్పబలం ఉన్న మహిళ' అనే ప్రశంసపూర్వకమైన మాటలు 'అప్నాక్లబ్' సీయీవో శ్రుతి గురించి తరచు వినిపిస్తున్నాయి.

వంటిల్లు





కృష్ణుడు వెన్న దొంగ ఎందుకయ్యాడు?
వెన్న... రుచి అందర్నీ దొంగల్ని చేస్తుంది.
మరి... వెన్నతో చేసిన రుచులు?
కలాకండ్... మఖ్ఖన్ మిశ్రీ...
కేసర్ శ్రీఖండ్... గోపాల్ కాలా.
కృష్ణాష్టమి వస్తోంది.
పాలు... పెరుగు... వెన్న...
మీగడలు సిద్ధం చేసుకోండి.
పాత్ర పెట్టండి... స్టవ్ వెలిగించండి.
వండే లోపు వెన్న మాయవుతుందేమో!
ఎక్కువ వెన్న తెచ్చుకోండి!!

వెన్న దొంగ రుచులు



గోపాల్‌కాలా

కావలసినవి: **అటుకులు** – కప్పు, **పెరుగు** – అర కప్పు, **కీర ముక్కలు** – కప్పు, **తాజా కొబ్బరి తురుము** – 3 టేబుల్ స్పూన్‌లు, **అల్లం తురుము** – టీ స్పూన్, **పచ్చి మిర్చి** – 1 (తరగాలి), **తరిగిన కొత్తిమీర** – అర కప్పు, **దానిమ్మ గింజలు** – టేబుల్ స్పూన్, **కిస్‌మిస్** – టేబుల్ స్పూన్, **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి. **పోపు కోసం:** **వెన్న** – టేబుల్ స్పూన్, **ఆవాలు** – అర టీ స్పూన్, **జీలకర్ర** – అర టీ స్పూన్, **కరివేపాకు** – 2 రెమ్మలు, **పచ్చి మిర్చి** – 1 (తరగాలి), **ఇంగువ** – చిటికెడు (టీ స్పూన్‌లో ఎనిమిదో వంతు).

తయారీ: అటుకులను నీటిలో వేసి కడిగి వెంటనే తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. అందులో అడుగున చేరిన నీటిని కూడా పూర్తిగా వంపేయాలి. ● శుభ్రం చేసిన అటుకులు, కీర ముక్కలు, కొబ్బరి తురుము, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం తరుగు, దానిమ్మ గింజలు, కిస్‌మిస్, కొత్తిమీర అన్నింటినీ పెద్ద పాత్రలో వేసి గరిటతో కలపాలి. అందులో పెరుగు, ఉప్పు వేసి మరోసారి కలిపి పక్కన పెట్టుకోవాలి.● పెనంలో వెన్న వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడిన తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, ఇంగువ వేసి కలిపి దించేయాలి. ఈ పోపును అటుకుల మిశ్రమంలో వేసి కలిపితే గోపాల్‌కాలా రెడీ.

కేసర్ శ్రీఖండ్



కావలసినవి: **చిక్కటి తాజా పెరుగు**– కేజీ, **చక్కెర** – వంద గ్రాములు (పొడి చేయాలి), **కుంకుమ పువ్వు** – కొద్దిగా, **వేడి పాలు** – టేబుల్ స్పూన్, **యాలకుల పొడి** – అర టీ స్పూన్, **పిస్తా పలుకులు** – టేబుల్ స్పూన్, **బాదం పలుకులు** – టేబుల్ స్పూన్.

తయారీ: ● వేడి పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి. ● పెరుగును పలుచని వస్త్రంలో వేసి మూటగట్టి వేలాడదీయాలి. మూడు గంటల పాటు ఉంచితే అందులోని నీరు పోయి మూటలో చిక్కటి పెరుగు మిగులుతుంది. ఆ పెరుగును ఒక పాత్రలో వేసి అందులో ముందుగా కుంకుమ పువ్వు వేసి ఉంచుకున్న పాలు పోసి, చక్కెర, యాలకుల పొడి వేసి సమంగా కలిసే వరకు చిలికితే కేసర్ శ్రీఖండ్ రెడీ. ● కేసర్ శ్రీఖండ్‌ను కప్పులో వేసి బాదం, పిస్తా పలుకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

గమనిక : మీ రుచిని బట్టి చక్కెర మోతాదును పెంచుకోవచ్చు.

కలాకండ్



కావలసినవి: **పనీర్** – 250 గ్రాములు (తురమాలి), **కండెన్స్‌డ్ మిల్క్** – 400 గ్రాములు, **చక్కెర** – టేబుల్ స్పూన్ (కండెన్స్‌డ్ మిల్క్‌తో వచ్చే తీపి సరిపోతుందనిపిస్తే చక్కెర అవసరం లేదు), **యాలకుల పొడి**– టీ స్పూన్, **నెయ్యి** – టేబుల్ స్పూన్, **బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు** – టేబుల్ స్పూన్.

తయారీ: మందపాటి బాణలిలో కండెన్స్‌డ్ మిల్క్, పనీర్ తురుము, చక్కెర వేసి కలపాలి. మిశ్రమం అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ సన్న మంట మీద ఉడికించాలి. మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత కలిపేటప్పుడు బాణలి అంచులను వదులుతూ ఉంటుంది. అప్పుడు యాలకుల పొడి వేసి కలపాలి. ఒక ట్రేకి నెయ్యి రాసి మిశ్రమాన్ని అందులో పోసి అట్లకాడతో సమంగా సర్దాలి. పైన బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు చల్లి అట్లకాడతో తేలికగా అద్దాలి. పదిహేను నిమిషాలకు వేడి తగ్గిన తర్వాత అట్లకాడతో మనకు కావల్సిన సైజులో, నచ్చిన ఆకారంలో గీతలు పెట్టాలి. పూర్తిగా చల్లారేటప్పటికి మరింతగా గట్టి పడుతుంది. అప్పుడు ట్రే నుంచి తీసి సర్వ్ చేయాలి. తేమ తగలకుండా నిల్వ చేస్తే కలాకండ్ నాలుగు రోజుల పాటు తాజాగా ఉంటుంది.

మఖ్ఖన్ మిశ్రీ



కావలసినవి: **తాజా మీగడ**– 2 కప్పులు, **కలకండ పలుకులు** – కప్పు, **పుదీన ఆకులు**– పది, **ఐస్ క్యూబ్స్**– కప్పు.

తయారీ: ఒక పాత్రలో మీగడ, నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి బాగా చిలకాలి. ఐదారు నిమిషాలకు వెన్న పైకి తేలుతుంది. ఐస్ క్యూబ్ కరిగిన నీరు పలుచని పాలలా అడుగుకు చేరతాయి. వాటిని వంపేసి మరో నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి మరో నిమిషం చిలికి ఆ నీటిని కూడా వంపేయాలి. ఇప్పుడు చక్కటి వెన్న తయారవుతుంది. ఈ వెన్నలో కలకండ వేసి కలిసే వరకు చిలకాలి. ఈ మిశ్రమాన్ని కప్పులో వేసి పైన పుదీన ఆకులు అలంకరించాలి. ఈ వెన్న రుచి చూస్తే చాలు... శ్రీకృష్ణుడిలాగ అందరమూ వెన్నదొంగలమైపోతాం.

● టెక్.. టాక్



శాంసంగ్ గెలాక్సీ వాచ్ 6 క్లాసిక్

డిస్‌ప్లే: 1.50 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ వేర్ వోఎస్4
రిజల్యూషన్: 480X480 పిక్సెల్స్
బ్యాటరీ: 425 ఎంఏహెచ్
- వాటర్ రెసిస్టెంట్
- స్క్రాచ్ రెసిస్టెంట్ గ్లాస్

వివో వి29ఇ

సైజ్: 6.78 అంగుళాలు వోఎస్:ఆండ్రాయిడ్ 13
ఇమేజ్ రిజల్యూషన్: 9000X7000 పిక్సెల్స్
కలర్స్: ఆర్టిస్టిక్ రెడ్, బ్లూ
ఫ్రంట్ కెమెరా: 50 ఎంపి
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్
బరువు: 180.5 గ్రా.



వాట్సాప్‌లో ఏఐ జనరేటెడ్ స్టిక్కర్స్ కోసం...



- ఓపెన్ ఎనీ చాట్–క్లిక్
- స్టిక్కర్స్ విండోను ఓపెన్ చేయడానికి పేజీ బాటమ్‌లోని స్మైలీ ఐకాన్‌ను క్లిక్ చేయాలి
- ‘క్రియేట్ ఏఐ స్టిక్కర్స్’తో యాక్సెస్ అయిన తరువాత ‘జెనరేట్ యువర్ వోన్ ఏఐ స్టిక్కర్’ ట్యాబ్–క్లిక్
- ‘క్రియేట్’ సెలెక్ట్ చేసుకొని మనం ఎంచుకున్న స్టిక్కర్‌కు టెక్ట్స్ లేదా వాయిస్ ప్రాంప్ట్ ఎంటర్ చేయాలి.

ఐఫోన్‌లో సబ్‌టైటిల్స్ కోసం...

మీరు ఐ ఫోన్ యూజర్? పరదేశ సినిమాలు, వీడియోలు ఐ ఫోన్ లేదా ఐ ప్యాడ్‌లో చూస్తున్నప్పుడు సబ్ టైటిల్స్ కావాలనుకుంటే ఇలా చేయండి...
- ‘ప్లే బ్లాక్ ఆప్షన్స్’ను ఓపెన్ చేయడానికి స్క్రీన్‌పై క్లిక్ చేయాలి.
- దిగువన త్రీడాట్స్‌పై ట్యాప్ చేయాలి.
- లాంగ్వేజ్–సబ్ టైటిల్స్ కనిపిస్తాయి. మీరు కోరుకునే ఆడియో లాంగ్వేజ్, సబ్ టైటిల్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.



గాలి మాటలు మాట్లాడవద్దు అంటారు.
అయితే గాలిలో దూరిన విషం గురించి మాట్లాడడం తప్పేమీ కాదు.
ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కాలేజీ క్యాంపస్‌లో స్నేహితులతో కలిసి ఎన్నో చర్చలు చేసేవాడు కుశాగ్ర శ్రీవాస్తవ.
అవి టైమ్‌పాస్ చర్చలు కావు.
‘ఏదో చేయాలి’ అనే తపన ఉన్న చర్చలు.
చర్చల ప్రభావం, అధ్యయనంతో వాయు కాలుష్యాన్ని తగ్గించే పరికరాల తయారీ కోసం ‘చక్ర్ ఇనోవేషన్’ కంపెనీ ప్రారంభించి విజయపథంలో దూసుకుపోతున్నాడు శ్రీవాస్తవ...

● ఇనోవేషన్



చక్ర్‌వర్తి

అధ్యయనం | అన్వేషణ | ఆవిష్కరణ

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సర్వే దిల్లీని ‘ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన రాజధాని’గా తేల్చింది. అప్పుడు దిల్లీకి చెందిన కుశాగ్ర శ్రీవాస్తవ ఐఐటీ–దిల్లీలో ఇంజనీరింగ్ స్టూడెంట్. వాయు కాలుష్యం తగ్గించే మార్గాలపై అతడి ఫ్యాకల్టీ మెంబర్స్ వివిధ ఎక్స్‌పర్ట్ కమిటీలు, ప్యానెల్స్‌లో పనిచేస్తున్నారు.

క్యాంపస్‌లో వాయు కాలుష్యం గురించి తరచుగా చర్చలు జరిగేవి.

ఆ చర్చల్లో చురుగ్గా పాల్గొనేవాడు శ్రీవాస్తవ.

గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన కర్బన ఉద్గారాల నుంచి వాయు కాలుష్యం వల్ల తగ్గుతున్న ఆయుర్దాయం వరకు, ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ నుంచి గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉన్న నగరాల వరకు ఆ చర్చల్లో ఎన్నో విషయాలు చోటు చేసుకునేవి.

సమస్య గురించి బాధ పడే వారు ఒక రకం అయితే, బాధ పడడానికే పరిమితం కాకుండా ఆ సమస్య పరిష్కారానికి తమ వంతుగా ఆలోచించేవారు రెండో రకం. శ్రీవాస్తవ రెండో వర్గానికి చెందిన కుర్రాడు.

ఐఐటీ–దిల్లీలో చదువుకుంటూనే ‘చక్ర్ ఇనోవేషన్’ అనే కంపెనీని రిజిస్టర్ చేయించాడు.

వాయుకాలుష్యానికి సంబంధించి ‘రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్’పై మూడు సంవత్సరాలు వెచ్చించాడు.

ఆ తరువాత కంపెనీ పట్టాలకెక్కింది.

‘ది చక్ర్ షీల్డ్’ అనే రెట్రో ఫిట్ ఎమీషన్ కంట్రోల్ డివైజ్(ఆర్‌ఈసీడి)ను తయారుచేసింది చక్ర్.

ఈ టెక్నాలజీని ఎన్నో ప్రాంతాలలో విజయవంతంగా ఉపయోగించింది చక్ర్. సెంట్రల్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) నుంచి ఆమోదం పొందింది.

శ్రీవాస్తవతో కో–ఫౌండర్‌లుగా ప్రయాణం మొదలు పెట్టిన ఇద్దరు మిత్రులు మధ్యలోనే తప్పుకున్నారు. అయినా ధైర్యం కోల్పోకుండా ముందు అడుగు వేశాడు శ్రీవాస్తవ.

‘చక్ర్’ సింగిల్ ప్రాడక్ట్‌గా ఉన్నప్పుడు క్లైమెట్–ఫోకస్‌డ్ ప్రైవెట్ ఈక్విటీ ఫండ్ ‘సీవ్ ఫండ్’ ఇన్వెస్ట్ చేసింది.

‘మల్టీ–ప్రాడక్ట్ కంపెనీగా చక్ర్ మారాలనుకున్నాం. ఎందుకంటే ఉద్గార నియంత్రణ పరికరాలకు పెద్ద మార్కెట్ ఉంది. అదనపు ఉత్పత్తులతో చక్ర్‌కు మల్టీ–ప్రాడక్ట్ కంపెనీగా మారే సమర్థత ఉంది’ అంటున్నాడు ‘సీవ్ ఫండ్’ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ అక్షయ్ పంత్. ‘చక్ర్’ గత మూడు సంవత్సరాలుగా స్వదేశీ ఇంధన నిల్వల సాంకేతికతపై పని చేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా లిథియం గురించి ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గుతుందని చెబుతున్నాడు శ్రీవాస్తవ. తమ కస్టమర్‌లలో 150 కంపెనీలు ఉన్నాయి. వీటిలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు కూడా ఉండడం విశేషం.

వికేంద్రీకృత శక్తి వనరుల అనుసంధానానికి క్లీన్ టెక్ స్టార్టప్ ‘చక్ర్’ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తోంది.

‘నగరాలలో మంచి గాలి లక్ష్యంతో ప్రయాణం మొదలు పెట్టాం. వినూత్నమైన సాంకేతికతే మా బలం అనుకున్నాం. వాణిజ్యపరంగా బలోపేతం కావడానికి వరల్డ్–క్లాస్ కస్టమర్ బేస్‌ను విస్తరించడానికి వినూత్న సాంకేతికతనే నమ్ముకున్నాం’ అంటున్నాడు కుశాగ్ర శ్రీవాస్తవ.

● మ్యూజిక్ వరల్డ్

స్వరాల సందడి

హిందుస్థానీ సంగీతాన్ని నేర్చుకున్న మధుర కుంభర్ స్వరం తేనె జలపాతం. ముంబైకి చెందిన మధుర డ్యాన్స్‌కు సంబంధించి ఒక రియాల్టీ షో ద్వారా వెలుగులోకి వచ్చింది. యూట్యూబ్ మ్యూజిక్, స్పోటీఫై, జియో సావన్. హంగామాలలో తన గాత్రాన్ని వినిపించింది. నోట్స్ ‘ఎన్’ బీట్స్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులలో మధుర ఒకరు. ప్రసిద్ధ డిస్నీ మూవీ ‘బ్యూటీ అండ్ ది బీస్ట్’ కోసం వాయిస్ ఇచ్చింది. జీ మరాఠీ పాపులర్ మ్యూజిక్ షో ‘నక్షత్రాంచే’తో, మరాఠీ మ్యూజికల్ గేమ్ రియాల్టీ షో ‘కలర్స్’తో సంగీత ప్రేమికులకు చేరువయ్యింది. సోని టీవి ఇండియన్ ఐడల్ సీజన్ 10కు జడ్జ్‌గా వ్యవహరించింది. జీ యువ ‘సంగీత్ సామ్రాట్’లో తన గళంతో అలరించింది. రెండు సంవత్సరాల క్రితం మారాఠీ చిత్ర గీతానికి ఫిల్మ్‌ఫేర్ అవార్డ్ అందుకుంది. ‘కలలు అనేవి దాచుకునేవి కావు సాకారం చేసుకునేవి’ అనే మాట అంటే ఈ స్వీట్ వాయిస్ సింగర్‌కు ఎంతో ఇష్టం. పాత, కొత్త సంగీతాలను మిక్స్‌డ్‌గా ఆస్వాదించం అంటే మరీ మరీ ఇష్టం.



యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



మేక్ ఏ మౌంటెన్ ఔట్ ఆఫ్ ఏ మోల్ హిల్

చిన్న సమస్యను కూడా పెద్దగా ఊహించుకొని ఆందోళన పడే వారి విషయంలో వాడే మాట ఇది.
ఉదా: యూ హ్యావ్ జస్ట్ గాట్ ఏ కోల్డ్. సో స్టాప్ మేకింగ్ ఏ మౌంటెన్ ఔట్ ఆఫ్ ఏ మోల్ హిల్. యూ ఆర్ నాట్ గోయింగ్ టు డై ఫ్రమ్ ఇట్.

ఆన్ ది బ్యాక్ బర్నర్

భవిష్యత్‌లో పట్టాలకెక్కించాలనుకుంటున్న లేదా ఉపయోగపడే ప్లాన్, ప్రాజెక్ట్‌లకు సంబంధించి ఉపయోగించే మాట ఇది. ఉదా: ప్లాన్స్ ఫర్ ది న్యూ ఫ్యాక్టరీ హ్యావ్ బీన్ పుట్ ఆన్ ది బ్యాక్ బర్నర్ అన్‌టిల్ ది ఎకనామీ ఇంప్రూవ్స్

● గేమింగ్



చీకటిని చీల్చే వెలుగు రవ్వ

సింగిల్–ప్లేయర్ అడ్వెంచర్ స్ట్రాటజీ గేమ్ ‘గోర్డ్’ విడుదల అయింది. ఆ చీకటి ప్రపంచంలో గెలవాలంటే, మీ వాళ్లను రక్షించుకోవాలంటే రెండు విషయాలు ఉన్నాయి. అవి ఆయుధాల కంటే విలువైనవి. ఒకటి...ధైర్యం, రెండోది ప్రతికూలపరిస్థితులలోనూ నిలదొక్కుకోవడం. శత్రువుల బలాలు,బలహీనతలను అంచనా వేయగలిగిన వారే విజేత. అదిగో యుద్ధభేరి వినిపిస్తోంది.

ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4 జానర్: స్ట్రాటజీ గేమ్,
ఇండీ గేమ్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ ఎక్స్‌బాక్స్ వన్

● చంద్రయాణానికి సంబంధించి తొలి కలను కన్నాడు ‘ది రాయల్ సొసైటీ ఆఫ్ లండన్’ వ్యవస్థాపకులలో ఒకరైన జాన్ విల్కిన్స్. జాన్‌కు ఎన్నో శాస్త్రాలపై ఆసక్తి ఉండేది. తన విభిన్నమైన ఆసక్తులు, విభిన్నమైన కలలకు కారణమయ్యేవి. తన కలలో ‘రెక్కల రథం’ అనేది రూపుదిద్దుకుంది. ఇది మనుషులను చంద్రలోకానికి తీసుకువెళుతుంది. ‘ఏ డిస్కోర్స్ కన్సర్నింగ్ ఏ న్యూ వరల్డ్ అండ్ అనదర్ ప్లానెట్’ అనే పుస్తకాన్ని రాశాడు. ఈ పుస్తకంలో మనుషులు చంద్రగ్రహంతో సహా రకరకాల గ్రహాలకు వెళ్లడంలోని సాధ్యాసాధ్యాల గురించి చర్చించాడు. ఎన్నో సాహసోపేతమైన ప్రతిపాదనలు చేశాడు.

● ‘ప్రపోజ్ చేయడం మంచిదేగానీ వోవర్ కాన్ఫిడెన్స్ కూడదు’ అంటారు ప్రేమతాత్వికులు. ఇట్టి విషయం తెలిసో తెలియకో చైనాలో ఒక యువకుడు పప్పులో కాలేసి జారి పడి జాలి చూపులకు గురయ్యాడు. రెండు సంవత్సరాల తన పొదుపు మొత్తాలను వెచ్చించి 99 ఐఫోన్‌లను కొన్నాడు. సింగిల్స్ డే (బ్యాచ్‌లర్స్ స్పెషల్) సందర్భంగా ఈ ఐఫోన్‌లను లవ్ సింబల్‌గా ఎరెంజ్ చేసి ప్రియురాలికి ప్రపోజ్ చేశాడు. సదరు ఆమె మాత్రం ‘నో’ అంటూ షాక్ ఇచ్చింది.

● అవును... ఇది నిజమే!



సినిమా

రాఖీ పండగ సందర్భంగా సోదరుడి క్షేమాన్ని కోరుకుంటూ సోదరి రాఖీ కడితే... ఎప్పటికీ రక్షణగా ఉంటానంటూ సోదరుడు కట్టించుకుంటాడు. ఇలా పలువురు స్టార్స్ రాఖీ పండగ జరుపుకున్నారు. ఎప్పటిలానే తన ఇద్దరు చెల్లెళ్లు మాధవి, విజయ దుర్గలతో రాఖీ కట్టించుకున్నారు చిరంజీవి. చెల్లెళ్లకు బహుమతులు ఇచ్చారు. అలాగే తన సోదరుడికి, కజిన్స్‌కి రాఖీ కట్టి, మిఠాయి తినిపించారు పూజా హెగ్డే. తమ్ముడు ఆశీర్వదించమంటూ కాళ్ల మీద పడగానే.. ఓ యబ్బో అంటూ సరదాగా కన్ను కొట్టారు పూజా. ‘బ్రదర్స్ రూపంలో మంచి స్నేహితులు ఉన్నారు’ అంటూ సోదరులతో కలిసి దిగిన ఫొటోను షేర్ చేశారు పరిణీతీ చోప్రా. ఇంకా పలువురు స్టార్స్ రాఖీ పండగ చేసుకున్నారు.







కల్కికి అతిథిగా...


● రాజమౌళి

దర్శకుడిగా ఎక్కువగా కెమెరా వెనకాల ఉండే రాజమౌళి అప్పుడప్పుడూ నటుడిగా కెమెరా ముందుకు వస్తుంటారు. ఆయన దర్శకత్వంలోనే వచ్చిన ‘సై’, ‘మగధీర’, ‘బాహుబలి: ది బిగినింగ్’ ఇటీవల ‘ఆర్ఆర్ఆర్’ చిత్రాల్లో సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు రాజమౌళి. ఇతర దర్శకుల చిత్రాలైన ‘రెయిన్ బో’, ‘మజ్ను’ల్లో అతిథి పాత్రల్లో కనిపించారు. తాజాగా ‘కల్కి 2898ఏడీ’ చిత్రంలో అతిథిగా కనిపించేందుకు రాజమౌళి అంగీకరించారని సమాచారం. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నేడు ప్రభాస్, రాజమౌళి కాంబినేషన్ సన్నివేశాలను చిత్రీకరించేలా నాగ్ అశ్విన్ ప్లాన్ చేశారని తెలిసింది. ఈ ఒక్క రోజుతో రాజమౌళి పాత్ర చిత్రీకరణ పూర్తవుతుందని భోగట్టా. ఇక దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ వచ్చే ఏడాది విడుదల కానుంది.

సక్సెస్ మీట్‌లో మాట్లాడి ఐదేళ్లయింది

- కార్తికేయ

‘‘క్లాక్స్ నాకు 2009 నుంచి పరిచయం. అప్పట్నుంచి నాకు కథలు చెబుతుంటాడు. డిఫరెంట్ కాన్సెప్టుల్లో నటించడం, చేయడం కాస్త కష్టం.. నిర్మాతలు ముందుకు రారు, కమర్షియల్ ఫార్మాట్లో సినిమా చేయమని తనతో చెప్పాను. కానీ బెన్నీలాంటి నిర్మాతలు ఇప్పుడు కొత్త కథలను ప్రోత్సహిస్తున్నారు. ఇక కొత్త కొత్త పాత్రలు చేస్తున్న కార్తికేయకు పెద్ద హిట్ పడాలని అనుకున్నాను. ఇప్పుడు ‘బెదురులంక’తో హిట్ కొట్టేశాడు’’ అని హీరో శ్రీ విష్ణు అన్నారు. కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం ‘బెదురులంక 2012’. క్లాక్స్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం గత వారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ నిర్వహించిన విజయోత్సవంలో హీరో శ్రీ విష్ణు, దర్శకుడు అజయ్ భూపతి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ‘‘కార్తికేయకు హిట్ వస్తే నాకూ హిట్ వచ్చినట్టే’’ అని అజయ్ భూపతి అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ– ‘‘ఈ సినిమా ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. ఫస్ట్ డే ఫస్ట్ షో చూసి బాగుందని అందరూ చెప్పిన తర్వాత పెద్ద రిలీఫ్ అనిపించింది. ఇలా సక్సెస్ మీట్‌లో మాట్లాడి ఐదేళ్లయింది. ‘ఆర్ఎక్స్ 100’ తర్వాత నేను చేసిన సినిమాలు అనుకున్న రేంజ్‌కు వెళ్లలేదు. ఒక్క హిట్ వస్తే చాలనుకున్న టైమ్‌లోనే ‘బెదురులంక’ వచ్చింది’’ అన్నారు. ‘‘సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్’’ అన్నారు రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని. ఇంకా బీవీఎస్ రవి, నేహా శెట్టి తదితరులు మాట్లాడారు.


● బెన్నీ, శ్రీ విష్ణు, కార్తికేయ, నేహాశెట్టి

నేను వచ్చానని చెప్పు!

‘నాన్ వందుట్టేన్ను సొల్లు’ అంటూ నయనతార ఇన్‌స్టాగ్రామ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అంటే.. ‘నేను వచ్చానని చెప్పు’ అని అర్థం. తన ఇద్దరు పిల్లలు ఉయిర్, ఉలగమ్‌లను ఎత్తుకొని, ‘జైలర్’ సినిమాలోని ‘హుకుమ్’ పాట బ్యాక్‌గ్రౌండ్‌తో, స్టయిలిష్‌గా నడుస్తూ వస్తున్న వీడియోను తొలి పోస్ట్‌గా షేర్ చేశారు నయనతార. అలాగే షారుక్ ఖాన్ కాంబినేషన్‌లో నటించిన ‘జవాన్’ ట్రైలర్‌ని షేర్ చేశారామె. ఈ నెల 7న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇక భార్య ఇన్‌స్టాలోకి ఎంటర్ అయిన సందర్భంగా ‘మై ఉయిర్స్ (నా ప్రాణాలు) వెల్కమ్’ అని పేర్కొన్నారు దర్శకుడు విఘ్నేష్ శివన్. ఇలా నయనతార సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోకి రావడం ఆమె అభిమానులను ఆనందపరిచింది. నయనతార ఇన్‌స్టాలోకి ఎంటర్ కాగానే విఘ్నేష్ శివన్, షారుక్ ఖాన్, అనిరుధ్, తన రౌడీ పిక్చర్స్ బేనర్, మిచెల్లీ ఒబామాలను ఫాలో అయ్యారు.


● కుమారులతో నయనతార


● నయనతార

యాక్షన్.. థ్రిల్...

‘సందీప్ మాధవ్ హీరోగా, కేథరిన్ హీరోయిన్‌గా ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. అశోక్ తేజ దర్శకత్వంలో సోమా విజయ్ ప్రకాష్ నిర్మాణంలో దావులూరి జగదీష్, పల్లి కేశవరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయిన సందర్భంగా దావులూరి జగదీష్ మాట్లాడుతూ – ‘‘యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో సందీప్ ఓ పవర్‌ఫుల్ పోలీస్ క్యారక్టర్ చేస్తున్నారు. రెండో షెడ్యూల్‌ని ఈ నెల 4న ఆరంభిస్తాం. ప్రముఖ దర్శకుడు సంపత్ నందిగారు మా కథ విని ఇంప్రెస్ అయి, ఓ క్రేజీ టైటిల్ సూచించారు. ఆ టైటిల్‌ని ఈ నెల 6న ప్రకటిస్తాం. చాలా గ్యాప్ తర్వాత ‘ఆది’ ఫేమ్ కీర్తీ చావ్లా ఈ చిత్రంలో ఓ ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు’’ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: సతీష్ ముత్యాల.


● కేథరిన్, సందీప్

రీల్స్

ఘన్ను భాయ్ వినోదం

ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అభిషేక్ నామా నిర్మిస్తున్న తాజా చిత్రం ‘ఘన్ను భాయ్’. ‘ఇస్మార్ట్ కా బాప్’ అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమా ద్వారా ఆదిత్య గంగసాని హీరోగా పరిచయమవుతున్నారు. ప్రణయ్ మైకల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ‘‘పూర్తి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం ‘ఘన్ను భాయ్’. ఈ సినిమాని వచ్చే ఏడాది మార్చి 8న విడుదల చేస్తాం’’ అని యూనిట్ పేర్కొంది.


● ఆదిత్య

మ్యాడ్‌తో ఎంట్రీ!


● ‘మ్యాడ్’ పోస్టర్

నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, గౌరీ ప్రియా రెడ్డి, అనతిక సునీల్ కుమార్, గోపికా ఉద్యన్ ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం ‘మ్యాడ్’. కల్యాణ్ శంకర్ దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రూపొందుతున్న ఈ సినిమా ద్వారా నిర్మాతలు చినబాబు కుమార్తె, నాగవంశీ సోదరి హారిక సూర్యదేవర నిర్మాతగా ఎంటర్ అవుతున్నారు. ఎస్. నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ‘‘యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: షామ్‌దత్ సైనుద్దీన్, దినేష్ కృష్ణన్ బి.

గ్రామీణ నేపథ్యంలో...

‘సత్యం’ రాజేష్, కామాక్షి భాస్కర్ల లీడ్ రోల్స్‌లో డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘మా ఊరి పొలిమేర–2’. గౌరు గణబాబు సమర్పణలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబరు 2న విడుదల చేయనున్నారు. డా. అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ‘‘గ్రామీణ నేపథ్యంలో మర్డర్ మిస్టరీకి బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ‘మా ఊరి పొలిమేర’ కన్నా రెండో భాగం ఇంకా ఆసక్తిగా ఉంటుంది’’ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, కెమెరా: ఖుషేందర్ రమేష్ రెడ్డి.


● రాజేష్, కామాక్షి

అట్టా.. ఎట్టాగా పుట్టేసినావు...


● విషికా, రవి

రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం ‘సగిలేటి కథ’. నవదీప్ సి–స్పేస్ సమర్పణలో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించారు. జశ్వంత్ పసుపులేటి సంగీతం అందించిన ఈ చిత్రంలోని ‘‘అట్టా ఎట్టాగా పుట్టేసినావు..’ అంటూ సాగే పాటని మ్యూజిక్ డైరెక్టర్ రధన్ రిలీజ్ చేశారు. రాజశేఖర్ సుద్మూన్, జశ్వంత్ పసుపులేటి రాసిన ఈ పాటను యశ్వంత్ నాగ్, కమల మనోహరి పాడారు. ‘‘హీరో, హీరోయిన్ తొలి చూపులోనే ప్రేమలో పడే సీన్‌లో వచ్చే పాట ఇది. త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తాం’’ అన్నారు దర్శక–నిర్మాతలు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
1-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
256	93
64,831	19,254

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	14,067	△	48
డోజోన్స్	34,858	▽	32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,439	▽	35
డాక్స్	15,947	△	55
షాంఘై	3,120	▽	17
నికాయ్	32,619	△	286

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,485	△	193
బంగారం (99.5 స్వచ్ఛత)	59,247	△	192
వెండి (కిలో)	74,645	▽	16

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.90	83.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.55	107.00
€	యూరో	ఎస్‌బీఐ	88.81	91.95
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.86	57.61
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.57	54.92
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.32	62.26
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.15	22.71
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.67	23.41
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.24	12.24

వృద్ధి వేగంలో భారత్ టాప్!

- జూన్ త్రైమాసికంలో 7.8% పురోగతి
- వ్యవసాయం, ఫైనాన్షియల్ రంగాల చక్కటి పనితీరు



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (2023-24, ఏప్రిల్-జూన్) 7.8 శాతంగా నమోదయ్యింది. వ్యవసాయం, ఫైనాన్షియల్ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించాయి. జూన్ త్రైమాసికంలో ప్రపంచంలో మరే దేశమూ ఈ స్థాయి వృద్ధిని నమోదుచేసుకోలేదు. దీనితో వృద్ధి వేగంలో భారత్ మొదటి స్థానంలో నిలిచినట్లయ్యింది. 6.3 శాతం వృద్ధి రేటుతో భారత్ తర్వాత చైనా వృద్ధి వేగంలో రెండవ స్థానంలో నిలిచింది. అయితే క్యూ1లో 8 శాతం వృద్ధి రేటు నమోదవుతుందన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనాలకన్నా తాజా లెక్క తక్కువగా ఉండడం గమనార్హం. ఈ నెల రెండవ వారంలో జరిగిన ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షలో 2023-24లో దేశ జీడీపీ 6.5 శాతం ఉంటుందని ఆర్‌బీఐ అంచనావేసింది. క్యూ1లో 8 శాతం, క్యూ2లో 6.5 శాతం, క్యూ3లో 6 శాతం, క్యూ4లో 5.7 శాతంగా అంచనా వేసింది. 2024-25 మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు 6.6 శాతంగా అంచనాకు వచ్చింది.

7.8 శాతం వృద్ధి అంటే...

2011-12ని బేస్ ఇయర్‌గా తీసుకుని ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేస్తూ లెక్కిస్తే, 2022-23 మొదటి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి విలువ రూ.37.44 లక్షల కోట్లు. 2023-24 ఇదే కాలంలో ఈ విలువ రూ.40.37 లక్షల కోట్లకు ఎగసింది. అంటే వృద్ధి 7.8 శాతం పెరిగిందన్నమాట. కాగా ద్రవ్యోల్బణం సర్దుబాటు చేయని (ప్రస్తుత ధరల ప్రాతిపదిక) జీడీపీ వృద్ధి రేటు 8 శాతంగా ఉంది. విలువల్లో రూ.65.42 లక్షల కోట్ల నుంచి రూ.70.67 లక్షల కోట్లకు పెరిగింది.

- 2022-23 క్యూ1లో జీడీపీ వృద్ధి రేటు 13.1 శాతంగా ఉంది. అయితే దీనికి లో బేస్ ఎఫెక్ట్ ఒక కారణం. అంటే కరోనా కష్టకాలం 2021-22 ఇదే కాలంలో చేటుచేసుకున్న అతి తక్కువ గణాంకాలు 2022-23 క్యూ1లో అధిక రేటు (శాతాల్లో) నమోదుకు దోహదపడ్డాయి.
- తాజా గణాంకాలకు ముందు త్రైమాసికం అంటే జనవరి-మార్చి మధ్య జీడీపీ విలువ 6.1% కాగా, అంతక్రితం త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్)ఈ రేటు 4.5%. అంటే సమీక్షా కాలం సహా అంతక్రితం గత 3 త్రైమాసికాల్లో వృద్ధి రేటు పెరుగుతూ వచ్చిందన్నమాట.

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) విడుదల చేసిన జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్- స్థూల విలువ జోడింపు అనేది ఆర్థిక వ్యవస్థలోని పరిశ్రమ, రంగం, తయారీదారు, ప్రాంతం లేదా ప్రాంతం ద్వారా ఉత్పత్తి అయిన వస్తువులు, సేవల విలువ. ఉత్పత్తి వ్యయాలను ఇందులో చేర్చరు) ప్రకారం వివిధ రంగాల వృద్ధి తీరును పరిశీలిస్తే..

వర్షాభావం ఉన్నా 6.5 % వృద్ధి



వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5% వృద్ధి సాధించే సత్తా భారత్‌కు ఉంది. ధరల కట్టడికి ప్రభుత్వం, ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకుంటున్నాయి. అందువల్ల ద్రవ్యోల్బణం భయాలు అక్కర్లేదు.

– వి. అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

ఏప్రిల్-జూన్ (గణాంకాలు శాతాల్లో)

రంగం	2023-24	2022-23
వ్యవసాయం	3.5	2.4
ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలు	12.5	8.5
తయారీ	4.7	6.1
మైనింగ్, క్వారీయింగ్	5.8	9.5
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు	2.9	14.9
నిర్మాణం	7.9	16
ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్	9.2	25.7

జూలైలో మౌలిక రంగం ఓకే...

ఎనిమిది రంగాల భారత్ మౌలిక పరిశ్రమ జూలైలో మంచి పనితీరును కొనసాగించింది. బొగ్గు , క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, స్టీల్, సిమెంట్, విద్యుత్, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువుల రంగాలు వీటిలో ఉన్నాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో వీటి వెయిటేజ్ 40.27 శాతం. ఐఐపీ జూలై డేటా సెప్టెంబర్ రెండవ వారం మొదట్లో వెలువడుతుంది. ఇక ఏప్రిల్ నుంచి జూలై వరకూ మౌలిక పరిశ్రమ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంది. కాగా, జూన్‌లో మౌలిక రంగం వృద్ధి రేటు 8.3 శాతం కావడం గమనార్హం. 2022 ఏప్రిల్-జూలై మధ్య ఈ రేటు 11.5 శాతం.

అదానీ గ్రూప్‌పై అవే ఆరోపణలు

- హిండెన్‌బర్గ్ బాటలో ఓసీసీఆర్‌పీ
- అక్రమ పెట్టుబడులతో షేర్ల ర్యాలీ
- తోసిపుచ్చిన అదానీ గ్రూప్ ప్రమోటర్లు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై మరోసారి అక్రమ పెట్టుబడుల ఆరోపణలు తలెత్తాయి. అదానీ ప్రమోటర్ కుటుంబం వెలుగులోలేని మారిషస్ ఫండ్స్ ద్వారా కోట్లాది డాలర్లను గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలలో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆర్గనైజ్‌డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్(ఓసీసీఆర్‌పీ) తాజాగా ఆరోపించింది. యూఏఈకి చెందిన నాసెర్ అలీ షాబాన్ అలీ, తైవాన్‌కు చెందిన చాంగ్ చుంగ్-లింగ్ ఏళ్లపాటు మారిషస్ ఫండ్స్ ద్వారా కోట్లాది డాలర్ల పెట్టుబడులతో అదానీ గ్రూప్ స్టాక్స్‌లో లావాదేవీలు నిర్వహించినట్లు ఓసీసీఆర్‌పీ తాజా ఆరోపణలకు తెరతీసింది. వినోద్ అదానీకి చెందిన వ్యక్తి నిర్వహణలోని దుబాయ్ సంస్థ ఈ ఫండ్స్‌ను నిర్వహిస్తుందని పేర్కొంది. కాగా.. ఇంతక్రితం ఈ ఏడాది జనవరిలోనూ అదానీ గ్రూప్ కంపెనీలలో అకౌంటింగ్ అవకతవకలు జరుగుతున్నట్లు యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలలో అమ్మకాలు వెల్లువెత్తి గ్రూప్ మార్కెట్ విలువలో 150 బిలియన్ డాలర్లమేర ఆవిరైంది. అయితే ఆపై గ్రూప్ వీటిని ఖండించింది. ఆపై షేర్ల ధరల్లో అవకతవకలకు ఆధారాలు లేవంటూ సుప్రీం కోర్టు నియమిత కమిటీ ఆరోపణలను కొట్టివేసింది. తాజాగా ఓసీసీఆర్‌పీ ఆరోపణల నివేదికలో పేర్కొన్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను ఇప్పటికే సుప్రీం కోర్టు నియామక కమిటీ దర్యాప్తులోనూ పరిగణించిన విషయాన్ని ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ప్రస్తావించింది. ఇవన్నీ రీసైకిల్ చేసిన ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఇన్వెస్టర్ జార్జ్ సోరోస్ పెట్టుబడులున్న సంస్థల లబ్ధి కోసం ఆరోపణలను తిరగతోడుతున్నట్లు వ్యాఖ్యానించింది. కొన్ని విదేశీ మీడియా వర్గాలు పసలేని హిండెన్‌బర్గ్ నివేదికను మరోసారి హైలైట్ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా వీటిని తోసిపుచ్చింది.

తాజా ఆరోపణలు ఇలా..

2013-2018 మధ్య కాలంలో ప్రమోటర్ కుటుంబం తమ నిర్వహణలోని మారిషస్ ఫండ్స్ ద్వారా గ్రూప్ కంపెనీలలో కోట్లాది డాలర్ల నిధులను రహస్యంగా ఇన్వెస్ట్ చేశాయని ఓసీసీఆర్‌పీ పేర్కొంది. తద్వారా గ్రూప్ షేర్ల ధరలలో భారీ ర్యాలీకి కారణమైనట్లు ఆరోపించింది. ఈ కాలంలో షేర్ల ధరల్లో భారీ ర్యాలీ ఫలితంగా అదానీ గ్రూప్ దేశంలోనే అత్యంత శక్తివంతమైన బిజినెస్ గ్రూప్‌లలో ఒకటిగా ఆవిర్భవించినట్లు పేర్కొంది. ఓసీసీఆర్‌పీ ఆరోపణలను అదానీ ఖండించినప్పటికీ అదానీ గ్రూప్‌లోని పలు షేర్లు 4.4-2.2% మధ్య క్షీణించాయి.

అదానీపై విచారణకు జేపీసీ వేయాలి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్



అదానీ గ్రూప్‌పై తాజా ఆరోపణల విషయంలో ప్రధాని మోదీ తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. జీ20 శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న వేళ దేశం ప్రతిష్ట మసకబారకుండా ఉండాలంటే అదానీ గ్రూప్‌పై జేపీసీ (సంయుక్త పార్లమెంటరీ కమిటీ)తో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అదానీ విషయంలో ఇండియా కూటమిలో ఎలాంటి విబేధాలు లేవన్నారు. 'భారత్‌లో అందరికీ సమానావకాశాలుంటాయి. పారదర్శకత ఉంటుంది, అవినీతికి తావులేదని మనం చెప్పుకుంటున్నాం. కానీ, అదానీపై వస్తున్న ఆరోపణలు దేశ ప్రతిష్టను, ప్రధాని మోదీ పనితీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రధానికి సన్నిహితుడైన ఈ పెద్ద మనిషి బిలియన్ డాలర్లతో షేర్ ధరలను పెంచేలా ఎలా చేయగలిగారు? ఆ సొమ్ము ఎవరిది? దీని వెనుక గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ హస్తం ఉందా?. ఇందులో మరో ఇద్దరి ప్రమేయం కూడా ఉంది. వారు నాసిర్ అలీ షాబాన్, చైనా వాసి చాంగ్‌చుంగ్ లింగ్. ఈ విదేశీయులను ఈ వ్యవహారంలోకి ఎలా అనుమతించారు? వీటిపై విచారణ ఎందుకు జరిపించడం లేదు? ఎందుకు మౌనంగా ఉంటున్నారు? వీటన్నిటిపైనా ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలి'అని రాహుల్ డిమాండ్ చేశారు. 'రుజువులు ఇచ్చినా సెబీ అదానీకి క్లీన్‌చిట్ ఇచ్చింది. క్లీన్‌చిట్ ఇచ్చిన సెబీలోని ఆ పెద్దమనిషి ఇప్పుడు అదానీ ఎన్‌డీ టీవీలో డైరెక్టర్. ఎలాంటి విచారణ జరిగిందో దీన్నిబట్టి అర్థమవుతోంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

సిమ్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 10 లక్షల జరిమానా: డాట్



న్యూఢిల్లీ: నమోదు చేసుకోని డీలర్ల ద్వారా సిమ్ కార్డులను విక్రయించి, కొత్త నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. 10 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని టెల్కోలను టెలికం శాఖ (డాట్) హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. సిమ్ కార్డుల మోసపూరిత విక్రయాలను కట్టడి చేసేందుకు ఉద్దేశించిన కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఈ నేపథ్యంలో టెలికం సంస్థలు అన్ని పాయింట్ ఆఫ్ సేల్స్‌ను (పీవోఎస్) సెప్టెంబర్ 30లోగా రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత పీవోఎస్‌లు తగు పత్రాలను సమర్పించి, రిజిస్టర్ చేయించుకోవాలి.

బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ నష్టం 256 పాయింట్లు
- మళ్లీ 19,300 దిగువకు నిఫ్టీ
- మూడు రోజుల లాభాలకు బ్రేక్



ముంబై: స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు గురువారం బ్రేక్ పడింది. ఆగస్టు ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు సందర్భంగా బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దేశీయ తొలి త్రైమాసికం జీడీపీ వృద్ధి డేటా వెల్లడికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. ఫలితంగా సెన్సెక్స్ 256 పాయింట్లు పతనమై 64,831 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 65,277 వద్ద కనిష్టాన్ని, 64,724 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 93 పాయింట్లు నష్టపోయి 19,254 వద్ద నిలిచింది. రోజంతా 19,224 - 19,388 శ్రేణిలో ట్రేడైంది. ఐటీ, రియల్టీ, వినిమయ షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,973 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,383 కోట్ల ఈక్విటీలను కొన్నారు. చైనా ఏప్రిల్-జూన్ క్వార్టర్ వృద్ధి 0.8% క్షీణతతో ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. ఏరోఫ్లెక్ ఇండస్ట్రీస్ షేరు లిస్టింగ్ రోజే 51% లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.108)తో పోలిస్తే 83% శాతం భారీ ప్రీమియంతో రూ.197 వద్ద లిస్టయ్యింది. బంపర్ లిస్టింగ్ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. చివరికి 51% లాభంతో రూ.163 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.2,110 కోట్లుగా నమోదైంది.

ఇండియా పోస్ట్‌తో అమెజాన్ జట్టు

ఎస్ఎంఈ ఎగుమతిదారులకు తోడ్పాటు



న్యూఢిల్లీ: చిన్న సంస్థలకు (ఎస్ఎంఈ) ఎగుమతులను సులభతరం చేసే దిశగా ఇండియా పోస్ట్‌తో అమెజాన్ ఒప్పందం కుదుర్చుకుంది. సంభవ్ సమ్మిట్ 2023 సందర్భంగా కంపెనీ ఈ విషయం తెలిపింది. అలాగే అమెజాన్, ఇండియా పోస్ట్ మధ్య దశాబ్ద కాలపు భాగస్వామ్యానికి గుర్తుగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్మారక స్టాంపును ఆవిష్కరించినట్లు వివరించింది. తమ విక్రేతలకు తోడ్పాటు అందించేందుకు సహ-ఏఐ పేరిట కృత్రిమ మేథ ఆధారిత డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టినట్లు అమెజాన్ తెలిపింది.

రెండు గేముల్లో ఓడిన హంపి



కోల్‌కతాలో జరుగుతున్న టాటా స్టీల్ ఇండియా ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రెండు గేముల్లో ఓడిపోయి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. అర పాయింట్‌తో చివరిదైన పదో ర్యాంక్‌లో ఉంది. జు వెన్‌జున్ (చైనా)తో జరిగిన తొలి గేమ్‌ను 67 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న హంపి... ఇరీనా క్రుష్ (అమెరికా)తో జరిగిన రెండో గేమ్‌లో 48 ఎత్తుల్లో... వంతిక (భారత్)తో జరిగిన మూడో గేమ్‌లో 24 ఎత్తుల్లో ఓటమి పాలైంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఒక పాయింట్‌తో 8వ ర్యాంక్‌లో ఉంది. తొలి రౌండ్‌లో దివ్య (భారత్) చేతిలో 57 ఎత్తుల్లో ఓడిన హారిక... నినో బత్సియాష్‌విలి (జార్జియా)తో 26 ఎత్తుల్లో, సవితాశ్రీ (భారత్)తో 56 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో మూడు రౌండ్ల తర్వాత దివ్య, వంతిక 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.



ప్రపంచకప్ చెస్ టోర్నీలో రజత పతకం నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందను అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో ప్రజ్ఞానంద తల్లిదండ్రులు రమేశ్ బాబు, నాగలక్ష్మి కూడా ఉన్నారు.

'వయాకామ్ 18' చేతికి భారత క్రికెట్

మనం ఇంట్లో కూర్చున్నా... షాపుల్లో టీవీ ఆన్ చేసినా... టీమిండియా క్రికెట్ మ్యాచ్‌లు చూడాలంటే టీవీ రిమోట్‌తో ట్యూన్ చేసుకునేది స్టార్ స్పోర్ట్స్ చానెళ్లనే! అంతగా భారత్‌లో స్టార్ నెట్‌వర్క్ క్రికెట్ ప్రియుల మదిలో 11 ఏళ్లుగా (2012 నుంచి) తిష్ట వేసుకుంది. అయితే ఇప్పుడీ ట్రెండ్ మారనుంది. రిమోట్ తీసుకొని వయాకామ్ 18 నెట్‌వర్క్ చానెల్ 'స్పోర్ట్స్ 18'కు మారాల్సిందే!

రూ. 5,963 కోట్లతో మీడియా హక్కులు వశం

ముక్కోణపు పోటీలో రిలయన్స్ ధాటికి స్టార్ స్పోర్ట్స్, సోనీ స్పోర్ట్స్ అవుట్



న్యూఢిల్లీ: భారతీయ కార్పొరేట్ దిగ్గజ సంస్థ రిలయన్స్ గ్రూప్ క్రికెట్ హక్కుల్ని కైవసం చేసుకొంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం నిర్వహించిన ఇ-వేలం (ఆన్‌లైన్)లో స్వదేశంలో జరిగే అంతర్జాతీయ, జాతీయ మ్యాచ్‌ల్ని ప్రత్యక్ష ప్రసారం చేసుకొనే మీడియా హక్కుల్ని 'వయాకామ్ 18' దక్కించుకుంది. 2023-28 ఈ ఐదేళ్ల కాలానికి గాను సుమారు రూ. 6,000 కోట్లు చెల్లించేందుకు బిడ్ గెలిచింది. డిస్నీప్లస్ స్టార్, సోనీ నెట్‌వర్క్‌లతో ముక్కోణపు పోటీలో పాల్గొన్న వయాకామ్ 18... టీవీ, డిజిటల్ రైట్స్ కోసం అత్యధికంగా రూ.5,963 కోట్లు (720.60 మిలియన్ డాలర్లు)తో బిడ్ దాఖలు చేసింది. దీంతో పోటీ ప్రసార సంస్థలకు రిలయన్స్ చేతిలో చుక్కెదురైంది.

- మీడియా రైట్స్‌లో టెలివిజన్, డిజిటల్ (ఓటీటీ యాప్స్) హక్కులున్నాయి. ఈ రెండింటి కోసం వేర్వేరు బిడ్‌లను స్వీకరించారు. టీవీ హక్కులకు రూ.2,862 కోట్లు (345.90 మిలియన్ డాలర్లు), డిజిటల్ హక్కులకు రూ.3,101 కోట్లు (374.70 మిలియన్ డాలర్లు) చెల్లించేందుకు వయాకామ్ 18 బిడ్‌లు వేసింది.
- గత 2018-23 కాలానికి 'స్టార్ నెట్‌వర్క్' రూ. 6,138 కోట్లు చెల్లించింది. అయితే గత ఐదేళ్లలో సొంతగడ్డపై భారత్ 102 మ్యాచ్‌లు ఆడింది. కానీ వచ్చే ఐదేళ్లలో 88 మ్యాచ్‌లే ఆడబోతోంది.
- గత మీడియా హక్కులతో పోలిస్తే ఇది 12.92 శాతం ఎక్కువ. అప్పుడు మ్యాచ్‌కు రూ. 60 కోట్లు చెల్లించారు. ఇకపై మ్యాచ్‌కు రూ.67.75 కోట్లు చెల్లించాలి.
- క్రితంసారి మూడు విభాగాల్లో బిడ్‌లను స్వీకరించారు. భారత ఉపఖండపు టీవీ రైట్స్-రెస్టాఫ్ వరల్డ్ డిజిటల్ రైట్స్, భారత ఉపఖండపు డిజిటల్ రైట్స్, గ్లోబల్ కన్సాలిడేటెడ్ రైట్స్‌గా వర్గీకరించారు. కానీ ఇప్పుడు అవుట్ రైట్‌గా టీవీ రైట్స్, డిజిటల్ రైట్స్ అని రెండు రకాల గ్లోబల్ రైట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు!
- ఈ నెల 22 నుంచి భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరిగే సిరీస్‌తో 2023-28 సైకిల్ మొదలవుతుంది.
- ఈ ఐదేళ్ల సైకిల్‌లో టీమిండియా 25 టెస్టులు, 27 వన్డేలు, 36 టి20లు కలిపి మొత్తంగా 88 మ్యాచ్‌లు ఆడనుంది. ఆస్ట్రేలియాతో 21 మ్యాచ్‌లు, ఇంగ్లండ్‌తో 18 మ్యాచ్‌లు, కివీస్‌తో 11 మ్యాచ్‌లు, దక్షిణాఫ్రికాతో 10 మ్యాచ్‌ల్లో తలపడుతుంది.
- 'వయాకామ్ 18'కు స్పోర్ట్స్ హక్కులు కొత్తేం కాదు. ఇంతకుముందే ఐపీఎల్ డిజిటల్ హక్కుల్ని పొందింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), పారిస్ ఒలింపిక్స్, దక్షిణాఫ్రికా మ్యాచ్ లు, దక్షిణాఫ్రికా లీగ్, టి10 లీగ్ (అమెరికా), రోడ్‌సేఫ్టీ వరల్డ్ సిరీస్, ఎన్‌బీఏ, డైమండ్ లీగ్ తదితర ప్రపంచవ్యాప్త క్రీడల హక్కుల్ని కైవసం చేసుకుంది.
- 'వయాకామ్ 18' మీడియాలోని స్పోర్ట్స్ 18 టీవీ చానెల్‌లో, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించి జియో సినిమా యాప్‌లో క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం అవుతాయి.

'స్టార్ స్పోర్ట్స్'కు శుభం కార్డు!

రిలయన్స్ గ్రూప్ మీడియా హక్కులు దక్కించుకోవడంతో 'స్టార్ స్పోర్ట్స్'కు శుభం కార్డు పడినట్లయింది. 2012 నుంచి ఇప్పటివరకు అంటే 11 ఏళ్లుగా భారత్‌లో జరిగిన అంతర్జాతీయ, జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు డిస్నీ ప్లస్ స్టార్ నెట్‌వర్క్‌లోనే ప్రసారమయ్యాయి. ఐపీఎల్ మ్యాచ్‌ల టీవీ ప్రసార హక్కులు మాత్రం 'స్టార్ స్పోర్ట్స్' వద్దే ఉన్నాయి.

రూడ్‌కు చుక్కెదురు

రెండో రౌండ్‌లోనే ఓడిన ఐదో సీడ్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో గురువారం సంచలన ఫలితాలు నమోదయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో గత ఏడాది రన్నరప్, ఐదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఏడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. ప్రపంచ 67వ ర్యాంకర్ జీజెన్ జాంగ్ (చైనా) 3 గంటల 19 నిమిషాల్లో 6-4, 5-7, 6-2, 0-6, 6-2తో రూడ్‌ను ఓడించగా... ప్రపంచ 128వ ర్యాంకర్ డొమినిక్ స్ట్రికర్ (స్విట్జర్లాండ్) 4 గంటల 4 నిమిషాల్లో 7-5, 6-7 (2/7), 6-7 (5/7), 7-6 (8/6), 6-3తో సిట్సిపాస్‌పై సంచలన విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6-4, 6-1, 6-1తో మిరాలెస్ (స్పెయిన్)పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరాడు. మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ వొజ్నియాకి (డెన్మార్క్) 7-5, 7-6 (7/5)తో 11వ సీడ్ క్విటోవా (చెక్ రిపబ్లిక్)పై, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) 6-3, 6-4తో దరియా సావిల్లె (ఆస్ట్రేలియా)పై గెలిచి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-4, 6-2తో క్రిస్టోఫర్ ఒకానెల్-వుకిచ్ (ఆస్ట్రేలియా) జంటను ఓడించగా... సాకేత్ మైనేని (భారత్)-కరత్‌సెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో హుస్లెర్ (స్విట్జర్లాండ్)-లాస్లో జెరె (సెర్బియా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

మార్ష్ మెరుపులు

తొలి టి20లో ఆసీస్ ఘనవిజయం



దర్బన్: దక్షిణాఫ్రికాతో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా జట్టు ఘనవిజయంతో ప్రారంభించింది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 111 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 226 పరుగులు సాధించింది. కొత్త కెప్టెన్ మిచెల్ మార్ష్ (49 బంతుల్లో 92 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) కళ్లు చెదిరే ఇన్నింగ్స్ ఆడాడు. టిమ్ డేవిడ్ (28 బంతుల్లో 68; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్ష్ ఐదో వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 15.3 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (43 బంతుల్లో 56; 5 ఫోర్లు, 2 సిక్స్) మినహా మిగతావారు విఫలమయ్యారు. తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన లెగ్ స్పిన్నర్ తన్వీర్ సంఘా (4/31), స్టొయినిస్ (3/18) దక్షిణాఫ్రికాను దెబ్బ తీశారు. రెండో టి20 మ్యాచ్ నేడు జరుగుతుంది.

ఇంగ్లండ్‌దే తొలి టి20



చెస్టర్ లీ స్ట్రీట్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఇంగ్లండ్ జట్టు న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ముందుగా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (38 బంతుల్లో 41; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్రైడన్ కార్స్ (3/23), ల్యూక్ వుడ్ (3/37) న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు. అనంతరం ఇంగ్లండ్ దూకుడుగా ఆడి కేవలం 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి గెలిచింది. డేవిడ్ మలాన్ (42 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (27 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించారు. రెండో మ్యాచ్ నేడు జరుగుతుంది.

శ్రీలంక శుభారంభం

- బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్లతో విజయం
- పతిరనకు 4 వికెట్లు
- రాణించిన అసలంక, సమరవిక్రమ



పల్లెకెలె: ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నీలో శ్రీలంక 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన బంగ్లాదేశ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకొని 42.4 ఓవర్లలో 164 పరుగులకే ఆలౌటైంది. నజ్ముల్ హొసేన్ (122 బంతుల్లో 89; 7 ఫోర్లు) ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ షకీబ్ (5) సహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మతీశా పతిరన (4/32) బంగ్లాదేశ్ వెన్నువిరిచాడు. తీక్షణకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 39 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి గెలిచింది. చరిత్ అసలంక (92 బంతుల్లో 62 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), సమరవిక్రమ (77 బంతుల్లో 54; 6 సిక్స్‌లు) రాణించారు. ఇద్దరు నాలుగో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. నేడు మ్యాచ్‌లకు విశ్రాంతి దినం. శనివారం ఇదే మైదానంలో భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరుగుతుంది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నయీమ్ (సి) నిసాంక (బి) ధనంజయ 16; తాన్‌జిద్ హసన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తీక్షణ 0; నజ్ముల్ (బి) తీక్షణ 89; షకీబ్ (సి) కుశాల్ (బి) పతిరన 5; తౌహిద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 20; రహీమ్ (సి) కరుణరత్నే (బి) పతిరన 13; మిరాజ్ (రనౌట్) 5; మెహిదీ హసన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగె 6; తస్కిన్ (సి) తీక్షణ (బి) పతిరన 0; ఇస్లామ్ (నాటౌట్) 2; ముస్తాఫిజుర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరన 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (42.4 ఓవర్లలో ఆలౌట్) 164.** **వికెట్ల పతనం:** 1-4, 2-25, 3-36, 4-95, 5-127, 6-141, 7-162, 8-162, 9-164, 10-164. **బౌలింగ్:** కసున్ రజిత 7-0-29-0, తీక్షణ 8-1-19-2, ధనంజయ 10-0-35-1, పతిరన 7.4-0-32-4, వెలలగె 7-0-30-1, షనక 3-0-16-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) రహీమ్ (బి) ఇస్లామ్ 14; కరుణరత్నే (బి) తస్కిన్ 1; కుశాల్ (బి) షకీబ్ 5; సమరవిక్రమ (స్టంప్డ్) రహీమ్ (బి) మెహదీ హసన్ 54; అసలంక (నాటౌట్) 62; ధనంజయ (బి) షకీబ్ 2; షనక (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (39 ఓవర్లలో 5 వికెట్లకు) 165.** **వికెట్ల పతనం:** 1-13, 2-15, 3-43, 4-121, 5-128. **బౌలింగ్:** టస్కిన్ 7-1-34-1, ఇస్లామ్ 4-0-23-1, షకీబ్ 10-2-29-2, ముస్తఫిజుర్ 3-0-12-0, మిరాజ్ 5-0-26-0, మెహదీ హసన్ 10-0-35-1.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

సామాన్య భక్తులకు పెద్దపీట

- సిఫారసు లేఖలకు అనుమతి లేదు, ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు
- 18న ముఖ్యమంత్రి పట్టువస్త్రాల సమర్పణ
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి

తిరుమల: అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం కలెక్టర్, ఎస్పీ, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్, టీటీడీలోని అన్నివిభాగాల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 18న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా శ్రీనివాస సేతు, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాస్టల్ భవనం, తిరుమలలో విశ్రాంతి గృహాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని, వారికి సంతృప్తికరంగా వాహనసేవల దర్శనంతోపాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించమని, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తామని తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా సెప్టెంబరు 22న గరుడసేవ నాడు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు చేస్తామన్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ హరిత, ప్రధానార్చకుల్లో ఒకరైన వేణుగోపాల దీక్షితులు, జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, డీఎల్వో వీర్రాజు, అదనపు ఎస్పీ మునిరామయ్య, ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఆర్ఎం జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో 'నల్ల బంగారం'

నదీతీరంలో డ్రమ్ముల్లో కొబ్బరి చిప్ప బొగ్గు తయారీ

- సౌందర్య పోషణ, దేశ రక్షణకు సంబంధించిన విడి భాగాల తయారీలో వినియోగం
- తమిళనాడు, కేరళ, కర్ణాటక కన్నా మేలైన బొగ్గు ఉత్పత్తి
- చిన్నతరహా పరిశ్రమలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు

సాక్షి అమలాపురం: కోనసీమలో తయారయ్యే 'కొబ్బరి చిప్ప బొగ్గు' దేశంలోనే ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. ముఖ సౌందర్యానికి ఫేస్‌ప్యాక్‌గా, తాగునీటిని శుద్ధిచేసేందుకు వినియోగించడంతో పాటు పెట్రోలియం ఉత్పత్తులు, దేశ రక్షణకు చెందిన విడి భాగాలు, ఆటో మొబైల్ పరిశ్రమలలో కీలక విడిభాగాల తయారీలో ఈ బొగ్గు అత్యంత కీలక పాత్ర పోషిస్తోంది. తయారీదారుల ఇంట నల్ల బంగారమై మెరుస్తోంది. ఇటువంటి అత్యుత్తమమైన, నాణ్యమైన కొబ్బరి చిప్ప బొగ్గు తయారీకి కేరాఫ్ అడ్రస్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నిలుస్తోంది.

నదీతీరంలో బొగ్గు తయారీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం, అంబాజీపేట మండలాల్లో వైనతేయ నదీ తీరంలో బొగ్గు తయారవుతోంది. ఇక్కడ నుంచి ఏడాదికి రూ. 2 కోట్ల విలువ చేసే 700 నుంచి 900 టన్నుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారు. తమిళనాడులోని కాంగాయం, పల్లడం, కోయంబత్తూరు, కర్ణాటకలోని బెంగళూరు, తెలంగాణలోని హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు, మన రాష్ట్రంలోని నెల్లూ రు, గూడూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ప్రయోజనాలెన్నో..

కొబ్బరి చిప్ప బొగ్గు ప్రయోజనాలు తెలిస్తే నిజంగా నల్ల బంగారమే అంటారు. సౌందర్య పోషణకు


వైనతేయ నదీ తీరంలో తయారైన కొబ్బరి చిప్ప బొగ్గు

వాడే ఫేస్‌ప్యాక్‌లతోపాటు కాస్మోటిక్స్, సబ్బులలో వాడకం అధికం. ఆటోమొబైల్‌లో కీలకమైన స్పేర్ పార్టుల తయారీ, రక్షణ రంగంలో యుద్ధ పరికరాలు, గ్యాస్ మాస్కుల తయారీలో వినియోగిస్తారు. పెట్రోలియం, గ్యాస్ ఉత్పత్తిలో అధిక శాతం రికవరీకి ఇది దోహదపడుతుంది. నీటిలోని క్లోరిన్, పురుగు మందులు, మలినాలను, వైరస్, బ్యాక్టీరియాలను నివారిస్తుంది. దీనిలో అధిక ఉష్ణ విలువ ఉంటుంది. మండించడానికి సమర్థవంతమైన ఇంధన వనరుగా ఉపయోగపడుతుంది. చిప్ప బొగ్గుతో భూమిలో


డ్రమ్ములలో కొబ్బరి చిప్ప బొగ్గు తయారీ

వేగంగా సేంద్రియ కర్బనం ఉత్పత్తి అవుతుంది. బాగా ఆరిన కొబ్బరి చిప్ప బొగ్గు అత్యధిక ధర కేజీ రూ.35 నుంచి రూ.38 వరకు ఉండగా, ఈ ఏడాది ఆశించిన ఎగుమతులు లేకపోవడంతో ధర తగ్గిపోయింది. ప్రస్తుతం కేజీ రూ.24 నుంచి రూ.26 కాగా, తడిసిన బొగ్గు ధర రూ.19 వరకు మాత్రమే ఉంది. దీనివల్ల నష్టపోతున్నామని, ఎగుమతులు లేక సరుకు పెద్ద ఎత్తున పేరుకుపోయిందని, అక్టోబర్ నుంచి మంచి ధర వస్తుందని తయారీదారులు ఆశలు పెట్టుకున్నారు.

మన్నిక ఎక్కువ..

దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటక కన్నా ఇక్కడ ఉత్పత్తి అవుతున్న బొగ్గు నాణ్యమైంది. చిప్ప దళసరి కావడంతోపాటు దీనిలో అధిక శాతం గ్యాస్ నిక్షిప్తమైనందున ఇది వేగంగా మండుతోంది. మిగిలిన రాష్ట్రాలలో ఆరు బయట బొగ్గు తయారీ ఎక్కువ. కోనసీమలో బొగ్గు తయారీ డ్రమ్ములలో చేస్తారు. దీనివల్ల బూడిద శాతం తక్కువగా ఉంటోంది. ఇక్కడ తయారయ్యే బొగ్గు ఎక్కువ కాలం మన్నిక ఉండడంతోపాటు ధృడంగా ఉంటుంది.

మార్కెట్ అవకాశాలు పెరగాలి



మనం తయారు చేసే బొగ్గే అత్యంత నాణ్యమైంది. మార్కెటింగ్ అవకాశాలు పెద్దగా లేక అనుకున్న ధర రావడం లేదు. ఇతర ప్రాంతాల వారు ఇక్కడ నుంచి బొగ్గు తీసుకెళ్లి మరింత నాణ్యంగా తయారు చేసి కేజీ రూ.50 నుంచి రూ.70 చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. మనకు మాత్రం ఆ ధర రావడం లేదు. మార్కెటింగ్ అవకాశాలు పెరిగితే మరింత ధర వచ్చే అవకాశముంది.

– మట్టపర్తి రామకృష్ణ, ముంజువరం, పి.గన్నవరం మండలం

అత్యంత ధృడమైంది



ఇక్కడ తయారయ్యే కొబ్బరి చిప్పలో 80 నుంచి 90 శాతం మేర చిన్న చిన్న రంధ్రాలు ఉండడంతో ఎక్కువ కాలం మన్నిక ఉండడంతోపాటు ధృడంగా ఉంటోంది. ఆటోమొబైల్, రక్షణ పరికరాలు, పెట్రోలియం ఉత్పత్తుల తయారీలో అధికంగా వాడుతున్నారు.

– ఎ.కిరిటీ, ఉద్యాన శాస్త్రవేత్త, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం, అంబాజీపేట

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం

వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్టులో భాగంగా కోనసీమ జిల్లాను కొబ్బరికి ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇక్కడ చిప్ప బొగ్గు తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. కోకోనట్ బోర్డు, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రూ.25 లక్షల విలువైన యూనిట్‌కు 35 శాతం వరకు రాయితీ అందించనుంది. అంతకన్నా పెద్ద ప్రాజెక్టు పెట్టుకుంటే రూ.పది లక్షల వరకు రాయితీ ఇవ్వనున్నారు. జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజెన్సీ (జైకా) ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో జిల్లాలో కోకోనట్ మిల్క్ యూనిట్‌తోపాటు కోకోనట్ చార్ కోల్ పరిశ్రమ ఏర్పాటుకు ఉద్యానశాఖ సన్నాహాలు చేస్తోంది.

అక్టోబర్ 31న పైడితల్లి సిరిమానోత్సవం



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం విజయనగరం పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవ తేదీలను ఖరారు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి గురువారం తెలిపారు. అక్టోబర్ 4వ తేదీ నుంచి నవంబర్ 15 వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 30న తొలేళ్ల ఉత్సవం, 31న సిరిమానోత్సవం, నవంబర్ 7న పెద్దచెరువులో తెప్పోత్సవం, నవంబర్ 14న ఉయ్యాల కంబాల మహోత్సవం, నవంబర్ 15న చండీయాగం, పూర్ణాహుతి, దీక్షా విరమణలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

రేపు ఆదిత్య-ఎల్1 ప్రయోగం


- శనివారం ఉదయం 11.50 గంటలకు ఉపగ్రహంతో దూసుకెళ్లనున్న పీఎస్ఎల్‌వీ సీ57


సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో సిద్ధంగా ఉన్న పీఎస్ఎల్‌వీ సీ57

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) శనివారం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించబోతోంది. రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 11.50 గంటలకు ఈ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్వహించనున్నారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం 11.50 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. గురువారం షార్‌లోని బ్రహ్మప్రకాష్‌హాలులో మిషన్ సంసిద్ధత సమావేశం నిర్వహించారు. పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్‌కు అన్ని పరీక్షలు నిర్వహించి లాంచ్ ఆథరైజేషన్ బోర్డు(ల్యాబ్)కు అప్పగించారు. ల్యాబ్ చైర్మన్ రాజరాజన్ రాకెట్‌కు మరోసారి పరీక్షలు నిర్వహించి.. కౌంట్‌డౌన్, ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం ఇస్రో చైర్మన్ సోమనాథ్ షార్‌కు రానున్నారు. సహచర శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించి కౌంట్‌డౌన్ ప్రక్రియను పరిశీలిస్తారు. సూర్యుడు ఒక మండే అగ్నిగోళం.. అక్కడికి ఉపగ్రహాన్ని పంపిస్తే కాలిపోతుంది కదా.. అనే అనుమానం చాలా మందిలో ఉంటుంది. వాస్తవానికి ఈ ప్రయోగంలో భూమి నుంచి సూర్యుడి దిశగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రేజియన్ బిందువు-1(ఎల్-1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి దాదాపు 1,470 కిలోల బరువున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. దీనివల్ల గ్రహణాలతో సంబంధం లేకుండా సౌరగోళంపై నిరంతరం అధ్యయనం చేసేందుకు అవకాశం లభిస్తుంది. అక్కడికి చేరుకోవాలంటే 175 రోజుల సమయం పడుతుందని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చేలా అభివృద్ధి - సంక్షేమ కార్యక్రమాలు


వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి : ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పదవీ కాలం మరో 9 నెలల్లో ముగియనుందని.. అనంతరం జరిగే సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వరుస విజయాన్ని సొంతం చేసుకోనుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీకి రెండోసారి విజయాన్ని కట్టబెట్టేలా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విరాజిల్లుతున్నాయని పేర్కొన్నారు. తాడేపల్లిలో గురువారం ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2024 మార్చి 15లోగా ఏపీ శాసనసభ ఎన్నికల తేదీలు ప్రకటిస్తారని తెలిపారు. 2019 ఎన్నికల తేదీలు ప్రకటించేందుకు ఆరు నెలల ముందు నాటి అధికార టీడీపీ.. ఓటర్ల వ్యక్తిగత వివరాలను తనకు అనుకూలంగా వాడుకునేందుకు ప్రయత్నిస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తాయని, ఆ తర్వాత అవి వాస్తవాలన్న విషయం ప్రజలకు అర్థమైందని తెలిపారు. ఇంటింటికి వెళ్లి సర్వేల పేరుతో వివరాలు సేకరించి నాడు ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానుల ఓట్లు తొలగించే కార్యక్రమాలు టీడీపీ చేసిందని, వైఎస్ జగన్ నేతృత్వంలోని పార్టీ యావత్తూ ఉద్యమించి.. నాటి టీడీపీ సర్కారు అప్రజాస్వామిక చర్యలకు అడ్డుకట్టవేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజాహిత విధానాలు, కార్యక్రమాల కారణంగా వరుసగా రెండోసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని రాజకీయ నిపుణులు, విశ్లేషకులు కూడా అంచనావేస్తున్నారని చెప్పారు. నాలుగున్నరేళ్లుగా నగదు బదిలీ ప్రక్రియ విజయవంతంగా అమలవుతోందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనతో ప్రజలు గరిష్ట స్థాయిలో సంతృప్తి చెందుతున్నారని తెలిపారు. గత ఎన్నికలప్పుడు టీడీపీ అనుకూల మీడియా ప్రచారం చేసిన కట్టుకథలను కొంతమంది నమ్మి ఉండొచ్చని, కానీ ఇప్పుడు వైఎస్సార్‌సీపీ శాసన సభ, లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి తిరుగులేని విజయం సాధిస్తుందనడంపై రాష్ట్రం ప్రజానీకానికి ఎలాంటి అనుమానాలూ లేవన్నారు. వైఎస్సార్‌సీపీని రెండోసారి గెలిపించి తమ సంక్షేమానికి, ప్రగతికి మార్గం సుగమం చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారనేది జగమెరిగిన సత్యమని విజయసాయిరెడ్డి వివరించారు.

దసరా రోజున సమగ్ర మేనిఫెస్టో : చంద్రబాబు

సాక్షి, అమరావతి: దసరా పండుగ రోజున టీడీపీ సమగ్ర మేనిఫెస్టో ప్రకటిస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు తెలిపారు. అందరి సలహాలతో మేనిఫెస్టో రూపొందిస్తానన్నారు. శుక్రవారం నుంచి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమం ప్రారంభిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గురువారం బహిరంగ లేఖ రాశారు. 45 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, నేతలు 3 కోట్ల మంది ప్రజలను కలుస్తారని, అందరూ సహకరించాలని కోరారు.



స్థిరపడటం అంటే.. బాగా డబ్బు సంపాదించడం, కారు, బంగ్లాలు ఉండటం ఒక్కటే కాదు.. పెళ్లి చేసుకున్నప్పుడే ఆ జీవితం సంపూర్ణమవుతుంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండటం, బంధుత్వాలకు విలువ ఇస్తుండటంతో పెళ్లి చేయాలనే ఆలోచన వస్తే చాలు.. ఎక్కడెక్కడ పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలు ఉన్నారో, అబ్బాయిల వివరాలు ఇట్టే తెలిసిపోయేవి. క్షణాల్లో మాట కలపడం.. ఆ తర్వాత ముహూర్తాలు పెట్టేసుకోవడం, రెండు మనసులను ముడివేయడం చకచకా జరిగిపోయేవి. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పెళ్లంటే.. తల్లిదండ్రులు ఒకస్థాయి యుద్ధం చేయాల్సిందే. కులం, గోత్రం.. జాతకం.. ఆస్తులు.. అంతస్తులు.. గుణగణాలు.. ఇవన్నీ తలుచుకుంటే గుండె పగిలినంత పనవుతుంది. సంబంధం చూడటం మొదలు.. పెళ్లి పూర్తయ్యే వరకు సవాలక్ష సవాళ్లు. – సాక్షి, కర్నూలు డెస్క్

అరచేతిలో అన్వేషణ

పెళ్లిళ్ల పేరయ్యలు ఇప్పుడు బాగా తక్కువైపోయారు. ఒకప్పుడు చేతిలో ఒక బ్యాగు వేసుకొని, దాన్నిండా పెళ్లీడుకొచ్చిన అమ్మాయిలు, అబ్బాయిల ఫొటోలతో తెలిసిన వారి ఇళ్ల ముందు వాలిపోయేవాళ్లు. వీళ్లకు రూ.500, లేదా రూ.1000 ముందుగానే ఇచ్చుకుంటే సంబంధాలు వెతికిపెట్టేవాళ్లు. పెళ్లి సమయంలో కూడా వీళ్లకు అంతో ఇంతో ముట్టజెబుతారు. ఇప్పుడు మ్యాట్రిమోనీ సైట్‌లు పుట్టగొడుగుల్లా తెరపైకి రావడంతో అరచేతిలో అన్వేషణ మొదలైంది. ఎవరికి వారు తమ ఫొటో, ప్రొఫైల్ అందులో పెట్టేస్తుండటంతో ఎంతవరకు సరైన వివరాలు ఇచ్చారనే విషయం అంతుచిక్కని పరిస్థితి.



చూపులు కలవక.. మనసులు ముడిపడక!

పెళ్లీడు గండాలు

- ఉద్యోగంలో స్థిరపడనిదే అబ్బాయిలు ససేమిరా
- అక్కరకు రాని తల్లిదండ్రుల అభిప్రాయం
- వయస్సులో జరుగుతున్న పెళ్లిళ్లు తక్కువే..
- ఆస్తులు, అంతస్తులకే అధిక ప్రాధాన్యం
- ఎదురుకట్నంకు సిద్ధమవుతున్న పెళ్లికాని ప్రసాదులు
- ఇప్పుడిప్పుడే తెరపైకి ఏజెంట్ల వ్యవస్థ

కర్నూలు నగరానికి చెందిన ఓ యువకునికి రెండేళ్ల క్రితం ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. వయస్సు 27 ఏళ్లు. తల్లిదండ్రులు పెళ్లి చేద్దామని నిర్ణయించుకొని అమ్మాయి కోసం వెతకటం మొదలుపెట్టారు. అయితే వెళ్లిన ప్రతిచోటా సొంత ఇల్లు ఉందా? భూమి ఎంతుంది? ఇలాంటి ప్రశ్నలే కానీ అబ్బాయి గుణగణాలు, కుటుంబ నేపథ్యం ప్రస్తావనే రాకపోవడం గమనార్హం.

ఆళ్లగడ్డకు చెందిన ఓ యువకుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా బెంగళూరులో పని చేస్తున్నాడు. అమ్మాయి కూడా సాఫ్ట్‌వేర్ అయ్యుండాలనే నిబంధన పెట్టడంతో తల్లిదండ్రులు అష్టకష్టాలు పడి ఓ అమ్మాయితో ఆరు నెలల క్రితం ఎంగేజ్‌మెంట్ చేశారు. ఆ తర్వాత తాను ఎప్పుడు ఫోన్ చేసినా అమ్మాయి ఫోన్ ఎంగేజ్ వస్తుందనే కారణంతో ఈ బంధం అక్కడితో ముగిసిపోయింది.



పిల్లలు పెద్దవాళ్లు అవుతుంటే సంతోషంగా ఉంటుంది. ఉద్యోగాలు సంపాదిస్తే ఇక భయం లేదనిపిస్తుంది. ఆ తర్వాత వయస్సు గుర్తుకు వస్తే మాత్రం తల్లిదండ్రులకు కంటి మీద కునుకు దూరమవుతుంది. ఆధునిక ప్రపంచంలో అమ్మాయి, అబ్బాయిల్లో మొదట జీవితంలో స్థిరపడాలనే భావన అధికంగా కనిపిస్తుంది. ఆ తర్వాత పెళ్లి అనడం పరిపాటిగా మారింది. ఈ కోవలో చదువు పూర్తయ్యే సరికి సుమారు 25 ఏళ్లు వచ్చేస్తున్నాయి. ఆ తర్వాత ఉద్యోగంలో కుదురుకోవాలంటే మరో ఐదేళ్లు ఆవిరి కావాల్సిందే. కొందరు త్వరగానే దారిలో పడుతున్నా.. చాలా వరకు అమ్మాయిలు, అబ్బాయిలు చదువు, ఉద్యోగం వెంట పరుగులు తీస్తూ తమ వయస్సు కరిగిపోతుందనే విషయాన్నే మర్చిపోతున్నారు. తీరా ఉద్యోగం వస్తే.. అప్పుడు పెళ్లి ఆలోచన మొదలైనా తల్లిదండ్రులు వేట మొదలు పెడితే అప్పటికి కానీ అర్థం కావట్లేదు ముదిరిపోయామని. వయస్సు ఎంత? ఈ ప్రశ్న అవతలి వైపు నుంచి వస్తే చాలు ఇక పెళ్లి కావడం కష్టమనిపిస్తుంది. ఇక ఆ తర్వాత కూడా గొంతెమ్మ కోర్కెలతో కాలం గిర్రున తిరుగుతుంది. ఒక్కో సంవత్సరం గడిచేకొద్దీ పెళ్లి అయితే చాలన్నట్లుగా తయారవుతుంది వ్యవహారం.

వయస్సులో జరుగుతున్న పెళ్లిళ్లు అంతంతే..

పెళ్లి వయస్సు అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు. ఈ వయస్సులో జరుగుతున్న పెళ్లిళ్లు ఇప్పుడు దాదాపుగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. పట్టణాల్లో ఈ వయస్సు పెళ్లిళ్లు చాలా అరుదు. చదువు, ఉద్యోగం అనుకోవడంతోనే వయస్సు చేజారిపోతుంది. ఈ కారణంగా పెళ్లిళ్లు ఆలస్యమవుతూ ఒకరినొకరు అర్థం చేసుకోలేక గొడవలకు దారితీస్తుంది. ఇరువురి వయస్సులో వ్యత్యాసం కూడా సగం పెళ్లిళ్లను విడాకుల వరకు తీసుకెళ్తోంది.

1 ఏజెంట్ వ్యవస్థ

ఉన్న ప్రాంతాల్లో కోరుకున్న సంబంధాలు కుదరక ఇతర ప్రాంతాలకూ వెళ్తున్నారు. చివరకు కులాల ప్రస్తావన మర్చిపోయి సంబంధం దొరికితే చాలు అనుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఇందుకోసం శ్రీకాకుళం, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర ప్రాంతాల్లోనూ కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతున్నారు. పెళ్లి కొడుకు తరపున అమ్మాయికి భరణం చెల్లించి మరీ సంబంధం కుదుర్చుకుంటున్నారు. శ్రీకాకుళం పరిసర ప్రాంతాల నుంచి సంబంధం కుదిర్చేందుకు ఏకంగా ఏజెంట్ వ్యవస్థ ఏర్పాటైంది. రూ.2లక్షల నుంచి రూ.3లక్షల మేర వీళ్లకు ముట్టజెబితే కానీ సంబంధం దొరకని పరిస్థితి.

అబ్బాయిల తల్లిదండ్రుల్లోనే ఆందోళన

అసలే అమ్మాయిల కొరత. అబ్బాలు చదువు, ఉద్యోగం అని కాలం గడిచే కొద్దీ వయస్సు పెరిగి, అందుకు తగిన అమ్మాయి దొరక్క తల్లిదండ్రులు చుక్కలు చూస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమకు అబ్బాయి పుట్టాలని కోరుకోవడం కూడా ఇందుకు కారణమవుతోంది. ఇదే సమయంలో అమ్మాయి తల్లిదండ్రులు కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. పెళ్లి సంబంధం రాగానే.. అబ్బాయికి ఉద్యోగంతో పాటు భూములు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ రెండిటికే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.


డబ్బుకు ప్రాధాన్యం

ఒకప్పుడు పెళ్లంటే అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూడాలనేవాళ్లు. అంతేకాదు.. గుణగణాలను తెలుసుకునేందుకు ఎవరెవరినో విచారించే పరిస్థితి. ఇప్పుడు ఆ ఊసే కరువవుతోంది. అమ్మాయి దొరకడమే కష్టమవుతుండటంతో అటువైపు నుంచి కూడా ధోరణి మారిపోయింది. అబ్బాయి మంచివాడా, కాదా అనే విషయాలను పక్కనపెట్టి ఆస్తులు, అంతస్తులపైనే దృష్టి సారిస్తున్నారు. పైగా ఒక్కడే కొడుకు ఉంటే మంచిదనే భావన అమ్మాయి తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. ఉద్యోగంతో పాటు పొలం ఉన్న ఇంటికి తమ అమ్మాయిని పంపేందుకే ఇటీవల కాలంలో ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

ఆ రెండు కులాల్లో అమ్మాయిలు 10 శాతమే..

మ్యారేజ్ బ్యూరోలకు వచ్చే తల్లిదండ్రులు అబ్బాయికి లక్ష జీతం, 10 ఎకరాల పొలం ఉండాలని చెప్పడం పరిపాటిగా మారినట్లు తెలుస్తోంది. మరికొందరు ఉద్యోగం దొరికే వరకు వేచి చూస్తుండటం కూడా పెళ్లిళ్లు ఆలస్యం అవడానికి కారణమవుతోంది. ప్రస్తుతం రెండు కులాల్లో అమ్మాయిల కొరత ఎక్కువగా కనిపిస్తోంది. ఎంతలా అంటే.. వంద మంది అబ్బాయిలకు 10 మంది అమ్మాయిలు మాత్రమే ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఈ కారణంగా ఓ కులం అబ్బాయిలు ఇతర కులాల అమ్మాయిలు అయినా పర్వాలేదనే నిర్ణయానికి వచ్చేశారు.

30 ఏళ్ల తర్వాతే..



పెళ్లి వయస్సు బాగా పెరిగిపోతుంది. అబ్బాయి, అమ్మాయి జీవితంలో స్థిరపడటానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ కారణంగా 30 ఏళ్ల తర్వాత కానీ పెళ్లిళ్లు జరగడం లేదు. పెద్దల మాటకంటే, తమకు నచ్చితేనే పెళ్లి చేసుకుంటామని చెప్పడం కూడా ఆలస్యానికి కారణమవుతోంది.


– చిన్న వెంకటేశ్వర్లు, ఓపిక మ్యారేజ్ బ్యూరో, కర్నూలు

పిల్లలు చెప్పినట్లు వినాల్సిందే..

గతంలో తల్లిదండ్రులు ఓ సంబంధం చూసి పెళ్లి చేసుకోమంటే మారు మాట్లాడకుండా పీటలు ఎక్కేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. పెద్దల మాట కంటే.. పిల్లల అభిరుచికే ప్రాధాన్యం ఉంటోంది. ఒకరికొకరు నచ్చాలి. మాటామాట కలవాలి. డిన్నర్లు, డేటింగ్‌లు.. తలుచుకుంటే బుర్ర గిర్రున తిరుగుతుంది. ఇక కులగోత్రాలు, జాతకాలు సరేసరి. చదువు, ఉద్యోగ విషయంలో ఆచితూచి అడుగులు వేస్తుండటం.. అన్నీ సరిపోయాయి అనుకున్నా చివరి నిముషంలో ఏదో ఒక వెలితి బయటకు రావడంతో ఆ సంబంధం అక్కడితో ముగిసిపోతుంది. ఇలా వాళ్ల కోర్కెలకు అనుగుణంగా సంబంధాలు వెతికేందుకు తల్లిదండ్రులు చుక్కలు చూడాల్సి వస్తోంది. అతి కష్టం మీద సబంధం తీసుకొచ్చినా సాకులు చెప్పడంతో వ్యవహారం మళ్లీ మొదటికొస్తుంది. ఈ కారణంగా పెళ్లిళ్లు ఆలస్యమవుతుండటంతో ఇంట్లో సంతోషం ఆవిరవుతుంది.

పెళ్లికాని ప్రసాదులే..

సాధారణంగా అమ్మాయిలు వయస్సుకు రాగానే తల్లిదండ్రుల్లో పెళ్లి ఆలోచన మొదలవుతుంది. చదువు పూర్తి అవుతుందనగానే ఆ లోపు తగిన వరుడిని వెతికే పనిలో ఉంటారు. అయితే అబ్బాయిలు మాత్రం చదువుతో పాటు ఉద్యోగంలో స్థిరపడాలనే భావనతో వయస్సునే మర్చిపోతున్నారు. ఈలోపు ఆ వయస్సు అమ్మాయిలకు పెళ్లిళ్లు అయిపోతుండటంతో అబ్బాయిల పరిస్థితి గందరగోళంగా మారుతోంది. వయస్సుకు తగిన అమ్మాయిలు దొరక్క, ఉన్నా వాళ్ల తల్లిదండ్రుల ముందుజాగ్రత్త ప్రశ్నలతో పెళ్లికాని ప్రసాదులుగానే



మిగిలిపోతున్నారు. కొన్ని కులాల్లో అమ్మాయిల కొరత అధికంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఎదురు కట్నం ఇచ్చి కూడా పెళ్లి చేసుకుంటున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943